
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.APTEL / 2013 /50370



Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 22.04.2024 | సంపుటి : 10 సంచిక : 283 | పేజీలు : 12 వెల: రూ. 4/-

Follow :

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 9848328698



సామాన్యుని స్వరం

జనం గోసల గొంతుక జనంసాక్షి ఇది ప్రజల ఛానల్



JANAMSAKSHI TV



## 24న ఇంటర్ ఫలితాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈ నెల 24న విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ ఏడాది పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు ఒకేసారి వెల్లడించనుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. మార్చి 10 నుంచి ఈ నెల 10 వరకు మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. గతేడాదితో పోల్చితే

మిగతా 2లో..



## నాలుగేళ్ల డిగ్రీతో ఇకపై నేరుగా పీహెచ్‌డీ

### యూజీసీ కీలక నిర్ణయం

**దిల్లీ(జనంసాక్షి):** పీహెచ్‌డీకి సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కీలక నిర్ణయం ప్రకటించింది. యూజీసీ నెట్ (జూన్) సెషన్ పరీక్షలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు. నాలుగేళ్ల పాటు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉన్న విద్యార్థులు ఇప్పుడు నేరుగా యూజీసీ నెట్

మిగతా 2లో..

# ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేస్తాం



## ఆరు నూరైనా రుణమాఫీ ఆపేదిలేదు ఆగస్టు 15లోగా అమలు చేసి తీరుతాం

వచ్చే పంటలో ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తాం • ముఖ్యమంత్రి పదవిని నేను ఏనాడూ గర్వంగా భావించలేదు

ఆంధ్రాలో కాంగ్రెస్‌కు నష్టమని తెలిసీ సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు • నల్గొండ ఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన గడ్డ

భువనగిరి కోట.. కాంగ్రెస్ కంచుకోట • ప్రధాని మోదీ దెబ్బకు దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నాయి

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం ఆయన కుటుంబానికే ఉద్యోగాలు • భువనగిరి ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి



**భువనగిరి(జనంసాక్షి):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా చెబుతున్నా.. ప్రపంచం తలకిందులైనా సరే ఆగస్టు 15లోగా రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీ లో సీఎం ప్రసంగించారు. "నల్గొండ జిల్లా ఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన గడ్డ. భువనగిరి కోట.. కాంగ్రెస్ కంచుకోట అని ఎన్నోసార్లు నిరూపించారు. సీఎం పదవిని నేను ఏనాడూ గర్వంగా భావించలేదు.. బాధ్యతగా నిర్వర్తిస్తున్నా. మోదీ దెబ్బకు దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నాయి. వ్యవస్థలను చెరబట్టి విపక్షాలను బెదిరించేందుకు వాడుకుంటున్నారు. ఎన్నో రైతు ఉద్యమాలు చేసిన కమ్యూనిస్టులను కేసీఆర్ ఏనాడూ గౌరవించలేదు. మోదీ ప్రభుత్వాన్ని దించేందుకు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిసి వచ్చారు. పదేళ్లపాటు భారాస

మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్ మారణకాండ

# ఓ కుట్ర..!

### బీజేపీ నేతలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

కాల్పుల్లో మరణించింది 12 మందే.. మిగతా 17 మందిని హింసించి చంపారు

25న నారాయణపూర్, కాంకేర్, మోహ్లా-మన్పూర్ జిల్లాల్లో బంద్

అత్యవసర సేవలు,అంబులెన్సులు, పరీక్షాకేంద్రాలకు బంద్ నుంచి మినహాయింపు

కాంకేర్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ ప్రకటన



**హైదరాబాద్,ఏప్రిల్ 21 (జనంసాక్షి):** గిరిజనల హక్కులను, అటవీ సంపదను కార్పొరేట్ వ్యవస్థలకు ధారాదత్తం చేసేందుకు పాలకులు కుట్రలకు తెరతీస్తున్నారని, ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో సహచరులను కోల్పోయామని మావోయిస్టు పార్టీ పేర్కొంది. అయితే ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు చనిపోగా.. 17 మందిని పోలీసు బలగాలు పట్టుకొని తీవ్రంగా హింసించి హత్య చేశారని తెలిపింది. ఈ మేరకు నార్త్ సబ్ జోనల్ బ్యూరో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ప్రతినిధి మంగలి పేరిట విడుదలైన ప్రకటనలో ఈ మారణకాండకు వ్యతిరేకంగా గళం విప్పాలని, దీనికి వ్యతిరేకంగా ఏప్రిల్ 25న నారాయణపూర్, కాంకేర్, మోహ్లా-మన్పూర్ జిల్లాల్లో బంద్ చేపడుతున్నామని పిలుపునిచ్చింది. అన్ని వ్యాపార సంస్థలు,

మిగతా 2లో..

## రాజ్యాంగం మారిస్తే..

# బీజేపీ ఖేల్ ఖతం

### మోదీ,ఈడీకి భయపడేది లేదు • ఇండియాకూటమి నేతల పునరుద్ఘాటన

**రాంచీ(జనంసాక్షి):**కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ కూటమి పోరాడుతోందని ఇండియా కూటమి నేతలు పునరుద్ఘాటించారు. ఝార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన ఇండియా మెగా ర్యాలీలో పాల్గొన్న నేతలు, నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్రమంగా తమ నేతలను అరెస్టు చేశారని కూటమిని భయపెట్టాలని ఎవరూ ఎంత ప్రయత్నించినా, తాము భయపడమని స్పష్టం చేశారు. తమ కూటమి శక్తి బలంగా ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ అయినా, బీజేపీకు చెందిన ఎవరైనా తమ కూటమిని విచ్ఛిన్నం చేయలేరన్నారు బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఝార్ఖండ్‌లోని రాంచీలో మెగా ర్యాలీ నిర్వహించింది. ఉలుగులన్ న్యాయ్ మహార్యాలీ పేరుతో ఝార్ఖండ్ ముక్తి మోర్చా-ఏఓఓ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. తమ నేతలను అక్రమంగా అరెస్టు చేశారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే

**బీజేపీకి వ్యతిరేకంగా రాంచీలో మెగా ర్యాలీ**

మిగతా 2లో..







## మమ్మల్ని భాజపా టార్గెట్ చేసింది

### నాకు, నా మేనల్లుడికి ముప్పు పొంచి ఉంది: మమతా బెనర్జీ

**కోల్‌కతా(జనంసాక్షి)** తనని, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని భాజపా టార్గెట్ చేస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాము సురక్షితంగా లేమని, తమకు ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. టీఎంసీ పార్టీ అభ్యర్థి, మంత్రి బిప్లబ్ మిత్రాకు మద్దతుగా కుమార్‌గంజ్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు."సోమవారం పెద్ద

మిగతా 2లో..

# పంటనష్ట పరిహారం అందిస్తాం

### ఈసీ అనుమతి కోరతాం:మంత్రి తుమ్మల




**హైదరాబాద్(జనంసాక్షి):**అకాల వర్షాలతో జరిగిన పంటనష్టానికి పరిహారం అందిస్తామని, దీనిపై ఈసీని అనుమతి కోరతామని మంత్రి తుమ్మల తెలిపారు. కాగా రాష్ట్రంలో తాజాగా కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటనష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే పేర్కొన్న 2200 ఎకరాలకు అదనంగా, నిన్న కురిసిన అకాల వర్షాలతో మరో 920 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టానికి సంబంధించిన నివేదికలు అందిన వెంటనే రైతులకు పరిహార నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అకాల వర్షాలు రైతుల నడ్డీ విరుస్తున్నాయి. మొన్నటివరకు తగినంత నీరు లేక పంటలు ఎండపోవడంతో నష్టపోయిన రైతు, తాజాగా పండిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో నష్టపోతున్నాడు. ఈనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం పంటనష్టంపై దృష్టి సారించింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు దెబ్బతిన్న పంట వివరాలను సేకరిస్తున్నారు. తాజాగా కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటనష్టం వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు మేరకు అధికారులు పంట నష్టం వివరాల సేకరణకు ఉపక్రమించారు. ఇప్పటికే పేర్కొన్న 2200 ఎకరాలకు అదనంగా, నిన్న కురిసిన అకాల వర్షాలకు ఇంకొక 920 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు మంత్రితో పేర్కొన్నారు. రంగారెడ్డి, జనగామ, నిర్మల్ జిల్లాలలో కొత్తగా పంట నష్టం నమోదైనట్లు, అధికారులు మంత్రికి తెలియజేశారు. ఇప్పటికే మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానలకు పంట నష్ట పరిహారం విడుదల చేసేందుకు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదం కోసంకు విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. దానికి సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా,

మిగతా 9లో..

## ఇండియా కూటమిలో లుకలుకలు:మోదీ

**జైపూర్(జనంసాక్షి):** ఎన్నికలు పూర్తి కాకముందే ఇండియా కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు.లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రచారంలో దూకుడు పెంచారు. ఆదివారం(ఏప్రిల్21) రాజస్థాన్‌లోని జలోర్ ఎన్నికల సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీపై పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు.నేరుగా ఎన్నికల్లో పోటీ చేయలేని నేతలు కొందరికి రాజ్యసభకు వెళ్లేందుకు రాజస్థాన్ అడ్డాగా మారిందన్నారు.తొలుత దక్షిణాది నుంచి కేసీ వేణుగోపాల్, తర్వాత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇప్పుడు మరో నేత రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారని సోనియాగాంధీని ఉద్దేశించి మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు.'కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉంది. ఒకప్పుడు ఆ పార్టీ 400 సీట్లు గెలుచుకుంది.ఇప్పుడు కనీసం 300 సీట్లలో పోటీ చేయడానికి వాళ్లకు అభ్యర్థులే దొరకడం లేదు. తప్పులు చేసి చేసి ఈ పరిస్థితి తెచ్చుకున్నారు. ఇప్పుడు

మిగతా 9లో..



## రైల్వే వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు

### రాహుల్ గాంధీ ఆగ్రహం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బీజేపీ నేతృత్వంలోని కేంద్రం రైల్వే వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రైల్వేలను తన స్నేహితులకు విక్రయించేందుకు ఓ సాకు చూపుతోందని ఆరోపించారు.ఈ సందర్భంగా ఓ ట్విటర్ యూజర్ షేర్ చేసిన వీడియోను రాహుల్ గాంధీ రీట్వీట్ చేస్తూ.. రైలు ప్రయాణికుల కష్టాలను చూపించారు. రిజర్వ్ బోగీలోనూ ప్రయాణికులు కిక్కిరిసిపోయినప్పటికీ వైనాన్ని, బోగీలో చోటులేక టాయిలెట్ లో కూర్చుని ప్రయాణిస్తున్న అవస్థను ఈ వీడియోలో చూపించారు. మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని, జనరల్ బోగీలను తగ్గించి 'ఎలైట్ రైళ్ల'(లగ్జరీ ట్రైన్లను) మాత్రమే ప్రోత్సహిస్తుందన్నారు. తద్వారా అన్నీ వర్గాల రైల్వే ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతోందంటూ ఎక్స్ వేదికపై పోస్ట్ చేశారు.కన్ఫర్మ్ చేసిన టిక్కెట్లతో కూడా

మిగతా 2లో..

### రాహుల్‌కు స్వల్ప అస్వస్థత

2లో

## పేదల సొంతింటి కల నెరవేరుస్తాం:కిషన్‌రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి)**వచ్చే ఐదేళ్లలో దేశంలోని పేద, మధ్య తరగతి వర్గాల వారి సొంతింటి కలను సాకారం చేసే దిశగా మరో 3 కోట్ల ఇళ్లను మోదీ ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని కేంద్ర మంత్రి, తెలంగాణ భాజపా అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు.హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో సంకల్ప పత్రాన్ని ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి విడుదల

మిగతా 2లో..



## తడిచిన ధాన్యం కొనాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

2లో



## ఇజ్రాయెల్‌పై ఆంక్షలకు అమెరికా సిద్ధం

### ఆగ్రహం వ్యక్తం చేసిన నెతన్యాహు

**టెల్ అవీవ్(జనంసాక్షి)** 'ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్‌కు చెందిన 'నెట్జా యెహుదా' బెటాలియన్‌పై ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనీయులపై మానవ హక్కుల ఉల్లంఘనల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తాసంస్థ శనివారం ఓ కథనం ప్రచురించింది.నెట్జా యెహుదాపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పాలస్తీనావాసులపై హింసాత్మక చర్యలకు పాల్పడ్డట్లు గతంలో వార్తలు

మిగతా 9లో..

# అల్గిరెడ్డి దారెటు?

- ప్రవీణ్ రెడ్డి చూపు బీజేపీ వైపు..
- నమ్మించారు.. మోసం చేశారు..
- చివరి క్షణంలో చేతులేత్తారు..
- కాంగ్రెస్ పార్టీ హ్యాండివ్వడంతో ఖంగుతిన్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే

*హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అలిగిండు. పార్టీ నిర్ణయంతో ఒక్కసారిగా ఖంగుతిన్నడు. పార్టీలో ఆయన చేసిన సేవలకు, త్యాగాలకు విలువలు లేకుండా పోయాయి. టికెట్ ఇవ్వకుండా పార్టీ నాయకత్వం తీరని మోసం చేసింది. పోయిన అసెంబ్లీ ఎన్నికలో గెలిసే తనకు రావాలిసిన టికెట్‌ను పొన్నం ప్రభాకర్ కోసం త్యాగం చేశారు. ఆ తర్వాత పొన్నం ప్రభాకర్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. రాత్రింబవళ్లు తిరిగి కష్టపడి పొన్నం ప్రభాకర్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. అల్గిరెడ్డి కృషికి, పొన్నం గెలుపు కోసం పడ్డ ఆరాటాన్ని చూసి అప్పట్లో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇస్తామని నమ్మబలికారు. చివరి క్షణం వరకు తనకే టికెట్ ఇస్తామని నమ్మించి తెరపైకి వెలిచాల రాజేందర్ రావును తీసుకు వచ్చారు. అయినా ఢిల్లీలో మకాం వేసి అధిష్టానం పెద్దలతో మంతనాలు జరిపారు. సీఎం, మంత్రి పొన్నం కూడా తనకే టికెట్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా వెలిచాలకు ప్రచారం చేసుకో పొమ్మని పొగబెట్టారు. ఈక్షణం వరకూ మౌఖికంగా వెలిచాలకు టికెట్ ఇచ్చినా అధికారికంగా ప్రకటించలేదు.*


*– భీమదేవరపల్లి, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :*



కాంగ్రెస్‌లో జరిగిన రాజకీయ పరిణామాల మేరకు ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. చివరి క్షణం వరకు తనకే టికెట్ ఇస్తామని చెప్పి నమ్మించి తీరా ఇవ్వక పోవడంతో అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అలిగి నట్లు తెలుస్తోంది. పార్టీలో తగిన ప్రాధా న్యత లేక పోవడంతో ఆయన పక్కదారి పట్టే పరిస్థితులు కనిపిస్తున్నట్లు తెలి సింది. ఇక పార్టీ ఫిరాయింపు తప్పనిపరి స్థితి నెలకొంది. అయితే అల్గిరెడ్డిలో కూ డా చాలా ఆలోచనలో పడ్డట్లు, తర్జన భర్జన అవుతున్నట్లు తెలిసింది. బీజె పీలోకి పోతే ఎలా ఉంటుంది. మరో పార్టీ లోకి పోతే ఎలా ఉంటుంది. అనే ఆలోచ నలో పడ్డట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఒకరిద్దరు బీజేపీ అగ్ర నేతలు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మరో వైపు కేసీఆర్ కూడా ప్రవీణ్ రెడ్డితో మాట్లాడే పరిస్థితులు లేక పోలేదు. ఆ వైపు కూడా మంతనాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రవీణ్ రెడ్డి వర్గీయులు మాత్రం కాంగ్రెస్ అధినాయకత్వంపై సీరియస్ ఉన్నారు. కాంగ్రెస్ లో వద్దు మరో నిర్ణ యం తీసుకోవాలని ప్రవీణ్ రెడ్డి అనుచ రులు ప్రవీణ్ రెడ్డిపై ఒత్తిడి పెంచుతున్నా రు. మరో కోణం చూస్తే హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికలలో తన పదవిని త్యాగం చేసి పొన్నం ప్రభాకర్ ను గెలిపించడం లో ప్రధాన పాత్ర పోషించారు. అప్పట్లో అల్గిరెడ్డిని రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ఇద్దరు ఒప్పించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించు కుంటామని ఓ రాజకీయ ఒప్పందం ఉంది. ఆ ఒప్పందం మేరకు తనకేటికెట్ ఇవ్వాలని అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పట్టు పట్టాడు. చివరి వరకూ పోరాడారు. ప్రవీణ్ రెడ్డి కి రాజకీయ పరిచయాలు, వ్యక్తిగత సంబంధాలు మెండుగా ఉన్నా యి. దాంతో పాటు రెడ్డి సామాజిక ఓటు బ్యాంక్ ఉంది. ఈ బలం తో తనకు టికెట్ ఇస్తే గెలిచి వస్తానని అధిష్టానం వద్ద మొరపెట్టుకున్నాడు. ఎంపి టికెట్ ఇస్తా మని హామీ ఇచ్చినట్లు ఆమేరకు తనకే టికెట్ ఇవ్వాలని చివరి క్షణం వరకూ కొట్లాడారు. ప్రవీణ్ రెడ్డి అభ్యర్థిత్వం మేరకు అధిష్టానం సమాలోచనలు జరుపుతుంది. ఒక దశలో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే సర్పంచులు బీజేపీలో చేరారు.

అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కేటాయించినట్లు ప్రచారం జరి గింది. ఢిల్లీలో కాంగ్రెస్ అధి ష్టానం అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి కేటాయిం చినట్లు కాంగ్రెస్ వర్గాలు మొదట్లో ప్రచా రం చేశారు. మొదటి నుండి ప్రవీణ్ రెడ్డి వైపే మొగ్గు చూపిన కాంగ్రెస్ అధిష్టానం చివరిక్షణంలో వెలిచాల రాజేందర్ రావు ఫైనల్ చేయడంతో ప్రవీణ్ రెడ్డి వర్గీయులు ఖంగుతిన్నారు. హుస్నాబాద్ కాంగ్రెస్ లో ప్రవీణ్ రెడ్డి వర్గీయులు వెలిచాల రాజేందర్రావు గెలుపుకు కలిసి వస్తా రా..? అనేది వేచి చూడాల్సిందే. ప్రవీణ్ రెడ్డి అలిగినట్లు ఉన్నారు. అయితే ఆయ న కాంగ్రెస్లోనే ఉంటారా..? లేదా? మరో పార్టీకి పోతాడా..? వేచి చూడా ల్సిందే. మరో వైపు కాంగ్రెస్ పెద్దలు కూ డా ప్రవీణ్ రెడ్డిని బుజ్జగించే పనిలో పడ్డారు. ఇందులో ఇప్పటి వరకు అధి కారికంగా కాంగ్రెస్ టికెట్ను ప్రకటించక పోవడంలో మరో రాజకీయ కోణం లేక పోలేదని వాపోతున్నారు. హుస్నాబాద్ కు చెందిన ఆరుగు తాజా మాజీ సర్పంచులు బీజేపీలో చేరారు. బండి సంజయ్ వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలో రోజురోజు కు బీజేపీ బలం పుంజుకుంటోంది.

## రన్నింగ్ కామెంటరీ



విరగడైందట రాష్ట్రంలో
ఒక కేడీ పీడ
కావాలట దేశంలో
మోడీ కూడా..

కోరికలు ఉండటం
అందరికీ సహజం
ఓటరు చేతిలో ఉంది
నవ నిర్మాణ సమాజం

– పీఎస్ రవీంద్ర



రిక్షాలో వచ్చి ఓటు వేసిన త్రిపుర మాణిక్ సర్కార్ ఆయన భార్య. ఆయన గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.
–అగర్తల, ఏప్రిల్ 21 (జనంసాక్షి)

## ఆరూరి గెలుపు కోసం
# గడపగడపకు బిజెపి



**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :** వరంగల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ ను గెలిపించాలనికోరుతూ బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గంటే ఉపేందర్ ఆధ్వర్యంలో బిజెపి ఆధ్వర్యంలో గడపగడపకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటే ఉపేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం చిల్పూర్ మండలంలోని అన్ని గ్రామలలో శక్తి కేంద్ర ఇంచార్జ్, బూత్ అధ్యక్షులు, కన్వీనర్ల ఆధ్వర్యంలో గడప గడపకు భారతీయ జనతా పార్టీ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ ఆరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించి మూడోసారి నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా గెలిపించుకుంటామని తెలియజేయడం జరిగిందనిఅన్నారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్నా భారతీయ జనతా పార్టీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటే ఉపేందర్ యాదవ్,మండల ఇంచార్జ్ గంకిడి శ్రీనివాస్ రెడ్డి,ఎస్సి మోర్చా అధ్యక్షుడు రజినీకార్, మండల ప్రధాన కార్యదర్శి ముక్కెర శ్రవణ్ యాదవ్,వెలిశాల శ్రీనివాస్, కన్నెబోయిన అశోక్ యాద వ్,ఎస్సి మండల నాయకులు ఆరూరి కోర్నెల్ , ఊరటి రాజు,రమేష్ బీజేపీ సోషల్ మీడియా కొకన్వీనర్ ముక్కెర రమేష్ యాదవ్, కార్యకర్తలు, నాయకులు, బీజేపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా మాధ్యమాలను వినియోగించుకోవాలి


- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ ఈస్ట్ ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** సోషల్ మీడియా మాధ్యమాలను వినియోగించుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కార్యకర్తలను సూచించారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి సోషల్ మీడియా కార్యదర్శి, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, హన్మకొండ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి కేతిడి దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య గారి విజయమే లక్ష్యంగా వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని మరియు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ తీసుకురావాలని కోరారు. మీ అమూల్యమైన ఓటుతో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని అన్నారు.

టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి నవీన్ పెట్టేం మాట్లాడుతూ కార్యకర్తలందరూ ఇప్పడి నుండే ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పడి నుండే సోషల్ మీడియా డివిజన్ కమిటీలు, డివిజన్ అనుబంధ సంఘాల కమిటీలతో సన్నద్ధంగా ఉండాలి. తెలంగాణా ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, అలాంటి కాంగ్రెస్ పార్టీకి మనం పూర్వ వైభవం తీవాలంటే ఈ సారి మనం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావాలి. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కార్యకర్తలు ప్రతి ఒక్కరు తమ శక్తి మేరకు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. యువ న్యాయం, రైతు న్యాయం, నారి న్యాయం, శ్రామిక న్యాయం మరియు సమన్యాయం, ప్రచార కమిటీ, సోషల్ మీడియా, మీడియా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి.వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యా మాట్లాడుతూ మ్యానిఫెస్టో లోని 5న్యాయ సూత్రాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళాలి. మహిళా న్యాయంలో భాగంగా కేంద్ర ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం, సంవత్సరానికి ఒక లక్ష రూపాయలు మహిళలకు అందించటంబీ మహిళా ఉద్యోగులకు హాస్టల్స్ సంఖ్య రెట్టింపుబీ మహిళా హక్కుల సాధన, మహిళల అభివృద్ధి, సాధికారత, చైతన్యం పెంపునకు మేనిఫెస్టో ప్రాధాన్యత ఇచ్చింది. ఈ అంశాలను ఎప్పట్టికప్పుడు సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలి నన్ను మనస్పూర్తిగా ఆహ్వానించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు పార్టీలో ప్రతీ ఒక్కరి నుండి వచ్చే సహకారం ఇప్పుడు, ఎప్పుడు ఇలాగే ఉండాలి. దళితులు, మైనారిటీ ఓట్లను మనకు అనుకూలంగా మలచుకోవాలి. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు ఎప్పుడు కాంగ్రెస్ వైపే ఉంటారు. మీ అందరి సహకారంతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలను వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య, మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈ.వి. శ్రీనివాస్ రావు, టిపిసిసి ఎస్.సి. డిపార్టుమెంటు కో–ఆర్డి నేటర్ ఏం.పి. ఆనంద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, ఇనుగాల మానస రాంప్రసాద్, బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, సోషల్ మీడియా డివిజన్ అద్యక్షులు మండల అద్యక్షులు, నియోజకవర్గ అద్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి బిడ్డ నీలం మధును గెలిపించుకుంటాం




- తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం
- ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

**హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** మెదక్ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజ్ ను గెలిపించుకుంటామని తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం గారిని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మెదక్ పార్లమెంట్ పరిధి నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలలో బీసీలు గెలిచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. తమ శక్తి మొత్తాన్ని ఉపయోగించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. మెదక్ జిల్లాలోని ప్రజా సంఘాలన్నిటిని ఏకం చేస్తామన్నారు. బీఆర్ఎస్, బిజెపిలు ఒకే భావజాలంతో పనిచేస్తున్నాయని, ఈ ఎన్నికలలో ఆయా పార్టీలను ఓడించేందుకు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. మెతుకు సీమ నుంచి బరిలో నిలిచిన బీసీ బిడ్డ నీలం మధును గెలిపించుకుంటామని ప్రొఫెసర్ కోదండరాం దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గ నేత హనుమంత రెడ్డి, టీజేఎస్ నేతలు నిజ్జన రమేష్, అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బి.రమేష్, సర్దార్, వినోద్, ఆశప్ప, తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల్‌తో ఎంపీ అభ్యర్థి నీలం మధు భేటీ

**పటాన్‌చెరు, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** ఏఐసిసి సెక్రటరీ రోహిత్ చౌదరి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ తో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు భేటీ అయ్యారు. శనివారం రాత్రి పటాన్ చెరుకు నియోజకవర్గం ఐలాపూర్ కు విచ్చేసిన వారిని నీలం మధు పూల బుకే ఇచ్చీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏఐసిసి సెక్రటరీ రోహిత్ చౌదరి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ మెదక్ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై నీలం మధు తో చర్చించారు. ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించినటువంటి మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిగా చేసేందుకు ప్రణాళికలు రచించి ముందుకెళ్లాలని సూచించారు. ఇందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తోడ్పాటు ఎల్లవేళలా ఉంటుందని నీలం మధుతో ఈ సందర్భంగా వారు తెలిపారు. పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్, ప్రోటోకాల్ కమిటీ మెంబెర్ సూరజ్ తివారీ,మైనార్టీ జిల్లా అధ్యక్షులు హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటుహక్కును తప్పకుండా వినియోగించుకోవాలి


- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన




**బోథ్, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** గ్రామ ప్రజలు ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం రోజున స్వీప్ ప్రచార రథంలో గొండి భాషలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సిరికొండ మండలం నేరడిగొండ జి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా తో కలిసి గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు మంగళ హారతులతో ఎదురొచ్చి, మేళతాళాలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి ఐటిడిఎ పిఓ తో కలిసి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు జిల్లాలో స్వీప్ ప్రచార రథాన్ని గ్రామాల్లో తిప్పుతూ ఓటు పై అవగాహన కార్యక్రమాలు డివైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు.ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాల నిండినవారి పేరు ఓటరు జాబితాలో ఉండాలి, ఓటరు జాబితాలో పెరు లేనివారు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఫాం 6 తీసుకుని వారిని ఓటరుగా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో వందశాతం పోలింగ్ జరగాలని, గతంలో 92 శాతం పోలింగ్ జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దివ్యాంగులు ట్రాన్స్ జెండర్లు వయో వృద్దులు ఎన్నికలలో ఓటు వేసి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వాలని కోరారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అన్ని మౌళిక వసతులు కల్పించాలని ఏర్పాట్లలో ఎలాంటి లోటు ఉండకూడదని, తాగునీరు చైర్స్ తదితర తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 85 సంవత్సారాలు దాటిన వయో వృద్దులు,45 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉన్న పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే హెూమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని, గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఇప్పటివరకు మా గ్రామానికి కలెక్టర్ లు ఎవరూ రాలేదని, మొదటిసారి మీరు మా గ్రామానికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేశ్వర్లు తహసీల్దార్ విజయ కుమార్ ప్రత్యేక అధికారి ఆర్ అండ్ బి నర్సయ్య ఎపిఓ ఐకేపీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో సూర్యకాంతి అద్భుతమా?

*శ్రీ రామ నవమి సందర్భంగా ఆ రోజు మధ్యాహ్నం,12 గంటల నుండి దాదాపు 3 నుండి 3.5 నిమిషాల వరకు అయోధ్యలోని రామ్ లల్లా విగ్రహం నుదుటిపై సూర్యకాంతి పడే విధంగా సైంటిస్ట్ లు అద్దాలు మరియు లెన్స్ కలయికను ఉపయోగించి సూర్యకాంతి ఖచ్చితంగా విగ్రహం నుదుటిపైకి మళ్లించి నారు. బలరాముని పై 'సూర్య తిలకం ' అంటూ బ్రాహ్మణ వాద శక్తులు సైన్సు ను దైవ మహత్తుగా అబద్ధపు కథలకు తెర లేపగా, మత రాజకీయాల ఆధారంగా పని చేసే బిజెపి ఎన్నికల కోసం వాడుకోవడం సిగ్గుచేటైన విషయం.*



విగ్రహాల పైన సూర్యకాంతి ప్రసరింప చేయడం దేశంలో కొత్త ఏమి కాదు ఎల్లోరా గుహల్లోని 10వగుహలో ధర్మచక్రముద్రలో వున్న బుద్ధుడి మొహమ్మీద కాంతి ప్రసరించే ఏర్పాటు 7వశతాబ్దంలో ఏర్పాటు చేశారు.ఇతరమతాలు సైతం ఎల్లోరా లో వున్న విధంగా వివిధ రాష్ట్రంలో సూర్య కిరణాలు పడే ఏర్పాట్లు చేశారు .వీరంతా సైన్స్ ను ఉపయోగించు కోని రాతి విగ్రహాలకు అద్భుత మహత్తులుగా ప్రచారం చేస్తున్నారు.

గుడి కట్టింది విగ్రహం చేసింది విగ్రహానికి పూజలు అభిషేకాలు చేసేది మనిషి.గుడి నిర్మాణానికి అవసరమైన సైన్స్ అండ్ టెక్నాలజీ నీ మనుషులు సృష్టించిందే.ఆ గుడి మీద వచ్చే ప్రత్యక్ష పరోక్ష ఆర్థిక లాభం పొందేది మాత్రం పురోహితులు వ్యాపారులు .గుడి పేరుతో రాజకీయ వ్యాపారం చేసేది మాత్రం మత పార్టీ అయిన బీజేపీ పార్టీ. గుడి పేరుతో ఆర్థిక రాజకీయ సాంస్కృతిక దోపిడికి గురయ్యేది మాత్రం శ్రామిక ప్రజలే. మత బోదనలన్నీ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి వ్యతిరేకమైనవే.వారి మొదటి అవసరం శ్రామిక ప్రజలను మతం అనే మత్తు మందుతో దోపిడీ వర్గాల దోపిడీని ప్రశ్నించ కుండా ,ఐక్యం కాకుండా చేయడం అనే లక్ష్యము దాగి ఉన్నది.

భూస్వామ్య సమాజం అంతరించి ఆధునిక పెట్టుబడుదారి సమాజం కొనసాగుతున్నప్పటికీ నేడు పెట్టుబడి దారి అవసరాల రీత్యా సైన్సు టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ పాలక వర్గాలు మత పూజారులు కలిసికట్టుగా సైన్సు టెక్నాలజీ నీ ఉపయోగించుకొని కట్టు కథలు అల్లడం నేడు మరింత తీవ్రం అయింది. భక్తి ముసుగులో పెట్టుబడి దారులు, రాజకీయ నాయకులు,అధికారులు తమ నేర పూరిత చీకటి దందాకు రహస్య సమన్వయ కేంద్రాలు గా ఆలయాలు మసీదులు చర్చిలు బాబాల ఆధ్యాత్మిక కేంద్రాలు వర్ధిల్లు తున్నవి. మతమనే మత్తు మందుతో మతాలను ప్రోత్సహించే పాలక వర్గాలకు మత పెద్దలకు దాని ప్రచారకులకు ఆర్థిక రాజకీయ సాంస్కృతిక ప్రయోజనాలు వున్నాయి.

భారత ప్రభుత్వాలు ఓట్ల కోసం బ్రాహ్మణ వాద ఆధిపత్య పెత్తనం కోసం మత రాజకీయాల కొనసాగించడం ఒక అలవాటుగా మారిపోయింది. సైన్స్ ద్వారా జిమ్మిక్కులు మ్యాజిక్కులు చేస్తూ, మత మహిమలంటూ గారడి విద్యలు చేసే వేదికలుగా గుళ్ళు చర్చిలు మసీదులు కొనసాగుతున్నాయి. బిజెపి పార్టీ తమ ఓటు బ్యాంకు కోసం మతాన్ని తిరుగులేని ఆయుధంగా వాడుతున్నారు. ఆధునిక పెట్టుబడిదారీ రాజ్యాలు అంటే మత సంబంధంలేని లౌకిక రాజ్యంగా రాజ్యాంగం లో చెప్పుకున్నప్పటికీ పాలకవర్గాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించి మత భావాలను రెచ్చగొట్టడం మత ప్రచారం కొనసాగించడం విస్తృతంగానే కొనసాగిస్తున్నారు. ప్రజల ఆర్థిక సామాజిక జీవితాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేయకుండా ,దేశాన్ని ఉన్నత పథం లోకి తీసుక పోకుండా అభివృద్ధి నిరోధక మత భావాల చుట్టూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నించడం తీవ్రమైన నేరం అవుతుంది.

**- జంపన్న**

## లోపాలే శాపాలు...

మన మనసులో
దూరిన
దుష్టతలంపులే
భయపెట్టే భూతాలు...
కక్ష ద్వేషం
పగా ప్రతీకారాలు
అసూయ,అత్యాశ
అహంకారాలు...

మోసం దగా
దౌర్జన్యాలు
మనలోని లోపాలు
కనపడని కల్మషాలు...
ఆ లోపాలు పెరిగితే
పాపాలౌతాయి
ఆ పాపాలు ముదిరితే
శాపాలౌతాయి.



ఆపై మన బ్రతుకులు
నరకకూపాలౌతాయి...
జీవితాలు ఆరిపోయే
దీపాలౌతాయి... జాగ్రత్త...

**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**
**9110784502**

# ఓట్ల బహిష్కరణ రెఫరండమేనా?

**ఎన్నికల లో ఓట్ల బహిష్కరణను ప్రభుత్వం పాలన మీద రెఫరండం గానే అనుకోవాలా? నాగాలాండ్ లో ఈనెల 19 న జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ను నాలుగు లక్షల మంది బహిష్కరించారు. ఇది కేంద్రం మీద, రాష్టం మీద అతి పెద్ద నిరసన గా పేర్కొనవచ్చు! మొత్తం ఆరు జిల్లాల్లో 'జీరో' శాతం పోలింగ్ నమోదు అయ్యింది.ఒక రాష్ట మంత్రి ని, పలువురు ఎమ్మెల్యే లను కూడ పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళనీయకుండా నాగాలాండ్ పీపుల్ ఆర్గనైసేషన్ అడ్డుకున్నది. ఇక్కడ ఎక్కడ కూడ పీఎం మోడీ హవా లేదు, ఇక్కడ వికాస్ అంటే ప్రగతి జీరో అంటారు జనం, తమకు ఇచ్చిన ఒక్క హామీ కూడ అమలు చేయలేదని వారు పేర్కొన్నారు. ఇది నాగాలాండ్ పరిస్థితి కాగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోను పోలింగ్ అంత ఆసక్తి కరంగా జరుగలేదు.వందశాతం పోలింగ్ కోసం కొట్లాది మంది ఓటర్ల తో ప్రమాణాలు చేయించినట్లు ఒక వైపు ఎన్నికల కమిషన్ డంకా బజాయించుకోగా, ఈ నెల 19 న జరిగిన 102 పార్లమెంట్ సీట్లలో పోలింగ్ శాతం 2019 కన్నా తక్కువ నమోదు అయ్యింది. ఓటర్లు ఎందుకు ఓటు వేయడానికి ఉత్సాహం తెలుపలేదు. మరో వైపు తమ పేర్లు చచ్చిపోయినోళ్ల కింద నమోదు చేసి ఓట్లు మాయం చేసారని ఉత్తరఖండ్ లోని నైని తాల్ లో 15 మంది ఓటర్లు ఈసి కి పిర్యాదు చేసారు. దేహారాదూన్ లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.**




ఈ ఉత్తరఖండ్ రాష్ట్రంలో 60 లక్షల మందితో తప్పని సరిగా ఓటు వేస్తామని ఈసి ప్రమాణం చేయించింది, అంటారు. అక్కడే 2019 లో 64 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 53 శాతం నమోదు అయిందట! ఇలా దేశంలోని చాలా చోట్ల 50 శాతం కూడ నమోదు అయిన దాఖలా ఉన్నది. ఇక మణిపూర్ లో నైతే పోలింగ్ బూత్ ల మీద దాడి, ఫైరింగ్, ఈవిఎం ల దహనం, ఇద్దరి మృతి లాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.మణిపూర్ లో ప్రశాంతత నెలకొన్నది అని చెప్పుకుంటున్న పాలకులకు ఈ నెల 19,20 తేదీలలో జరిగిన హింసాత్మక సంఘటనల గురించి జవాబు దారి తనం లేదు. ఒక్క సారి కూడ మణిపూర్ ను సందర్శించని, కనీసం ఎన్నికల ప్రచారానికి కూడ అక్కడకు వెళ్ళని పీఎం నరేంద్ర మోడీ విధానాలను ఏమనాలి?

### మణిపూర్ పట్టని పీఎం!





అక్కడ ఇద్దరు యువతులను నగ్నంగా ఊరిగించి, అత్యాచారం జరిపిన దుండగుల గురించి పట్టదు, ఉన్నావ్ సంఘటన, అంకిత బండారి, హత్రాస్ లో దళిత యువతి పై అత్యాచారం జరిపి, ఆతర్వాత చంపి న సంఘటన, ఆమె శవాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా పోలీస్ లు దహనం చేసిన పరిస్థితి మీద, అంతర్జాతీయ స్థాయి కుస్తీ ఛాంపియన్ బిడ్డల మీద బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల పై జరిగిన ఆందోళన, వారి మీద లాటీ ఛార్జి లాంటి సంఘటనలు, బిల్కీస్ బాను పై అత్యాచారం, కుటుంబ సభ్యుల హత్య కేసులో శిక్ష అనుభవవిస్తున్న వారి విడుదల పై కూడా పీఎం మోడీ మాట్లాడరు, పైగా బేటీ బడావో, పడావో, బచావో నినాదాలు ఇస్తారు. అసలు దేశంలో ఆడబిడ్డల మీద పీఎం కు గాని, బీజేపీ కి గాని, ఏమాత్రం ప్రేమ, గౌరవం లేదు. రైతులు, నిరుద్యోగుల మీద శ్రద్ధ లేదు. ప్రభుత్వ రంగం మీద కోపం, ఆయన ప్రభుత్వ రంగం పుట్టిందే చావడానికి అని ఒక సందర్బంగా పేర్కొన్న విషయాన్ని ఎలా దేశం లోని ఉద్యోగులు మర్చి పోగలరు!

### ప్రభుత్వ రంగం నాశనం!

ప్రభుత్వ రంగం ను సర్వ నాశనం చేసిన, చౌక బారుగా కార్పొరేట్ లకు అమ్మి వేసిన, ఇంకా అమ్ముతునే ఉన్న,పీఎం మోడీ ని ఎలా ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు మర్చి పోతారు.దేశంలోని రైల్వే లు, ఎయిర్ పోర్టులు, పోర్టులు, స్టేడియం లను సైతం తన మిత్రులు, అదాని, అంబాని లకు అమ్మి వేసిన పరిస్థితిని, కార్పొరేట్ లకు 16 లక్షల కోట్లు ఋణ మాఫీ ని ఇచ్చి, బ్యాంకులు దివాలా తీయడానికి పీఎం మోడీ కారణం కాదా?ఇలా ప్రస్తుతం దేశం పరిస్థితికి, కనీస ఆదాయం లేని కుటుంబాల పరిస్థితికి, ఉపాధి దొరకని కొట్లాది యువత పని, పాట లేకుండా ఉండడానికి కారణం అయిన వారి మాటలు, చేతల అనుభవం ఉంది కాబట్టే నాగాలాండ్ లోని ఆరు జిల్లాల్లో 4 లక్షల మంది ఓటర్లు ఓటు వేయలేదు. వారు ఇలా ప్రభుత్వం మీద తమ నిరసన తెలిపారు.ఇది కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ల పాలనకు రెఫరాండం లాంటిది అనక తప్పదు! వారు ప్రభుత్వం కు వ్యతికం అనుకున్నపుడు, అలా ఓటు ద్వారా బుద్ధి చెప్పాలి, కాని వారు ఓట్లు బహిష్కరించి తమ నిరసన తెలిపారు.

### మోడీ వ్యతిరేక గాలి!

దేశంలో పీఎం మోడీ వ్యతిరేక గాలి వీస్తున్నది, తానా షాహిగిరి కి వ్యతిరేకంగా గాలి వీస్తున్నది అనడానికి నాగాలాండ్ నిదర్శనం గా పేర్కొనవచ్చు! మొత్తానికి ఈ ఎన్నికలు ఈ దేశం అణగారిన ప్రజల ఆత్మ అయిన రాజ్యాంగం పరిరక్షణ కోసం, ఒక వ్యక్తి మాట్లాడే,న్యాయం, అన్యాయం పైన స్పందించి, స్వేఛ్ఛ, స్వతంత్రము గా గొంతు విప్పి నిరసన తెలిపే హక్కు నిచ్చిన ప్రజాస్వామ్యం ను కాపాడుకున దానికి జరుగుతున్న ఎన్నికలు గా గుర్తించాలి! మనం జీవించే హక్కును పరిరక్షించుకునే ఎన్నికలు గా ప్రతీ ఒక్కరు గుర్తించాలి!



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

# ఆధునిక భారతదేశ నిర్మాణం
# డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్థిక విధానాలు

*ఆధునిక ప్రపంచంలో మన భారతదేశ దిశను మార్చడానికి, దేశంలోని ప్రజల ఉన్నతి కోసం,మానత్వ ఉద్ధరణ కోసం,నవ భారత నిర్మాణం కోసం మానవ అభివృద్ధికి కావాల్సిన అన్నిరకాల వనరులు గల సంపన్న దేశంలో చాతుర్వర్ణ వ్యవస్థలో అణిచివేత విలయతాండవం చెందుతున్న సమయంలో ఏప్రిల్ 14,1891 లో మధ్యభారతం లోని "మౌ" పట్టణంలో పుట్టిన వైతాళికుడు, ఆధునిక భారత దేశ పితామహుడు, డాక్టర్.భీంరావు రాంజీ అంబేద్కర్, ఇంగ్లీషులో ఒక సామెత ఉంది అదేమిటంటే మహోన్నత్వం ఎప్పుడూ దురభిప్రాయాలకి బలవుతూనే ఉంటుంది.ఈమాట మహోన్నత మైన వ్యక్తులందరికీ వర్తిస్తుందో లేదో చెప్పలేము కానీ డాక్టర్ అంబేద్కర్ కి మాత్రం ఇది వందకి వందశాతం సరిపోతుంది.*




డాక్టర్ భీంరావు రాంజీ అంబేద్కర్ ని "బాబాసాహెబ్" అనే పేరుతో పిలుస్తుంటారు. ఆయన ఎన్నో అవమానాల్ని, అన్యాయాల్ని, దురాచారాల్ని ఎదుర్కోవాడమే కాకుండా వాటినుండి శక్తిని గ్రహించి దేశ బలహీనతలను నిర్మూలించి దేశాన్ని ఒక ఆరోగ్యకరమైన ఆర్థిక,ఉన్నతమైన, మహోన్నతమైన దేశంగా నిర్మించేందుకు ఆర్థిక,సామాజిక, రాజకీయ ప్రణాళికలను అనేక అవరోధాలను ఎదుర్కొని సమర్ధవంతంగా సాధించడం జరిగింది. బాబాసాహెబ్ ముంబాయి విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తిచేసిన తర్వాత కొలంబియా యూనివర్సిటీ,లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి డాక్టరేట్ పట్టా తీసుకున్నారు. బార్ ఎట్ లా చేశారు. ఆర్థికశాస్త్రం, సమాజ శాస్త్రం, మానవశాస్త్రం, సైన్స్, బయాలజీ,కామర్స్ సబ్జెక్టులకి సంబంధించి ఆయన అనేక పుస్తకాలను రాశారు. బాబాసాహెబ్ తన చదువులో ఆర్థిక శాస్త్రానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరిగింది,అణిచివేయబడిన కులంలో పుట్టినందుకు చదువు,అర్హతలు అన్ని ఉన్నప్పటికీ ఆయన అనేక కష్టాల పాలయ్యారు. కానీ తన జ్ఞానాన్ని దేశ ప్రజల శ్రేయస్సే కేంద్రంగా,దేశ అభివృద్ధి, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా,వ్యవసాయ,పారిశ్రామిక రంగలా పై దృష్టి సారించారు.

డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక ప్రణాళిక గురించి చూసినట్లయితే ఆయన ఉన్నత విద్య,పరిశోధనలు ఆర్థిక శాస్త్రంలోనే అమెరికా, ఇంగ్లాండ్‌లలో జరిగాయి. అప్పుడు పరిశోధనా వ్యాసాలు,పుస్తకాలురాయటమే కాక,ఇండియా కు తిరిగి వచ్చిన తరువాత కూడా ఆర్థిక అంశాలమీద ఆయన అనేక రచనలు చేసినారు.వాటి లో వ్యక్తికరించబడిన ఆయన భావాలు,ఆలోచనలనే అంబేద్కర్ ఆర్థిక విధానాలుగా చెప్పుకోవచ్చు. అంబేద్కర్ ఆర్థిక పరిశోధనలు మరియు 'స్టేట్స్ అండ్ మైనారిటీస్', 'కులనిర్మూలన' 'బుద్ధుడు లేక కార్ల్ మార్క్స్' మొదలైన ఆయన రచనలలోని అంబేద్కర్ ఆర్థిక భావాలు,ఆలోచనలను చూడవచ్చు.

**ఆర్థిక పరిశోధనలు :** ఉన్నత విద్య అభ్యశించడానికి అంబేద్కర్ 1913 లో బరోడా మహారాజు ఇచ్చిన ఉపకార వేతనంతో అమెరికా వెళ్లినాడు.అక్కడి కొలంబియా యూనివర్సిటీ లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ. చదువుతూ 1915 లో "ఏన్సీయంట్ ఇండియన్ కామర్స్"అనే వ్యాసాన్ని రాసి సమర్పించారు.అటు తర్వాత అంబేద్కర్ రాసిన "నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా-ఏ హిస్టారికల్ అండ్ అనలిటికల్ స్టడీ" అనే పరిశోధనా వ్యాసానికి ఆయనకు కొలంబియా యూనివర్సిటీ పిహెచ్డి డిగ్రీ ప్రదానం చేసింది.దీనినే తరువాత విపులీకరించి "ఎవాల్యూషన్ ఆఫ్ ప్రొవిన్సియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా" పేరున పుస్తకంగా ప్రచురించారు.ఇందులోని బడ్జెట్ ను గురించిన అధ్యాయాలను అనేకమంది చదివేవారు.ఉన్నత విద్యను కొనసాగించాలనే కోరికతో అంబేద్కర్ కొల్హాపూర్ మోహారాజు సమకూర్చిన ఆర్థిక సాయంతో 1920 లో లండన్ వెళ్లినాడు.1921 లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ పొలిటికల్ సైన్స్ లో "ప్రొవిన్సియల్ డిసెంట్రలైజేషన్ ఆఫ్ యిమ్ పీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా" అనే పరిశోధన పత్రాన్ని సమర్పించి ఆర్థిక శాస్త్రంలో యం,ఎస్సి డిగ్రీ పొందారు. 1922-23 లో సమర్పించిన 'ప్రాబ్లెమ్ ఆఫ్ ది రూపి' అనే పరిశోధనా పత్రానికి లండన్ యూనివర్సిటీ అంబేద్కర్ కు ఆర్థిక శాస్త్రంలో డి.యస్సి డిగ్రీని ప్రధానం చేసింది.ఇందులో అంబేద్కర్ బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను విమర్శిస్తూ రాశారు.లాండన్ లోని"గ్రేస్ యిన్"లో న్యాయ శాస్త్రాన్ని అభ్యసించి 'బార్ ఎట్ లా' డిగ్రీని పొందారు. అంబేద్కర్ తన పరిశోధనలో బ్రిటీష్ పాలకుల ఆర్థిక విధానాలలోని లోపాలను ఎత్తి చూపినారు. వాటివల్ల ఇండియాలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, భూమిషిస్తూ అధికంగా ఉండి రైతులమీద పెనుభారాన్ని మోపుతుందని,వారిలో పేదరికాన్ని పెంచి సామాజిక అస్థిరతకు దారితీస్తుందని అన్నాడు.మొత్తం ప్రభుత్వ రాబడులతో భూమిషిస్తు ఒక్కటే యాభై శాతానికి మించి వుండి వ్యవసాయం మరియు ఇతర పరిశ్రమల అభివృద్ధిని నిరోధిస్తుందని అన్నాడు. ప్రభుత్వ పన్నుల విధానం అన్యాయంతో కూడి వుంది లోపభూయిష్టంగా ఉందన్నాడు. వాణిజ్య పన్ను వాణిజ్య అభివృద్ధికి నిరోధకంగా ఉందని, భూస్వాములు పేద కౌలుదార్ల ఆదయాలతో విలాస జీవితం గడుపుతూ ఉంటే బ్రిటీష్ అధికారులు అధిక వేతనాలు,సౌకర్యాలూ కలిగి ఉన్నారని, ప్రభుత్వం వారి నుండి ఏ పన్నునూ వసూలు చేయడంలేదని అన్నారు.ప్రభుత్వ రాబడులలో ఎనభై శాతాన్ని మిలిటరీ,పోలీసు,న్యాయ పాలన మీదనే వ్యయం చేశారని, రోడ్లు,నీటిపారుదల వంటి పబ్లిక్ వర్క్స్ ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అంబేద్కర్ తీవ్రంగా విమర్శించారు

**చిన్న కమతాల సమస్య :** మన దేశ వ్యవసాయరంగంలో చిన్న కమతాలు అధిక సంఖ్యలో వుండి,వాటిలో ఉత్పాదకత తక్కవగా ఉండేది .ఇందుకు ముఖ్య కారణం కమతాల విభజనేనని,చిన్న కమతాలను సమీకృతం చేసి పెద్దవిగా మార్చితే ఉత్పాదకత పెరుగుతుందని చాలామంది విశ్లేషించి వాటి సమీకరణకు వివిధ పద్ధతులను సూచించారు. అంబేద్కర్ 'ఇండియా లో చిన్న కమతాలు-పరిష్కారాలు 1928' అనే తన రచనలో ఈ పెద్ద కమతాల సూచనను సరియైన పరిష్కారం కాదని తిరస్కరించారు. ఉత్పత్తి కారకాలను సరియైన పాళ్ళల్లో ఉపయోగిస్తే గరిష్ట ప్రతిఫలం,రాబడి ఉంటాయన్నారు.లాభ సాటి కమతం లేక కుటుంబ కమతం అంటే కుటుంబానికి సరిపడేటాయాన్నిచ్చే కమతం అనే నిర్వచనం సరియైనది కాదని, పెట్టుబడులకు మించిన రాబడి వస్తే అది లాభసాటి కమతం అవుతుందని చెప్పారు,వ్యవసాయంలో ఉత్పాదకత తక్కువ వుండటానికి అధిక శ్రమికుల వత్తిడే కారణమని, పారిశ్రామికీకరణ ద్వారా వ్యవసాయ రంగం నుండి శ్రామికులను తరలించడమే సరైన పరిష్కరమని చెప్పినారు .ఇందుకోసం "స్టేట్ సోషలిజం" అవశ్యకమని, అందులో భూమిని ప్రభుత్వ యజమాన్యాలో ఉంచి, రష్యా, చైనాలలో లాగా సమిష్టి వ్యవసాయ పద్ధతిని అనుసరించాలని, వ్యవసాయానికి, పరిశ్రమ లకు కావలసిన మూలాధానాన్ని ప్రభుత్వమే సమకూర్చలని చెప్పారు, సమిష్టి వ్యవసాయంవల్ల శ్రామికులకు ఉపాధి భద్రత,కనీస ఆదాయాలు లభించి, గ్రామీణ పేదరికం, సంపద, ఆదాయాల పంపిణీలో అసమానతల సమస్య కూడా పరిష్కరించబడుతుందన్నారు. అంబేద్కర్ మన సమాజంలో సమూలమైన మార్పులను సాధించడానికి నిరంతరం ఆలోచనలు, కృషిచేసిన గొప్ప మేధావి,నవ భారత నిర్మాత, మనదేశంలో బ్రిటిష్ వలస పాలకులు చేసిన ఆర్థిక దోపిడీని వ్యతిరేకించారు. అంబేద్కర్ మన సామాజిక ఆర్థిక వ్యవస్థ మార్పునూ,దానికి ప్రత్యామ్నాయంగా సోషలిస్టు సమ సమాజ వ్యవస్థ నిర్మాణాన్నే కోరుకున్నారు..



**డాక్టర్ దేవిదాస్ సక్పాల్**
**ఎడ్యుకేషనల్ ఆక్టివిస్ట్**
**9912227425**

## ఓటు విలువ తెలుసుకో.. ప్రజాస్వామ్యం పరిరక్షించు

ఓటుహక్కు ప్రాజాస్వామ్య భవిష్యత్తుకు పునాది. ఆయుధం, పోలింగ్ రోజు ప్రభుత్వం సెలవు ఇస్తుంది. దేశరాష్ట్ర భవిష్యత్తులను నిర్ణయించడానికి ఓటు ఉపయోగపడుతుంది. డబ్బుకు, మద్యానికి ఓటు అమ్ముకోకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి. భారత రాజ్యాంగం ఆర్టికల్326 ద్వారా ఓటుహక్కును ఓటు హక్కు కల్పించారు. ఓట్లు సేకరణ కోసం వివిధ పద్ధతులున్నాయి. ప్రభుత్వాలు కూడా ఆధార్ తో అనుసంధానం చేసి 18 సంత్సరాలు పూర్తి కాగానే ఓటు నేరుగా ఇవ్వాలి. ఓటు ఎంతో శక్తి వంత మైంది. చాలాప్రభుత్వాలనుఎన్నుకోవడం,దించి వేయడం కేవలం ఓటు ద్వారా జరిగింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఖరీదయినవిగా మారిపోయాయి. దానికి బాద్యుడు ఓటర్లు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును అంతేస్ఫూర్తి తో వినియోగించాలి. అరిస్టాటిల్ అన్నట్లు ఉత్తమ ఓటర్లు ఉత్తమ ప్రభుత్వా న్ని ఎంపిక చేసుకుంటారు. చలి చీమలు సైతం బలవంతమైన సర్పాన్ని చంపిన ట్లు సామాన్య ఓటర్లు ఎంత పెద్ద నియంతనైన కూల్చగల రు.నిజమైన సర్వభౌధికారులు అంతిమంగా ప్రజలే. అంటేఎన్నుకునే,పాలించే,పాలితులుగా ఉండేది ఓటర్లు. అందుకే నీతి నిజాయితీ,రాజ్యాంగ స్ఫూర్తి తో ఓటరు గా నమోదు మనబాధ్యతసక్రమవినియోగం కూడా అంతే.అందుకే ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. నిర్లక్ష్యం వీడి ఎటువంటి ప్రలోభాలు కు లోనుకాకుండా నీతి నిజాయితీ తో ఓటు వేస్తే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. అందుకే అరిస్టాటిల్ చెప్పునట్లు ఉత్తమ పౌరులు ఉత్తమ రాజ్యం నిర్మిస్తారు.చెడ్డ పౌరులు చెడ్డరాజ్యాన్ని నిర్మిస్తారు. ఇదే ఓటరుకు వర్తిస్తుంది. మంచి ఓటరు మంచి రాజ్యా న్ని నిర్మిస్తారు.ఓటు శక్తివంత మైన ఆయుధం.

**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్ ఇన్ పాలిటిక్స్**
**9440408080**

## ధరామృతం

పెరిగే జన గణం నిరంతరం
తరిగే వనరు తరం తరం
ఆశలు తీరవు అనంతరం
జనావసరాలకు వనాలు బలిచేయడం
వన వనరు నిత్యం జన సరుకుగా
మారటం తరువులు లేని ఎడారులు
చేయటం
చుక్క నీరింకని నేల
ధర పొరలలో జాడ లేని జల ధార
ఎంతో లోతుకు చేరిన నీటి తెర
అంబులేని ఊరు
ధన తుల్యమైన నీరు
తీర్చే నా !?
నీటి ట్యాంకర్లు కరువు
మనిషి బ్రతుకు ప్రశ్నార్థకం
జీవ మనుగడ అసాధ్యం
చేయాలి మేధా మధనంతో
మేఘ మధనం
క్షితిజలో ఆపాలి క్షామం
నీరింకు మార్గాలతో చేయాలి క్షేమం
సహజ వనరు కావద్దు సంద్రం పాలు
చెరువులు త్రవ్వి ఆపి నిలుపాలి
పెంచాలి పాతాళ జలఊట
వాడాలి అవసరార్థం ప్రతిపూట
చేయొద్దు వృధా ప్రయోగం
జల మే పచ్చని ప్రకృతికి ఆలవాలం
జీవ క్షుత్తు ను తీర్చే వరం
జలం ధరామృతం
అది జీవసుకృతం
జనం కావాలి జాగృతం
చేయాలి ప్రకృతిని పవిత్రం
ముప్పైమూడు శాతం అడవులతో
వాతావరణం సమతుల్యం
మనిషికో చెట్టు నాటాలి
నేడది సమతూకం
సహజ వనరులతో
జీవావరణ వ్యవస్థ సవ్యం
చేకూర్చుకుంటుంది
స్వచ్ఛందంగా స్వస్థత
ధరామృతం జీవసుకృతం
జనం కావాలి జాగృతం
చేయాలి ప్రకృతిని పవిత్రం

**సంధ్య సూత్రావె,**
**హైదరాబాద్**
**9177 615967**

## నవ్వే 'పువ్వు' కావాలి

నవ్వితే వచ్చేది అందం
నవ్విస్తే కనపడేది ఆనందం
నవ్వే పువ్వు నీవైతే అదే భందం
నవ్వుతూ నవ్విస్తే అదే అనుబందం
నవ్వులు పూయిస్తే పరమానందం
నవ్వుల నజరానే ప్రేమానుబంధం
నవ్వుల చూపులే ఆభిమానాల
అనురాగాలకు నెలవు
నవ్వు నవ జీవన బృందావనం
నవ్వు తో సంతోష సంబరాల వింథు
ఉరుకుల పరుగుల జీవితంలో
హాయి నిచ్చేది నవ్వు
నవ్వుతో ఉత్సాహం ఉల్లాసాలకు
మేలుకొలుపు
నవ్వుతో సహజీవనం
సహనానికి ఉద్దీపనం
నవ్వుతో నడక సౌభ్రాతృత్వ
సౌభాగ్య సౌందర్య సంపదలకు
తరగని నిధి
నవ్వు మమత మానవీయతకు పెన్నిధి
నవ్వు సామాజిక సమరసతకు సన్నిధి
మనసార నవ్వు మనోశాంతికి చోటివ్వు
ఐదు నిమిషాల నవ్వు ఆయురారో
గ్యాలకు నెలవు
నవ్వక పోతే బిపి నవ్వితే హ్యాపీ
నవ్వితే రాలు నవ రతనాలు
నవ్విస్తే రావు ఏ కలహాలు
నవ్వితే దొరికేది ప్రశాంతత
నవ్వక పోతే అశాంతి ఆందోళన
నవ్విస్తే దొరికేది స్నేహం
నవ్వుల్లో బ్రతకాలి నిండుగ
నవ్విస్తూ ఎదగాలి మెండుగ
నవ్వుతూ నడవాలి ముందుకు
నవ్వుకుంటూ నీలో నీవే మెల్లగా
నవ్వించు నలుగురు నిను మెచ్చగ
నవ్వించు నలుగురి ఆరోగ్యాన్ని
పెంచగ
నవ్వులపండుగ అందరి ఎదల
నిండగా
నవ్వు ఆత్మస్థైర్యానికి ఆలంభనైతె
ఆందోళన ఆత్మన్యూనత అంతమై
అభివృధి పురోభివృద్ధి వికసిస్తది నవ్వు
వేదికగ నవలోకాన్ని నిర్మించు
నవ్వు జీవన శైలిలో అంతర్భాగమైతె
ఆత్మీయత అనురాగం అభిమానాలకు
నీవు చిరునామ కావాలి
ప్రేమతో నవ్వు నలుగురిలో నువ్వు
నవ్వుల జల్లు హరివిల్లైతే
హాయి ఎంజాయ్ ఆటౌతుంది
నవ్వుల పూతోటలో
నడయాడే నవ యవ్వన
సుమధుర పరిమళాల పంట కావాలి
నీవు నవ్వకపోవడం రోగం నవ్వితే
యోగం
నవ్వుదాం నవ్విద్దాం
ఖర్చులేని నవ్వుతో కల్మశాలను
కడిగెద్దాం
కలహాలు లేని లోకాన్ని నిర్మిద్దాం


**- నేదునూరి కనకయ్య**
**హైదరాబాద్**
**9440245771**

# మల్కాజ్ గిరి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం


### ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

**ఎల్బీనగర్ ఏప్రిల్ 21(జనం సాక్షి)**

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో బిఎన్ రెడ్డి నగర్ కాలనీలోని వారి నివాసంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బిఆర్‌యస్, బిజెపి పార్టీలనుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధులుగా శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజ్ గిరి నియోజకవర్గం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి విచ్చేసారు. వీరి సమక్షంలో నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బిజెపి, బిఆర్‌యస్ పార్టీ లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పలువురు కుల సంఘాల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సుమారు 1500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్



జెండా ఎగురుట ఖాయం అని అన్నారు. మన ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మన తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు కలిగిస్తున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో యస్‌సి సెల్ నాయకులు జోగురాములు, మహిళా నాయకురాలు కోటగిరి ఉషారాణి ,యువ నాయకులు మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరినారు. ఇంకా రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జూపల్లి అంజయ్య ఆధ్వర్యంలో బచన్, రషీద్ ఆధ్వర్యంలో, మౌలానా భాష ఆధ్వర్యంలో జువ్వగాని రాజు గౌడ్ ఆధ్వర్యంలో పాశం శ్రీకాంత్ ఆధ్వర్యంలో, సిలిమర్తి శేఖర్ ఆధ్వర్యంలో, కార్తీక్, జితేందర్, కార్తీక్, జితేందర్, పాటి రాంబాబు గౌడ్, వరలక్ష్మి, సరస్వతి, పద్మ ,అమృత ,మాధవి, రేణుక, గణపతి నాయక్, గోవర్ధన్ నాయక్, శ్రీధర్, శేఖర్, సునీత, వాణి, అనంతుల ప్రహ్లాద్ రాజు, హరి, అభి ,ఆటో వెంకట్ ,టీంకు, ప్రశాంత్, సతీష్, దినేష్ అంజమ్మ, కోటి, నరేష్, నాగరాజు, సత్యనారాయణ, కృష్ణ, మణి, చంద్ర శేఖర్,యాదగిరి ,నరసింహ గౌడ్, ఆనంద్, ప్రసాద్, తిరుపతి, జానకి తదితరుల ఆధ్వర్యంలో 1500 మంది పార్టీ లో చేరినారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, మల్లారపు షాలిని, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ధనరాజ్ గౌడ్ ,వెంకట కృష్ణ, సుధీర్, అలెక్స్, సునీల్, రమేష్, చరణ్, సరస్వతి, రాహుల్, సాయి తదితరులున్నారు.



## యువకులు ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

### మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి

**వికారాబాద్ రూరల్ ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉపాధి అవకాశాలు వెతుక్కోవాలని వికారాబాద్ మున్సిపల్ ఫ్లోర్ రీడింగ్ పట్టడ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ మున్సిపల్‌లోని వికారాబాద్ మెయిన్ రోడ్డులో శ్రీ బాలాజీ తారాచంద్ ఫ్యామిలీ దాబాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ యువతీ యువకులు ఉపాధి అవకాశాలు వెతుక్కోండి సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది చదువుకున్న ప్రతి ఒక్క యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికారాబాద్ పట్టణంలో ధాబాను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆయన చూపిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ వెంకటేశం, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, బాలాజీ, తారాచంద్, ఫ్యామిలీ ధాబా యజమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సియులో అకడమిక్ వాతవరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఎబివిపి

- మద్యం మత్తులో విద్యార్థులపై దాడి చేసి, గాయాలు చేసుకోని ఎస్ఎఫ్ఐ దాడిచేసినట్లు చిత్రికరణ
- పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- ఎస్ఎఫ్ఐ ప్రెస్ మీట్‌లో నేతలు




**హైదరాబాద్ ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో సమావేశం జరిగింది. ఈ ప్రెస్ మీట్‌లో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు, హెచ్‌సియు విద్యార్థి, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు శివదుర్గారావు, హెచ్‌సియు విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, హెచ్‌సియు యూనిట్ కార్యదర్శి కృపాజార్జ్, హెచ్‌సియు. విద్యార్థులు, ఎబివిపి దాడిలో గాయపడిన విద్యార్థులు మెహిత్, ఆషిక, ఖాయినీ, ఫైజల్‌లతో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎప్రిల్13న ఎకానామిక్స్ డిపార్మెంట్స్ ఫేర్వెల్ పార్టీ జరుగుతున్న సందర్భంలో ఎబివిపికి చెందిన వారు మద్యం మత్తులో అల్లరి చేస్తూ పాటల విషయంలో గోడవ చేస్తుంటే విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో దివ్యాంగుడైన స్కాలర్‌పై అకారణంగా దాడి చేశారు. ఈ దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారని అక్కసుతో తిరిగి17వ తేదీ మైనారిటీ వర్గానికి చెందిన ఫైజల్ అనే విద్యార్థిపై విచక్షణా రహితంగా కిరాతకంగా దాడి చేశారు. గొంతు నులిమి బెదిరింపులకు పాల్పడ్డారు. జె హస్టల్స్ దగ్గర దాడి చేస్తుంటే అడ్డుకున్న ఇతర విద్యార్థులపై కూడా మద్యం సేవించి హాకీ స్టిక్లతో దాడిచేశారు. అమ్మాయిలు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిని లైంగిక వేధింపులు గురిచేశారు. పోలీసులు ఈ ఘటనలో నిష్పక్షపాత విచారణ జరిపి దాడి చేసిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము. విద్యార్థులపై యూనివర్శిటీ సెక్యూరిటిపై దాడి చేస్తున్నట్లు వీడియో పుటేజ్ ఆధారాలు ఉన్న యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు. వారిని యూనివర్శిటీ నుండి రస్టికేట్ చేయాలని, చేసేంత వరకు పోరాడతామని తెలిపారు. ఈ ప్రెస్ మీట్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు స్టాలిన్, సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్‌లో డీకే అరుణ గెలుపు ఖాయం

### ఎమ్మార్పీఎస్ ఈ ఎన్నికల్లో బిజెపికి సంపూర్ణ మద్దతు

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ పార్లెంటులో బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు ఖాయమని, గెలుపు బాధ్యత ఎమ్మార్పీఎస్‌దే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు ప్రధాని మోదీ భరోసా ఇవ్వడం ఎంతో సంతోషకరం అన్నారు. మోదీ ఎస్సీ వర్గీకరణ హామీని నిలబెట్టుకుంటారని తాను విశ్వసిస్తున్నానని, దేశ అభివృద్ధి ప్రధాని మోదీ తోనే సాధ్యమని, మాదిగా జాతి ఉన్నతి బిజెపి గెలుపుపై ఆధారపడి ఉన్నదన్నారు. మాదిగల వర్గీకరణ కోసం ఎందరో రాజకీయ నాయకులను కలిశామని, కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. 2013 లో సోనియా గాంధీ ఇచ్చినమాట నిలుపుకోకుండా మోసం చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అదికారంలో ఉన్నప్పుడు పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేదని ప్రతిపక్షంలో ఉండి కూడా ఆ పార్టీ మాదిగలనుమోసం చేసిందన్నారు. మాట ఇస్తే నిలుపుకునే వారిలో మోదీని మించిన వాళ్లు లేరని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచని అయోధ్యలోని రామ మందిర వివాదాన్ని పరిష్కరించి అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేపట్టారని , 371 ఆర్టికల్ రద్దు, అగ్రకులాలకు రిజర్వేషన్ ఇలా ఎన్నో చేశారాన్నారు. అందుకే మోదీ మాటపై తనకు నమ్మకం ఉందని ప్రధాని మోదీ మాదిగల సమస్యలు వినేందుకు మావద్దకే వచ్చారన్నారు. ఎస్సి వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కు తాని అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం బిజెపి జాతీయ




ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి జరుగుతుందని, గత 30 ఏళ్లుగా మందక్రిష్ణ మాదిగ నిరంతరం పోరాడుతూనే ఉన్నారని అన్నారు. కిషన్ రెడ్డి ఆద్వర్యంలో ఈ సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెల్లారని, ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ప్రధాని మోదీ మాదిగలకు భరోసా ఇచ్చారనీ ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పలమూరు జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి టైగర్ జంగయ్య, ఎంఆర్‌పిఎస్ జాతీయా నాయకులు కొల్లశివ, తెలంగాణ రాష్ట్ర విద్యార్థిసంఘం అధ్యక్షులుకార్తీక్, ఎంఎస్‌పి నారాయణపేట జిల్లా అధ్యక్షులు గుడిసె వెంకటయ్య, బిజెపి దళిత మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బిజెపి దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్, కృష్ణయ్య, కుంటి కేశవులు, రామచందర్, ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు పోలే బాలయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ సక్సెస్



### ఎప్పుడూ అందుబాటులో ఉంటానని

### కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి స్పష్టం


**శేరిలింగంపల్లి ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

చేవెళ్ళ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి. రంజిత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమక్షంలో స్థానిక నియోజకవర్గ ఇంఛార్జీ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆదివారం విజయవంతమయింది. వేలాది మంది యువతతో ఆల్విన్ కాలనీ వద్ద భారీ ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు. అనునిత్యం చేవెళ్ళ ప్రగతి కోసం పని చేసే నాలాంటి నాయకుడికే ఓటేయాలని కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి ప్రత్యేకంగా కోరారు. తొలుత ఆయన స్థానిక నాయకులతో వీరాంజనేయ శివాలయంలో పూజలు నిర్వహించారు. ఆల్విన్ కాలనీలో ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎల్లమ్మబండ, ఆల్విన్ కాలనీ హైదర్ నగర్ మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం రంజిత్? రెడ్డి స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల సమయంలో తన కోసం కష్టపడితే ఎల్లకాలం ప్రతి కార్యకర్తకు తాను సేవ చేస్తానని ఉద్ఘాటించారు. బీజేపీ అభ్యర్థి అభివృద్ధి ఎజెండాతో కాకుండా మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని రంజిత్ రెడ్డి మండిపడ్డారు. తాను సర్వ మతాలను గౌరవిస్తానని అన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎప్పుడు కూడా ప్రజలకు అందుబాటులో లేరని



ఆరోపించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ఈశ్వర్ గౌడ్, 124 కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, గొట్టిముక్కల వెంకట్రావు, హైదర్ నగర్ సీనియర్ నాయకులు సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత అన్ని రంగాలలో రాణించాలి



- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- మండల పార్టీ అధ్యక్షుడు రహీముద్దీన్‌కు ఘన సన్మానం

**దౌల్తాబాద్ ఏప్రిల్ 21(జనం సాక్షి)**

మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నూతన టీ పాయింట్ ప్రారంభించారు. తదనంతరం ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగాలే లక్ష్యంగా కష్టపడుతూ తగిన ఫలితం రాలేదని నిలుచాపడకుండా ప్రాంతాలకు అనుకూలంగా వ్యాపారాల్లో రాణీంచవలసిన అవసరం ఎంతగానో ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం వైపు వెళ్తుంటే ఉద్యోగాలు రాక నిరాశకు గురై చాలామంది యువత ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూస్తున్నామన్నారు. అలా కాకుండా మన దుబ్బాక నియోజకవర్గం యువత మరింత చైతన్యమై చిన్న చిన్న వ్యాపారాలో సైతం రాణించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కు నెలసరి వేతనంపై ఆధారపడి జీవించాలన్నారు. కానీ వ్యాపారమైతే ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ డబ్బులను సంపాదించుకుని అవకాశం మన కళ్ళ ముందు ఉన్నప్పటికీ మనం గమనించకపోవడం బాధాకరమన్నారు. మా చిన్నతనంలో హైదరాబాదుకు తక్కువ వేతనాలకు ప్రైవేటు దుకాణాల్లో జీతాలు ఉన్న యువకులు నేడు వందల మంది యువతరానికి దిక్సూచిగా వ్యాపారంగంలో మంచి ఫలితాలను రాణిస్తున్నారు. అదే మార్గంలో నక్క సురేష్ దొమ్మాటలో తన వ్యాపారాన్ని వేగవంతం చేసి దౌల్తాబాద్ మండలానికి దిక్సూచిగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తనయుడైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి, మండల అధ్యక్షులు సయ్యద్ రహీమోద్దీన్, మండల యువజన అధ్యక్షులు నర్రా రాజేందర్, డబ్బా ప్రశాంత్, శ్రీను, స్వామి, రాజు, అంజి, విష్ణు, వెంకన్న, భిక్షపతి, గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ మండల అధ్యక్షులకి ఘన సన్మానం

ఇటీవల మండల బిఆర్ఎస్ అధ్యక్షుడిగా ఎంపికైన సయ్యద్ రహిముద్దీన్‌ను ఆదివారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి నర్రా రాజేందర్‌లు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు వేరువేరుగా మాట్లాడుతూ మీలాంటి నాయకుల సేవలు పార్టీ గడ్డికాల ఉన్న సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అన్నారు. సయ్యద్ రహీముద్దీన్ నక్సలైట్‌గా సర్పంచ్‌గా ప్రస్తుతం జిల్లా కోఆప్షన్ సభ్యులుగా కొనసాగుతున్నప్పటికీ జనానికి మంచి చేసే నాయకుడిగా ప్రజల్లో పేరున విషయాన్ని మన పార్టీ గుర్తించడం సంతోషకరమన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు ప్రత్యేకంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

### కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి

**ఎల్బీనగర్, ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

ఎంపీగా ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి పార్టీ మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కొరకు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ ఎస్కేడి నగర్ పరిధిలోని నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శ్రీధర్ రావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



## మోడి నాయకత్వాన్ని కోరుకుంటున్న యువత

### ఈటల రాజేందర్

**శామీర్ పేట్ ఏప్రిల్ 21 (జనం సాక్షి):**

మోడితోనే దేశం సస్యాశ్యామలంగా ఉంటుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం ఈటెల సమక్షంలో మాజీ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మురళి గౌడ్ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ..మోడీని ముచ్చటగా మూడోసారి ప్రధాన మంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటు న్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మల్లారెడ్డి, బొట్టు యాదగిరి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ కంప్రెసర్‌ల ప్రీమియం శ్రేణిని ప్రవేశపెట్టిన ఎల్గి లిమిటెడ్

**ఖైరతాబాద్, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :**

తక్కువ ఖర్చులతో వినియోగదారులకు పరిశ్రమలో అగ్రగామి ఇంధన సామర్థ్యాన్ని అందించడానికి ప్రఖ్యాత ఇజి శ్రేణిని విస్తరిస్తున్నట్లు ఎల్గి ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ సౌత్ ఈస్ట్ ఆసియా ప్రెసిడెంట్ మిస్టర్ భవేష్ కరియా ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీదారులలో ఒకటైన ఎల్గి ఎక్విప్ మెంట్స్ ఆయిల్-లూబ్రికేటెడ్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్‌ల ప్రఖ్యాత ఇజి సిరీస్ పోర్ట్‌ఫోలియో, ఇజి ఎస్పి(సూపర్ ప్రీమియం)ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కొత్త మెషీన్‌లు కంప్రెస్డ్ ఎయిర్ టెక్నాలజీలో చెప్పుకోదగ్గ పురోగతిని సూచిస్తాయన్నారు. 90-110కిలో వాట్ల కంప్రెసర్ సిరీస్ లో త క్కువ జీవితకాల ఖర్చులతో వినియోగదారులకు 15 శాతం వరకు గణనీయమైన శక్తి సామర్థ్య లాభాలు, ఉత్తమ వారంటీ, పనితీరును అందిస్తాయన్నారు. ఇంధన సామర్థ్యం, పర్యావరణ స్థిర త్వానికి ప్రాధాన్యతనిస్తూ తయారీ సంస్థల కోసం ప్రత్యేకంగా రూపొందించ బడిందన్నారు.



## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ రాష్ట్ర కేసీఆర్ సేవదళం కార్యదర్శి అఫ్జల్ ఖాన్

**శామీర్ పేట్ ఏప్రిల్ 21 (జనం సాక్షి):**

శామీర్ పేట్‌లోని ఎన్పిజి గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ పార్టీలో దాదాపు రెండు వందల మంది బిఆర్ఎస్ కార్యకర్తలు చేరారు. బిఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన మహ్మద్ అఫ్జల్ ఖాన్, రెడ్డి సంఘం నాయకుడు నర్సిహ్మా రెడ్డిలకు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్, సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి లు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అఫ్జల్ ఖాన్ తో పాటు దాదాపు రెండు వందల మంది బిఆర్ఎస్ కార్యకర్తలు, పెద్ద ఎత్తున మైనారిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, హజ్ కమిటీ మెంబర్ మహ్మద్ ముజీబుద్దీన్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు వై యస్ శంకర్ గౌడ్, విలాసాగరం అశోక్, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ షఫీ యోద్దీన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, జామా మసీదు సదర్ యూసుఫ్, మహ్మద్ ఇర్ఫాన్, డపు సాయి బాబా, రాంచందర్ యాదవ్, వంగ నర్సింహా రెడ్డి , కంతం క్రిష్ణా రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## గురుద్వారాలో పూజలు నిర్వహించిన మధుయాష్కి గౌడ్

**ఎల్బీనగర్, ఏప్రిల్ 21(జనం సాక్షి)**

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ ఆదివారం వనస్థలిపురంలోని గురుద్వారాను సందర్శించారు. మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ ఐక్యమత్యంగా కలిసి ఉండటమే దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్, సిపిసిసి క్యాంపెయిన్ కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, లింగాల కిషోర్ గౌడ్, జిట్టా సురేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, విద్యా రెడ్డి, పుల్లయ్య, ఖదీర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

- అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్
- బిజెపి ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్ కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని నాగర్ కర్నూలు పార్లమెంటరీ బిజెపి ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు. ఆదివారం వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని గోపాల్ పేట, పెద్దమందడి, ఖిల్లా ఘనపూర్, వనపర్తి రూరల్, వనపర్తి పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు బుద్ధారం గండి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి ఆశీస్సులు తీసుకొని ఇంటింటి ప్రచారం ప్రారంభించిన సందర్భంగా బిజెపి ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల రూపంలో తీసుకొచ్చిన 420 హామీలలో రైతన్నకు సంబంధించి బ్యాంకులలో లక్ష రుణం ఉన్నవారు ఇంకొక లక్ష తీసుకోండి, ఏమీ అప్పు లేని వారు రెండు లక్షలు తీసుకోండని, కల్లాలు, కొనుగోలు కేంద్రాలలో ఉన్న వడ్లను మద్దతు ధరకు అమ్మ వద్దని ప్రతి క్వింటాలకు 500 బోనస్, పదివేల రూపాయల రైతుబంధు స్థానంలో 15000- పట్టాదారు రైతులతోపాటు కౌలు రైతులకు కూడా రైతుబంధు 15000/-, రైతు కూలీలకు యేటా 12,500/- డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన వెంటనే నెరవేస్తారని మాట ఇచ్చాడని మరి డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం చేసి ఐదు నెలలైనా రెండు లక్షల రుణమాఫీ కాలేదు. వరికి క్వింటాలుకు 500 బోనస్ రాలేదు కౌలు రైతులకు కాదు పట్టాదారులు కూడా పూర్తిగా రైతుబంధు విడుదల కాలేదు రైతు కూలీలకు 12000 అతీగతీ లేదని హామీల సంగతి ఈ విధంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా నీటి ఎద్దడితో పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. ఎన్ని గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందో విద్యుత్ డిపార్ట్మెంట్ వాళ్లకు కూడా తెలియని పరిస్థితి నెలకొందని తెలంగాణ రాష్ట్ర ప్రజలను అబద్ధపు హామీలతో నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి రైతుల నెత్తిన శఠగోపం పెట్టి పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులను సంతలో పశువుల మాదిరి కొన్నట్లు ఐదు నెలల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలన గాలికి వదిలేసి ప్రతిపక్ష పార్టీల ఎంపీ ఎమ్మెల్యే జిల్లా పరిషత్ చైర్మన్ తదితర ప్రజాప్రతినిధులను కొనే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. మోసకారి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మోరీలో వేసినట్టేనని వనపర్తి నియోజకవర్గ ప్రజలు విద్యావంతులు మేధావులని భారత్ ప్రపంచంలో విశ్వ గురు స్థానంలో ఉండాలంటే నరేంద్ర మోడీ మూడవ పర్యాయం ప్రధానమంత్రిగా పీఠంకాల్సిన అవసరం ఉందని వనపర్తి ప్రజలందరూ ప్రధానమంత్రి మోడీకి మద్దతుగా నిలబడి భరత్ ప్రసాద్ కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి బి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కర రామన్ గౌడ్, చిత్తారి ప్రభాకర్ శ్రీనివాస్ గౌడ్, నందకుమార్, కదిరే మధు దాసరాజు, ప్రవీణ్, అశ్విని, రాధ, అరుణ, బిజెపి జిల్లా పదాధికారులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, భాశెట్టి శ్రీను, ఏ సీతారాములు పెద్దిరాజు, మనివర్ధన్సాగర్ చెన్నయ్య, మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి, అజయ్ గౌడ్, కావలి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు



## సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేద్దాం

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్**

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

ఈ నేల 23న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో జరిగే భారీ బహిరంగ సభకు వనపర్తి జిల్లా నుంచి అని గ్రామల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ నారాయణ, పెద్దమందడి మండల అధ్యక్షులు పెంటన్న, తలకంటి వెంకటేశ్వర్లు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు రాములు, పి రాములు, సంజివ రెడ్డి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను వివరించాలి



**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య**

**మక్తల్ ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

గడప గడపకు గ్రామ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను వివరించండని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య అన్నారు. నేడు మక్తల్ పట్టణంలోని బీ.కొండయ్య నివాసంలో బిజెపి టౌన్ అధ్యక్షుడు బాయికాటి రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య నాయకత్వంలో మక్తల్ రూరల్, అర్బన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య హజరార య్యారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో మోది హవ నడుస్తుంది. ఎక్కడ చూసినా పల్లెల్లో ఎవ్వరికి అడిగిన మోదికే మా ఓటు అంటున్నారని పాలమూరు గడ్డ పైన డి.కే.అరుణమ్మ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని అన్నారు. అలాగే గెలిచే స్థానానికి కార్యకర్తలు మరింత గట్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో కార్యకర్తలు ఒకటి గమనించాలి పాలమూరు గడ్డపై ఒక కాంగ్రెస్ పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డ సుమారు నాలుగుసార్లు పాలమూరుకు రావడం జరిగిందని తెలిపారు. దీనిబట్టి కార్యకర్తలు గమనించాల్సిందేందంటే డీ.కే.అరుణమ్మ ఎంత నిబద్ధతగా ఎంత దీటైన వ్యక్తి అని ఒక్క ఆడ బిడ్డను ఓడించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా రంగంల్లో దిగడం భయంతో దిగజారి చేస్తున్న చర్యని గమనించాలని అన్నారు. ప్రస్తుతం అరుణమ్మను ఎదిరించే శక్తి ఎవరికీ లేదని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి గతంలో అరుణమ్మ మోచేయి నీళ్లు తాగిన వారే అని కార్యకర్తలకు గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలువకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండలేదు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటలేడు కాంగ్రెస్ సీనియర్ నాయకులే రేవంత్ రెడ్డిని దింపేయాలని అన్ని రకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవాలి తర్వాత వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారం రావాలని కోరుకుంటారు అని అన్నారు. అందువల్ల ప్రతి కార్యకర్త బూతు స్థాయిలో ఉండి రేపటి నుంచి గ్రామా స్థాయిలో బిజెపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసి గడపగడపకు తిరిగి చెప్పి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రబారి బాల్ రెడ్డి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కర్ని స్వామి, బీజేపీ సీనియర్ నాయకులు కల్లూరు నాగప్ప, సుకన్య శేఖర్, దేవరింటీ నరసింహారెడ్డి, రేణుక నరసింహ, మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు బొంబాయి లింగం, నరేందర్, బీజేవైఎం నాయకులు నరసింహ, రాజు గౌడ్, కృష్ణమూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**



నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో కార్యకర్తల సమావేశం,తిమ్మరెడ్డి పల్లి బావోజి జాతరకు సిఎం రేవంత్ రెడ్డి 23వ తేదీన రానున్న సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మద్దూర్ టౌన్‌లోని గ్రీన్ పాలెస్ ఫంక్షన్ హాల్‌ని, ఏలిప్యడ్ స్థలాన్ని పరిశీలించి భారీ కేడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం తిమ్మారెడ్డి పల్లిలోని భావోజీ జాతర గిరిజనుల ఆధ్యాత్మిక గురువు శ్రీ లోకమాసందు దేవాలనికి వెళ్లి దర్శన అనంతరం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయం చుట్టూ బరికెట్స్ ఏర్పాటు చేయాలని, విఐపి వచ్చే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబంధులు లేకుండా డైవర్షన్ చేయాలని సూచించారు. విఐపి కాన్వాయ్ మద్దూరు నుండి బావోజి జాతర వరకు రోడ్డు బందోబస్తు, పార్కింగ్ డైవర్షన్ మొదలగు విషయాలపై పోలీసు అధికారులకు భద్రత పరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరియు దొంగతనాల నివారణ గురించి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జేబుదొంగతనలు నివారణకు మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు డిఎస్పీ ఎన్. లింగయ్య, సీఐలు సోమ నర్సయ్య, ఎస్సైలు రామ్ లాల్, నరేష్, ఎస్ బి ఎస్ఐ వెంకట్ రాములు, ఆలయ ఈఓ పూజారులు, తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తి మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్‌గా పదవి భాధ్యతలు చేపట్టిన మహేష్, కృష్ణ

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

వనపర్తి మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైన పుట్టపాకల మహేష్,వైస చైర్మన్ పాకనాటి కృష్ణలు ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి ఆధ్వర్యంలో పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శాలువాళ్ళతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మండల ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, మున్సిపల్ పట్టణ కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప పండుగలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 21 (జనం సాక్షి)**

వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మహమ్మద్హుస్సేన్ పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీరప్ప పండుగలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి డోలు డప్పు వాయిద్యాలను వాయించారు.కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు భక్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


### పలు వివాహాది శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం పలు వివాహాలకు, గృహప్రవేశం, పుట్టు చీర ఫంక్షన్లకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి ఎం పిపి కిచ్చారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, వెల్టూర్ ప్రస్తుత మాజీ సర్పంచ్ శ్రీవాస్ రెడ్డి, చిట్యాల రఘుపతిరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే

వనపర్తి మండలం అంకుర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన నర్సాయపల్లి హనుమాన్ ఆలయ నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## చల్లా వంశీ చందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

కృష్ణ ఏప్రిల్ 21 (జనం సాక్షి)

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీలో గెలిపించాలని ఎమ్మెల్యే వాకటి శ్రీహరి అన్నారు. హర్ గావ్ ఏక్ గంటే కార్యక్రమం వివిధ గ్రామాలైన ముడుమల్, మురహరి దొడ్డి, గుడెబల్లూర్, ట్రై రోడ్, వాసునగర్, ఖాన్ దొడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి మండల ఎన్నికల ఇన్చార్జి కొత్తకోట సిద్ధార్థ రెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా పలు అంశాలను ముఖ్య సీనియర్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. గత పదివేల కాలంలో రాష్ట్ర అభివృద్ధికి దూరము ఉందని దేశ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. పాలమూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త నాయకులు కష్టపడి పనిచేయాలని తెలిపారు. పలువురు వివిధ పార్టీల నుండి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ట్రై రోడ్ లో ఉన్న ప్రజలు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారికి శాలువాతో సన్మానం చేసి ఆనందం వ్యక్తం పరిచి,గణేష్ చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్చార్జి కొత్తకోట సిద్ధార్థ రెడ్డి, మండల అధ్యక్షులు రాజప్ప గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పల్లె సురేష్, మహాదేవ్, మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గుడెబల్లూర్, మురహరిదొడ్డి ముడుమల్, వాసునగర్, ఖాన్ దొడ్డి, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళను కించపరిస్తే పుట్టగతులు ఉండవు

- ఓటమి భయంతోనే అరుణ మ్మ పై వ్యక్తిగత దూషణలు
- బిజెపి జిల్లా కార్యదర్శి సుజాత కృష్ణ
- పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు అప్పిరెడ్డిపల్లి నర్సమ్మ రాము

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

మహిళను కించ పరిస్తే పుట్టగతులు ఉండవని ఇది చరిత్ర తెలిపిన సత్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బిజెపి నారాయణపేట జిల్లా కార్యదర్శి బి.సుజాత కృష్ణ,పట్టణ మహిళా మోర్చ అధ్యక్షురాలు అపిరెడ్డి పల్లి నర్సమ్మ రాము హెచ్చరించారు. వంశీ చందర్ రెడ్డి వాడిన పదాలు జుగుప్సాకరంగా ఉన్నాయని అతనికి మహిళలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బిజెపి అభ్యర్థి డి.కే.అరుణను దొరసాని గర్విష్టి అని వ్యక్తిగతంగా నిందించడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు.కింది స్థాయి నుంచి వచ్చానని చెప్పుకుంటున్న వంశీ చందర్ మహిళల గురించి మాట్లాడే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. అరుణమ్మ పార్టీలు మార్చి వచ్చిందని అంటున్న వంశీ చందర్ మి సిఎం రేవంత్ ఎన్ని పార్టీలు మారలేదని, మాజీ ఎంపి.జితేందర్ మారని పార్టీ అంటూ ఉందా అని ప్రశ్నించారు. గురువింద తన నలుపు ఎరగదన్నట్లు వంశీ చందర్ వ్యవహారం ఉందన్నారు. నోరు అదుపులో పెట్టుకోక పోతే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఆరుణమ్మ కోడలు నర్సిరెడ్డి మనవరాలు ఎమ్మెల్యే పర్నికమ్మ ముందే అవమానకరంగా మాట్లాడిన పర్ణికమ్మలో చలనం లేకపోవడం శోచనీయమని అన్నారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రాజీనామా చేసి వంశీ చందర్‌కు బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

## విద్యావంతుడు ప్రవీణ్ కుమార్‌కి అవకాశం ఇవ్వండి




- జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్
- ఘనపూర్ మండలములో ఇంటింటి ప్రచారం ప్రచారం చేసిన బిఆర్ఎస్ నాయకులు

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 21 (జనం సాక్షి)

బిఆర్‌యస్ పార్లమెంట్ అభ్యర్థి అర్‌యస్ ప్రవీణ్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేయాలని ఘణపురం మండల పార్టీ అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య ఆధ్వర్యములో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీఎస్ అధికారిగా స్వచ్ఛంద విరమణ చేసి తన ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ఎంపిగా పోటీ చేస్తున్న ప్రవీణ్ కుమార్ కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గతంలో పని చేసిన మల్లు.రవి ఫైరవీలు చేశారని,పి.రాములు మౌనమునిగా పేరు తెచ్చుకున్నారని విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అంతకు ముందు మండల పార్టీ నాయకులతో మాట్లాడి ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామ్యానాయక్, మాజీ ఉపసర్పంచులు రాఘవేందర్ రెడ్డి, బుచ్చిబాబు గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ దవాఖాన సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు జి.బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు చిన్న ఆంజనేయులు గౌడ్, యువత అధ్యక్షులు దొరటి మల్లేష్, గోనెల రాంచందర్, నాయకులు చింతల శేఖర్, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్, కమ్మరి గోపి కొరిగేల శంకర్, బెస్త. శింగోటం తదితరులు పాల్గొన్నారు.

## నేడు నామినేషన్ దాఖలు చేయనున్న రుద్రసముద్రం రామలింగం

**మక్తల్ ఏప్రిల్ 21 (జనం సాక్షి)**



నేడు పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు రుద్రసముద్రం రామలింగం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాలమూరు పార్లమెంటు ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి నేను పాలమూరు ఎంపీగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్న. మేధావులు విద్యార్థులు వ్యవసాయదారులు మహిళా మణులు అన్ని కుల వర్గాల నాయకులు ముఖ్యంగా యువత వ్యాపారస్తులు అదే విధంగా ఏసీ ఎస్టీ బీసీ మైనార్టీలు అందరు కూడా ఒక్కసారి ఆలోచించండి యువతకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన 17 పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు గెలుపొందారు. తొలిసారిగా నాలాంటి ఒక యువకునికి మీరు అవకాశం ఇచ్చినట్లయితే ఈ జిల్లాను మార్చడానికి ఓ మంచి యువ నాయకుని ఎన్నుకున్న వారవుతారని తెలిపారు. మీ అందరి ఆశీర్వాదం నాపై ఉంచి నన్ను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నా అన్నారు.

## ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి
- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ప్రతాపరెడ్డి

**చేర్యాల ఏప్రిల్ 21 (జనం సాక్షి) :**



ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని జనగామ డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం చామల కిరణ్ కుమార్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి చేర్యాల ప్రాంతం నుండి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. అంతకుముందు చేర్యాల లో కొమ్మూరి ప్రతాపరెడ్డి జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. మతోన్మాద పార్టీలను ఓడించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

# కృతజ్ఞతకు నోచుకోని స్త్రీ జీవితం

పోగొట్టుకున్న అస్తిత్వాన్ని స్త్రీ సంపాదించుకోవాలన్నదే పి. సత్యవతి అభిప్రాయంగా తోస్తోంది. అలా చేయనట్లైతే ఆమెకు పురోభివృద్ధి వుండదని వక్కాణిస్తుందీ కథ.

ఈ విధంగా స్త్రీ బుచ్చిబాబులో చైతన్యం వస్తుంది. భార్య తన నుంచి ప్రేమను కోరుతోందని తెలుసుకొని తప్పు ఒప్పుకుంటాడు. మొదట పురుషాహంకారాన్ని ప్రదర్శించినా చక్కదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆమె జవాబుకు ఎదురు తిరగకుండా విమల మనసు విడాకుల ప్రస్తావన తెచ్చేంతగా కష్టపెట్టుకుందంటే తనలో లోపమేమిటా అని ఆలోచించాడు. ప్రేమను, సహజీవనాన్ని కోరే ఆమె హృదయాన్ని అర్థం చేసుకొని, తనలోనే మార్పు కల్గి విమల కోసమే భార్యను కోరుకుని ఆహ్వానిస్తాడు బుచ్చిబాబు.

భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ప్రేమానురాగాలని నిరూపిస్తుంది ఈ కథ. ప్రేమానురాగాలను బుచ్చిబాబు తనపట్ల కనబరుస్తూ ఉత్తరం రాస్తేకానీ విమల పుట్టింటి నుంచి కదలలేదు. ఏ స్త్రీ అయినా భర్త తనను తననుగా కోరుకోవాలని, అతని జీవితంలో సగభాగంగా గుర్తించాలని తపిస్తుంది. అది విమలలో స్పష్టంగా కనబడుతుంది.

1996లో గృహిణుల విశ్రాంతిని ప్రస్తావిస్తూ రాజ్యసభలో ప్రతిపాదించిన బిల్లులో లేవనెత్తిన ప్రశ్నలకు, సందేహాలకు, ఆందోళనలకు అభిప్రాయాలకు సమాధానాన్ని ఇతివృత్తంగా 'అమ్మకి ఆదివారం లేదా?' అనే మరో కథ రాశారు రంగనాయకమ్మ.

ఇంటి పని, బయటిపని కలిసిందే జీవితం అనే అవగాహనను వేణు ద్వారా అందరిలో కల్గించడం, ఆడవాళ్ళు బయటి పనులు వెతుక్కోవడానికి, మగవాళ్ళు ఇంటిపనిలో పాలుపంచుకోవాలనే స్పృహను కల్గించడమే ఈ కథ సారాంశం. రాజ్యసభ ప్రతిపాదించిన ఇంటిపని నుండి ఆడవాళ్ళకు ఒకరోజు విశ్రాంతి బిల్లును హక్కుగా వినియోగించుకోవడానికి స్త్రీలు సిద్ధపడితే ఏమవుతుంది? స్త్రీలందరూ పనులు మానేసి, ఆడామగా సమానమే కనుక ఆదివారం సెలవును ఉపయోగించుకొంటామంటే ఏమవుతుంది? స్త్రీలు అన్ని పనులూ చేస్తుంటే సుఖంగా రోజులు గడుపుతూ విశ్రాంతిగా ఉండే వాళ్ళకి ఇది ఇబ్బందే! ఆదివారం మాకు విశ్రాంతి వద్దా? అంటారు. ఇలాగైతే ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకు ఇంటిపని అదనపు బరువే కదా? అంటూ ఎన్నో ప్రశ్నలు ఈ కథలో ముందుకొచ్చాయి. స్త్రీలకు ఆదివారం విశ్రాంతి అనేది చట్టబద్ధమైన హక్కుగా వచ్చినా, పితృస్వామిక సమాజం, ఆ సమాజ ప్రయోజనాలను చేకూర్చడానికి రూపొందిన ప్రభుత్వం, కుటుంబం మొదలైనవన్నీ అది ఆచరణ వాస్తవం కావడానికి అవరోధమే అవుతుందని కూడా ఈ కథలో రచయిత్రి సూచించారు. హెచ్చరించారు కూడా! స్త్రీల ప్రయోజనాల కోసం చట్టాలు చేయటమూ ఒక సంస్కరణే. "అసమ సంబంధాల వర్గ సమాజపు పునాదులు కదలకుండా, పితృస్వామిక సామాజిక సంస్కృతిని మార్చకుండా స్త్రీల కోసం ఎన్ని చట్టాలు చేసినా స్త్రీల జీవితంలో అభివృద్ధికి అవి ఇసుమంతయినా తోడ్పడవు" (కాత్యాయినీ విద్మహే) అన్నది స్పష్టం. తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుందని నిరూపించింది. 'మహిళా జనజీవితంలోని స్త్రీత్వాన్ని కేంద్రబిందువుగా చేసుకొని చేయటం ఫెమినిస్టు లక్షణం' (కేతవరపు రామకోటిశాస్త్రి) అదే చేశారు పి. సత్యవతి.

తాత్విక చింతన : 'ఆచంట శారదాదేవి' రచించిన మరొక కథ 'ఒక్కరోజు' తాత్విక చింతనను చూపిస్తుంది. కథారచనలో ఒక తాత్విక ధోరణి ప్రదర్శించగల రచయిత్రి ఈమె.

'రాత్రి అంతా వేకువకోసం, పగలంతా రాత్రి కోసం కనిపెట్టుకుని ఉండటమే జీవితం' అంటూ నిరాశా అసంతృప్తులతో నిండిన నిత్యజీవితంలో జరిగే సంఘటనల గురించి రాస్తూ, ప్రతిరోజూ ఏదో మార్పు వస్తుందని "వట్టిభ్రమ" అనే తాత్విక చింతనతో కథని ముగించారు రచయిత్రి. స్త్రీకి ఎప్పుడూ విశ్రాంతి ఉండదని ఆమె ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే బ్రతకాలని, ఇదే స్త్రీ జీవితం కాబోలూ అని తనను తాను సమర్థించుకోవడం, స్త్రీకి ఈ జీవితంలో ఏదో మార్పు వస్తుందనేది భ్రమేనన్నది స్పష్టం చేసిన కథ ఇది.



ఇంటి చాకిరీకి గుర్తింపు కోరడం : నేటి కాలంలో సాహిత్యోద్యమంగా స్త్రీవాదం రూపు దాల్చింది. తరాలుగా పురుషాహంకారానికి గురవుతూ, సమాజంలో ఒక విధంగా వెలివేయబడుతూ, విద్యావిజ్ఞానాలకు దూరమై, తమ పురుషుల దయపై ఆధారపడి, ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా మానసిక కుటుంబ సమాజ హింసలకు నిరంతరం తనలో తాను కుంచించుకుపోయిన స్త్రీ జాతి, మేల్కొని చైతన్యవంతమై తిరగబడి తమ సమస్యల గురించి ఆలోచించి పరిష్కరించుకొనే స్థితి వరకు స్త్రీ జాతి ఎదుగుతూ వుంది. 'లావణ్య', 'అమ్మ మనసు', 'మాక్కొంచెం నమ్మకమివ్వండి', 'ఆడ బ్రతుకు' వంటి కథలు ఈ కోవలోకే వస్తాయి.

"లావణ్య" కథలో స్త్రీలకు గుర్తింపులేని ఇంటి చాకిరీకి గుర్తింపు కావాలని ప్రబోధించడం ఉంది. కట్నమిచ్చి రామారావును పెళ్ళి చేసుకున్న లావణ్య అత్తారింట్లో చేసే చాకిరీకి "ఇల్లాలుగా నాకు విలువ లేనప్పుడు ఇన్నాళ్ళ శ్రమ కూలిపనే అవుతుంది. ఇంటిపని పని కాదా? అన్ని పనులకు ఖరీదున్నప్పుడు దీనికెందుకు ఉండదు" అని లావణ్య తన భర్తా అత్తమామలను నిలదీయడంతో కథ ముగుస్తుంది.

'అమ్మ మనసు' అనే మరోకథలో కోటీశ్వరమ్మ ఎప్పుడూ పిల్లలకూ, ఇంటికీ చాకిరీ చేయడంలోనే సంతృప్తి పొందేది. ఆమెను కేవలం తమ పిల్లలకు సేవలు చేసే యంత్రంగా కన్నబిడ్డలే భావిస్తారు. అది చూసి బాధపడి కోటీశ్వరమ్మ స్వంతంగా 'బేబీ కేర్ సెంటర్' నడపాలని నిర్ణయించుకోవడంతో కథ సుఖాంతమవుతుంది.

వి. ప్రతిమ రాసిన 'మాక్కొంచెం నమ్మకమివ్వండి' కథలో భర్త అయ్యప్పమాల వేసుకున్నప్పుడు బయట చేరిందని, సేవలు చేయడానికి వీలుకాదని ఇంటి నుండి గెంటివేయగా, పుట్టింటికి చేరిన భారతిబీ ఆడపిల్లలను కన్నందుకు తన తప్పేమీ లేకపోయినా పుట్టింట్లోనే ఉండిపోవాల్సిన కస్తూరి జీవితాలను చూసి తల్లి భయపడటం, మెట్టినింటికి వెళ్ళమని ఆజ్ఞాపించడం – దానికి భారతి 'మాక్కొంచెం నమ్మకమివ్వండి' పిరికితనం నూరి పోయవద్దంటూ తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావడమే కథ.

తూములూరి కృష్ణవేణి రాసిన 'ఆడ బ్రతుకు' కథ నూతన ధోరణికి ఒక ప్రతీక. స్త్రీలు పురుషుల చేత బానిసలుగా చూడబడుతున్నారని, స్త్రీలు ఇంట్లో చేసే చాకిరీకి విలువనివ్వడం లేదని, తలచుకుంటే ఆ గృహిణులందరూ ఏకమై సమ్మె కూడా చేయగలరని కథానాయిక మాటల ద్వారా వ్యక్తం చేశారు రచయిత్రి. ఇదే మాటను డా. కొలకలూరి మధుజ్యోతి గారు "స్త్రీవాదులు తమ తీవ్రతను, పురుషాధిక్యాన్ని, సమాజాధికారాన్ని, అసమానతను, లింగవివక్షతను, స్త్రీకి ఉన్న ద్వితీయస్థానాన్ని, వారిలో కల్పించిన అభద్రతను కుటుంబం పేరుతో సాగిస్తున్న అణచివేతను, శ్రమ జీవనంలో అసమానతను, వేదనలను, బాధలను పురుషుడు ఏ మాత్రం అంచనా వేయలేని తమ భావాలను ఖచ్చితంగా వ్యక్తం చేశారంటారు". 'ఆడబ్రతుకు' కథలో అదే జరిగింది.

రేపటి సంచికలో

# సరైన నిర్ణయం



"అవని కి జ్వరం వచ్చి మూలుగుతుంటుంటే ఇంట్లో అందరూ ఏమి చేస్తున్నారుట? కాఫీ ముఖ్యమా ఇప్పుడు"? పిల్ల జ్వరంతో ఒళ్లు తెలియ కుండా పడుంటే ఎవరూ దగ్గర లేరు"? ఆవేశంతో ఏమి మాట్లాడుతోందో తెలియకుండా ఉంది.

ఈ లోగా వల్లి వచ్చిందక్కడకు. "వదినా ఇంతవరకు నేను అక్కడే ఉన్నాను. పేరాసిట్ మాల్ సిరప్ అవని చేత తాగించాను. దాని పక్కనే ఇంతవరకు కూర్చుని ఇప్పుడే బాత్ రూమ్ కి వెళ్లాలని వచ్చాను".

వల్లి మాటలను విననైనా వినకుండా "నేను గమనిస్తున్నాను నిత్యకు ఇస్తున్న ప్రాముఖ్యత 'అవని' కి ఇవ్వడం లేదు, దానినసలు సరిగా పట్టించుకోవడం లేదు. అత్తయ్యగారూ, మీ అమ్మాయి భర్త పోయాడని మీరు సానుభూతి చూపించవచ్చు. కానీ అనుక్షణం మీ అమ్మాయినే ఊరడిస్తూ ఆమె పక్కనే కూర్చుంటూ ఇలా ఎంత కాలం అండీ? ఆవిడే లోకమా? ఇంట్లో ఇంక మనుషులే లేరా? వాళ్ల సంగతి చూడర"?

ఆవేశంలో గట్టిగా మాట్లాడుతున్న మాటలు ఇంట్లో అందరికీ వినబడుతూనే ఉన్నాయి.

ఈ లోగా శాంతిస్వరూప్ కూడా ఆఫీస్ నుండి వచ్చేసాడు.

"ఏమైంది స్నేహా? ఏమిటి నీ మాటలు బయటకు వినిపిస్తున్నాయి" ముందు మీరు ఇలారండంటూ అతని చేయి పట్టుకుని అవని పడుకున్న గదిలోకి తీసుకొచ్చింది.

"ఏమైంది బేబీకి" ఆత్రుతగా మంచమీద కూర్చుని అవని నుదుటి మీద చేయి వేసాడు. వెచ్చగా తగిలింది.

"జ్వరం వచ్చింది దానికి. దానిని పట్టించుకునే నాధుడే లేడు. ఆ విషయమే మీ అమ్మగారిని ప్రశ్నిస్తుంటే నేనేదో గట్టిగా మాట్లాడుతున్నానని మీరనడం బాగాలేదు" మొహం ఎర్రగా చేసుకుంటూ సీరియస్‌గా అంది.

"అమ్మా మా వల్లి బాగానే చూసుకుంటున్నారు కదా స్నేహా? దానికి కాస్త ఒళ్లు వెచ్చబడితే ఇంత రాద్ధాంతం దేనికి"?

"ఏమిటీ రాద్ధాంతమా, నేను చేస్తున్నానా? తల్లీతండ్రీ ఉన్నా అనాధలా పెరుగుతోంది అది. తండ్రి లేకపోయినా మహారాణిలా పెరుగుతోంది మీ చెల్లెలి కూతురు".

"స్టాపిట్ స్నేహా", తర్జనతో బెదిరించాడు. "ముందు ఎలా మాట్లాడాలో నేర్చుకుంటే మంచిది".

"మా వల్లిని ఒక్కమాటన్నా ఊరుకోను. బావగారు చనిపోతే అది ఎక్కడకు వెడుతుంది? అసలుకే పుట్టెడు దుఖంలో ఉంది. దాని ఎదురుగా ఇలా మాట్లాడడం సంస్కారం కాదు". కోపంగా అక్కడనుండి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఎంత బ్రతిమాలినా వల్లి భోజనం చేయనని అంటే పద్మావతి బల నంతంగా వల్లికి కంచంలో భోజనం వడ్డించింది. తలొంచుకుని కన్నీళ్లు పెట్టుకుంటున్న కూతురితో "భోజనం చేయవే తల్లీ, మీ వదిన గురించి తెలిసిందే కదా"?

"వదిన అనడం సహజమే కదమ్మా? నేను ఎన్నాళ్లిలా పుట్టింట్లో కూర్చోగలను చెప్పు", కంట తడిపెడుతూ ఏడుస్తున్న కూతురిని ఓదార్చడానికి ఆ తల్లి ఆసక్తురాలైంది.

గదిలో కూర్చుని ఇవన్నీ గమనిస్తున్న సుమతి మనసు దుఖంతో బరువెక్కింది.

ఈ సమస్యకు పరిష్కారమేమిటో అర్థం కాకుండా ఉంది. కానీ తానేమీ చేయలేదు. ఒక వారం రోజుల తరువాత

సూట్ కేస్ లో తన బట్టలు, నిత్య వస్తువులు సర్దుకుంటూ హడావుడి పడుతోంది వల్లి.

"ఏమిటి వల్లీ నీ నిర్ణయంలో మార్పులేదా"?

"అమ్మా, నా నిర్ణయం మంచిదే అని నేను అనుకుంటున్నాను. డిగ్రీ చదివి బి.ఇ.డి చేసాను. హైద్రాబాద్ లో నా ఫ్రెండ్ సునీత ఒక ప్రైవేట్ స్కూల్ లో టీచర్ జాబ్ చూసిపెట్టింది. వెంటనే రమ్మనమంది. వెడతానమ్మా".

"ఎలా ఉంటావే వల్లీ ఒంటరిగా పిల్లతో"?

"అమ్మా ఎల్లకాలం మీరు నాకు తోడు ఉండరు. నేను నా గురించి కంటే కూడా నిత్య గురించి దాని భవిష్యత్ గురించి ఆలోచించాలి కదమ్మా. మోహన్ తాలూకా వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులు కాస్త బేంక్ లో ఉన్నాయి. నీతా నాకు సింగిల్ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్ కూడా చూసిందట. తప్పదమ్మా, ఇలా ఇక్కడే కూర్చుంటే ఎప్పటికీ ఏమిచేయలేని ఆసక్తురాలిని అవుతాను. నన్ను ప్రోత్సహించి ధైర్యాన్ని చెప్పి సాగనంపు. అంతేగానీ నిరుత్సాహ పరచ"కంటూ తల్లికి గట్టిగా చెప్పింది.

ఈ లోగా స్టేషన్ వెళ్లడానికి బుక్ చేసిన కేబ్ వచ్చింది.

నిత్య ను ఎత్తుకుని సూట్ కేస్ తీసుకుని బయలదేరుతున్న శ్రీవల్లి వైపు అలా చూస్తూ ఉండిపోయిందావిడ.

# బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం బెంగళూరు

ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి :

తలసేమియా పిల్లలు ఆదివారం రోజున మంచిర్యాల రైల్వే స్టేషన్ నుండి గోరక్పూర్ ట్రైన్‌కు ఉదయం 9:30 గంటలకు బయలుదేరిన తలసేమియా పిల్లలు వారి తల్లిదండ్రులు. మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ బెంగళూరు వారి సహకారంతో భగవాన్ మహావీర్ జెన్ హాస్పిటల్‌కు బోన్ మారో మార్పిడి నిమిత్తము ముందస్తు వైద్య పరీక్షల కోసం రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా నుంచి ఆరుగురు పేషెంట్లను వారి తల్లిదండ్రులను పంపించడం జరిగినది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మరియు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల హెచ్.ఎల్.ఏ క్యాంపు నిర్వహించడం జరిగినది ఇట్టి క్యాంపు రిపోర్ట్ లలో 9 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు వారి కుటుంబ సభ్యులతో ఫుల్ మ్యాచ్ అయినవని రిపోర్టు రావడం ద్వారా. ఇందులో నుండి ఆరుగురు ఈరోజు బెంగళూరుకి పంపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ రోజుల్లో తలసేమియా సికిల్ సెల్ వ్యాధి వచ్చినదని ఎవరు భయపడ వద్దని ఎవరు ఆందోళన చెందొద్దని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా దాతల సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బోన్ మారో మార్పిడి చేయించడం జరుగుతుందని అన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు తల సేమియా వ్యాధిగ్రస్తులు వారి తల్లిదండ్రులు బోన్ మారో మార్పిడి చేయించుకోవడానికి ముందుకు రావాలని బోన్ మారో మార్పిడి వల్ల తలసేమియా సికిల్ సెల్ వ్యాధులు పూర్తిగా నయమవు




తుందని అన్నారు. వ్యాధిగ్రస్తులకు వారి తల్లిదండ్రులకు మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు ధైర్యం చెప్పి వారిని రైల్వే మార్గం ద్వారా సాగరంపారు. వీరికి సహాయకునిగా కాసర్ల రంజిత్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు మరియు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీ పంపించడం జరిగిందని తెలిపారు. వారి బాగోగులు కాసర్ల రంజిత్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, మూలకాల సత్యనారాయణ రెడ్డి, వ్యాధిగ్రస్తులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వక్కలంక శ్రీనివాసరావు

మహేశ్వరం, ఏప్రిల్ 21(జనం సాక్షి) :

మర్యాద పూర్వకముగా కలసిన బ్రాహ్మణ నాయకులు ముఖ్య మంత్రి అనుముల రేవంతరెడ్డిని, మంత్రి వర్యులు శ్రీధర్ బాబు కి రాష్ట్ర సలహా దారులు ఆర్కెర్ వేణుగోపాల్‌కి జ్ఞాపికను అందచేస్తున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రేస్ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణ సంఘ నాయకులు వక్కలంక శ్రీనివాస రావు, వీఎస్ఎన్ స్వరూప్ రాజ్. బ్రాహ్మణ నాయకులు తులసి శ్రీని వాస్, వారణాసి వంశీ, నందిరాజు లక్ష్మినారాయణ, మంగపతి రావు, అరుణ యాదగిరి రావు పాల్గొన్నారు.

## మచ్చలేని మనిషి... ప్రజల సేవ కోసమే కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- తాండూరులో బీజేపీ భారీ బైక్ ర్యాలీ
- తండ్రి కోసం తనయుడి ప్రచారం
- బిజెపి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు విశ్వజిత్ రెడ్డి



తాండూరు ఏప్రిల్ 21(జనంసాక్షి) : మచ్చలేని మనిషి, ప్రజల సేవ కోసమే కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాజకీయం లోకి రావడం జరిగిందని బిజెపి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు విశ్వజిత్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం తాండూరులో సుమారు 1000 ద్విచక్ర వాహనాలతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ ప్రారంభించిన విశ్వజిత్ రెడ్డి ప్రారంబించారు. తాండూరు విలేమున్ కూడలి నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ వినాయక్ చౌక్, రైల్వే స్టేషన్, భద్రప్ప గుడి, బసవన్నకట్ట, శివాజీ చౌక్, గాంధీచౌక్ తదితర ప్రధాన వీధులలో బయలుదేరిన కార్యకర్తలతో తాండూరు పట్టణం బిజెపి జెండాలతో కాషాయమైంది. ఈ సందర్భంగా బిజెపి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు విశ్వజిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల పాలనలో ఎన్నో అరాచకాలు జరిగాయన్నారు.

ప్రజల చూపు బిజెపి వైపే ఉందని తెలిపారు. ముచ్చటగా మూడోసారి మోదిని ప్రధానమంత్రిగా చూడడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. బిజెపి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ప్రజలు అవకాశం ఇస్తే అబివృద్ధి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయకులు యూ. రమేష్, సీనియర్ నాయకులు బాలేశ్వర్ గుప్తా, రాష్ట్ర మహిళా మోర్చా సెక్రెటరీ సాహు శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నాగరం మల్లేష్, జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, బీజేవైఎం నాయకులు అంతారం కిరణ్ కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యం

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్
- మరొకసారి పార్టీలకతీతంగా అవకాశం ఇవ్వండి సేవ చేస్తా
- చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్



మహేశ్వరం, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :

చేవెళ్ల ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి అన్నారు . ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నాడు సాయంత్రం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, టెలిఫోన్ కాలనీ చౌరస్తాలలో జరిగిన కార్నర్ మీటింగ్లకు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, టీ పి పి సి ఎన్నికల ఇన్చార్జి నిజాంముదిన్, నేరేల్ల శారద, అమరేందర్ రెడ్డి, జటీపీటీసీ చైర్పర్సన్ అనిత హరినాథ్ రెడీ, ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీ రామాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రంజిత్ మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీగా మరోసారి తనను గెలిపిస్తే పార్టీలకతీతంగా సేవ చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి సెక్యులర్ పార్టీ అని తెలిపారు. రాష్ట్రంలో మహిళా చైతన్యం తీసుకురావడానికి కాంగ్రెస్ అధిష్టానాన్ని మెప్పించి మహిళలకు సంక్షేమ పథకాలలో పెద్ద పీట వేశారు. చేవెళ్ల ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని ఇందుకు నా ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని అన్నారు. ఎంపీగా చేవెళ్ల ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని పార్టీ నుంచి మరోసారి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే పేదల కోసం పనిచేసే పార్టీ అని అభివర్ణించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా పని చేసి ఎంపీగా తనను గెలిపిస్తే తాను, కెఎల్ఆర్ కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని మేము గెలిపిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నేత, గట్ల రవీంద్ర, యాదయ్య, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లయ్య, జ్ఞానేశ్వర్ యాదవ్, రాజు నాయక్, శేఖర్ ముదిరాజ్, పగడాల శ్రీశైలం, అక్బర్, కల్యాణ్ యాదవ్, పురుషోత్తం, సత్తి, సురేష్, సాలి, విజయ్, కృష్ణ, దల్లి, మణికంఠ, రఫీ, కిరణ్, హరీ, జాంగిర్, శివ, సురేష్ ఇస్మా యిల్, పింటు, శ్రీకాంత్ రెడ్డి, సలీం, శ్రవణ్, కాళిదాస్, శ్రీధర్, శ్రీనాథ్, శ్రీశైలం, లక్ష్మి, రేణుక, సరస్వతి, మాధవి, సుజాత రెడ్డి, శైలజ రెడ్డి, సంతోష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..






# కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

మొయినాబాద్ ఏప్రిల్, (జనం సాక్షి) :

మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పార్టీ కార్యాలయం ప్రారంభించిన ఎంపీ రంజిత్ రెడ్డి భార్య సీత నీ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో షాబాద్ దర్శన్ (టిపిసిసి సభ్యులు), గౌరి సతీష్ (రాష్ట్ర అధికార ప్రతినిధి), మండల అధ్యక్షులు తమ్మలి మాణయ్య, పిఏసిఎస్ చైర్మన్ చంద్రారెడ్డి మండల నాయకులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, ఎల్కేపల్లి శ్రీనివాస్ యాదవ్ గ్రామ అధ్యక్షుడు బందీ అనిల్మ రాములు కేబుల్ రాజు రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్‌లు వీరభద్ర స్వామి సేవ సత్యనారాయణ, రాములు, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి, టిపిసిసి ఫిషర్మెన్ జిల్లా అధ్యక్షులు నారాయణపురం మహేందర్ ముదిరాజ్ నాయకులు జంగారెడ్డి, జైపాల్ రెడ్డి, పి శ్రీనివాస్ రెడ్డి, సురంగల్ వెంకట్ రెడ్డి, చిన్న మంగళారం ఆంజనేయులు, మర్రి రవీందర్ రెడ్డి, గన్నేపాక నర్సింగ్ రావు, మీనాజుద్దీన్ బిక్షపతి ముదిరాజ్, నరేష్ మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ప్లేస్‌మెంట్‌లలో కెఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ అపూర్వ విజయం

మొయినాబాద్ 21, ఏప్రిల్, (జనం సాక్షి) :

కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీకి చెందిన కెఎల్‌హెచ్ హైదరాబాద్ తమ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ 2024ని అజీజ్ నగర్ క్యాంపస్‌లో ఘనంగా జరుపుకుంది. ఈ గౌరవప్రదమైన కార్యక్రమం విభిన్న ప్రోగ్రామ్‌ల నుండి గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థుల యొక్క వృత్తిపరమైన విజయాలు మరియు అత్యుత్తమ విద్యాపరమైన సాధనలను గుర్తుచేసింది. ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో జాతీయ, అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లు మరియు ప్రతిష్టాత్మక సంస్థలలో విస్తృత శ్రేణిలో ఇంటర్న్‌షిప్‌లని విజయవంతంగా దక్కించుకోవటం ద్వారా, ఈ సంవత్సరం చేసిన తీవ్ర ప్రయత్నాలను ఈ సమావేశం ప్రధానంగా వెల్లడించింది. బెర్కాడియాలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంట్రీ హెచ్‌ఆర్‌హెడ్ దేబాశిష్ ఘోష్, కిరణ్ కూచిమంచి, ప్రెసిడెంట్-డిజిటల్, సిగ్నిటీ, శ్రీహరి కునాధరాజు, వెల్స్ ఫార్గో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మోర్గాన్ చేజ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ డైరెక్టర్ పవన్ కడియాల వంటి ప్రముఖ పరిశ్రమ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి పరిజ్ఞానం మరియు ఉనికి పోటీతత్వ వృత్తి ప్రపంచంలోకి ప్రవేశించడానికి సన్నద్ధమవుతున్న విద్యార్థులను గణనీయంగా ప్రేరేపించింది.

2024 ప్లేస్‌మెంట్ డ్రైవ్ సమయంలో, కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ 3700 ఉద్యోగ అవకాశాలను కల్పించింది, ఇందులో 20 అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లు మరియు 29 అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌లు ఉన్నాయి, ప్రపంచవ్యాప్తంగా 400కి పైగా గౌరవనీయమైన కంపెనీలతో భాగస్వామ్యం ద్వారా ఇది సాధ్యమైనది. నమోదైన అత్యధిక ప్యాకేజీ ఆకట్టుకునే రీతిలో రూ. 50.57 లక్షలను స్యూటానిక్స్ ను ఆఫర్ చేసింది. ఈ సీజన్‌లో పాల్గొన్న ప్రముఖ రిక్రూటర్‌లలో గుగూల్, మైక్రోసాఫ్ట్, సిస్కో, జెపి మోర్గాన్ మరియు ఇంటెల్ వంటి గ్లోబల్ దిగ్గజాలు ఉన్నాయి, అలాగే విద్యార్థులకు లాభదాయకమైన ఉద్యోగం మరియు ఇంటర్న్ షిప్ ఆఫర్‌లను




అందించారు. అదనంగా, గుగూల్, మైక్రోసాఫ్ట్, సిస్కో, జెపి మోర్గాన్, సర్వీస్ నౌ, సిలికాన్ ల్యాబ్స్, ఆప్టం, అమెజాన్, ఫిలిప్స్ సిమెన్స్, ఇంటెల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు మా క్యాంపస్‌లను అలంకరించాయి, విద్యార్థులకు పుష్కలమైన రీతిలో ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించాయి. అంతేకాకుండా, టిసిఎస్, హెచ్‌సిఎల్, నోకియా కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్, నోకియా, కాగ్ని జెంట్, ఇన్ఫోసిస్, ఎల్‌టి మైండ్ ట్రీ, యాక్సెంచర్ వంటి పరిశ్రమ దిగ్గజాలు మరియు మరిన్ని కంపెనీలు విద్యార్థులను రిక్రూట్ చేశాయి, మా విద్యార్థుల కు విజయవంతమైన కెరీర్ మార్గాలను ప్రోత్సహించడంలో మా నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

డాక్టర్ జి. పార్థ సారధి వర్మ, వైస్-ఛాన్సలర్, విశ్వవిద్యాలయం యొక్క ప్లేస్‌మెంట్ విజయం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "ఈ సీజన్ మా విద్యార్థుల కృషి మరియు పట్టుదలతో పాటుగా మా అధ్యాపకులు మరియు ప్లేస్‌మెంట్ బృందం నుండి బలమైన మద్దతును కూడా ప్రతిబింబిస్తుంది. తరువాతి తరం నాయకులు మరియు ఆవిష్కర్తలను ముఖ్యమైన కెరీర్ మార్గాల్లోకి ప్రవేశింప జేసినందుకు మేము సంతోషిస్తున్నాము" అని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
22 ఏప్రిల్ 2024
తెలంగాణ

# స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలింపు



**ఖమ్మం , ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**
అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ, ఇవిఎం ల మొదటి ర్యాండమైజేషన్ పిదప నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోదాం ఈవీఎంలు సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటుచేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూంలకు తరలింపు ప్రక్రియను ఆదివారం చేపట్టినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తెరచి, ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ ల సహాయ రిటర్నింగ్ అధికారులకు, వారి వారి అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించిన ఇవిఎంలను స్ట్రాంగ్ రూంలకు టీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీసుల్లో పటిష్ట భద్రతతో తరలించినట్లు ఆయన అన్నారు. ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి వైరాలోని బాలికల సోషల్ వెల్ ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో, మధిర సెగ్మెంట్ కు సంబంధించి మధిరలోని పాలిటెక్నిక్ కళాశాలలో, సత్తుపల్లి సెగ్మెంట్ కు సంబంధించి, సత్తుపల్లి లోని జ్యోతి నిలయం హైస్కూల్ లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న 5 అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూమ్ లకు మొదటి ఇవిఎం ర్యాండమైజేషన్ లో కేటాయించిన విధంగా ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ కు 440 బ్యాలెట్ యూనిట్లు, 440 కంట్రోల్ యూనిట్లు, 497 వివిప్యాట్లు, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ కు 359 బ్యాలెట్ యూనిట్లు, 359 కంట్రోల్ యూనిట్లు, 406 వివిప్యాట్లు, వైరా అసెంబ్లీ సెగ్మెంట్ కు 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 352 వివిప్యాట్లు, మధిర అసెంబ్లీ సెగ్మెంట్ కు 332 బ్యాలెట్ యూనిట్లు, 332 కంట్రోల్ యూనిట్లు, 375 వివిప్యాట్లు, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ కు 364 బ్యాలెట్ యూనిట్లు, 364 కంట్రోల్ యూనిట్లు, 411 వివిప్యాట్లు తరలించి, భద్ర పర్చడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, డిఆర్వో ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, తహశీల్దార్లు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి జి. పున్నయ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్. సత్యంబాబు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి చీకటి రాంబాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బిడ్డనైన నన్ను ఆశీర్వదించండి.. ఎన్టీఆర్ స్ఫూర్తితో మరింత వేగంగా పని చేస్తా

### లకారం ట్యాంక్ బండ్ లో వాకర్స్ ను కలిసి ఎన్నికల ప్రచారం చేసిన బీఆర్ ఎస్ ఎంపీ అభ్యరి నామ నాగేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 21(జనంసాక్షి) :**
ఆదివారం ఉదయం ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లో వాకర్స్ ను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నామ వాకింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడి, తనకు ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించి, పార్లమెంట్ కు పంపించాలని వారిని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వాకింగ్ కు వచ్చిన ప్రతి ఒక్కరిని కలిసి ఎన్నికల్లో తనకు సహకరించాల్సిందిగా కోరారు. మీ అందరి ఆశీర్వాదం వల్లనే గతంలో మంచి మెజారిటీ తో గెలిచి, పార్లమెంట్‌కు వెళ్లి జిల్లా ప్రజా గొంతుకై, సమస్యలపై గళం వినిపించడం జరిగిందని ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. తన గెలుపు ద్వారా కేసీఆర్ కు మద్దతుగా నిలవాలన్నారు. తనను గెలిపించడం అంటే తెలంగాణా అభివృద్ధి ని బలపర్చడమేనని అన్నారు. బీఆర్ ఎస్ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణా ప్రయోజనాలు, హక్కులు కాపాడబడ తాయని తెలిపారు. మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేవలం నాలుగు నెలల కాలంలో ఏమీ చేయలేక అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేసిందని అన్నారు. ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ కు ఓటేసి పొరపాటు చేశామని అన్ని వర్గాల ప్రజలు చెబుతూ ఆవేదన చెందుతున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తన ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని చెప్పారు. ఈ సారి ఆ పార్టీకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయమని, తనకే ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారని చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్రం పై పోరాడి, అధికారులతో మాట్లాడి, లేఖలు రాసి, జిల్లా అభివృద్ధికి కృషి చేశానని , జాతీయ రహదారుల వెనుక తన కృషి ఎంతో ఉందన్నారు.. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలన్నా రు. నిబద్ధతో పార్లమెంట్ కు అత్యధిక శాతం హజరు శాతం తో పాటు అత్యధిక ప్రశ్నలు అడిగి రికార్డ్ సృష్టించడం జరిగిందని తెలిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా జిల్లా ప్రతిష్టను ఇనుమడింప జేశానని నామ తెలిపారు. మీరు ఓటు వేయడమే కాకుండా చుట్టూ పక్కల వారికి చెప్పి, బంధువులకు తెలియజేసి, ఓట్లు వేయించి, అభివృద్ధి కి పట్టం కట్టాలని అన్నారు. ఖమ్మం నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, ఇందుకు సాక్ష్యం లకారం ట్యాంక్ బండ్ అన్నారు .లకారం చెరువు గతం లో ఎలా ఉంది ఇప్పుడెలా ఉందో తెలుస్తుందన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆప్యాయత తో పలకరించి, మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కు వెళ్లి, నివాళర్పించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో మరింత వేగంతో పని చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జస్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఖాద ర్ బాబు, కోశాధికారి గడిపూడి జనార్దన్ రావు, గుత్తా శ్రీనివాసరావు, వెంకటే శ్వరరావు, జైపాల్ , మోరంపూడి ప్రసాద్, గోడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీష్ , చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన మునుగోడు ఎంపీపీ

**మునుగోడు ఏప్రిల్ 21(జనంసాక్షి):**
బీఆర్ఎస్ మునుగోడు మండల ఎంపీపీ కర్నాటి స్వామి,సీనియర్ నాయకులు జూనియర్ పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల అభివృద్ధి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. పేదలకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి చమల కిరణ్ కుమార్ రెడ్డి భారీ వెజారిటీతో గెలిపించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

### జిల్లా ఎస్పీ చందనా దీప్తి



**నల్గొండటౌన్, ఏప్రిల్ 21(జనంసాక్షి):**
23 న హనుమాన్ జయంతి సందర్భంగా శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర లో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా నిర్దేశించిన మార్గం ద్వారా,సమయపాలన పాటిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలని అన్నారు. శోభ యాత్ర నిర్వహించే సమయంలో ఇతర మతాల వారి మనోభావాలను కించపరిచే విధంగా నినాదాలు చేయరాదని మత సామరస్యంతో సోదరభావంతో ర్యాలీ నిర్వహించుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకరమైన పోస్టులు,తప్పుడు ప్రచారాలను పోస్టు చేస్తూ వివాదాలకు దారి తీసే విధంగా పోస్టు చేస్తే కఠిన చర్యలు తప్పవని, జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తూ నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అలాంటి తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హనుమాన్ శోభాయాత్ర నిర్వహులు బాధ్యతగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తూ పోలీసు వారి సూచనలూ పాటిస్తూ సహకరించగలరని అన్నారు.



## ఎండలకు తట్టుకోలేక బీర్లను ఆశ్రయిస్తున్న మద్యం ప్రియులు

**మధిర ఆర్సి, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో దంచుతున్న ఎండలకు బీరు సీసాలు ఖాళీ అవుతున్నాయి. ఎండలు ఏ రేంజ్ లో దంచి కొడుతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీలేదు. ఉదయం 9 దాటితే నిప్పుల కొలిమిలా మారుతుంది. ఇంట్లో నుండి అడుగు భయటపెట్టాలనే ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం 7 వరకు కూడా వేడి ఏమాత్రం తగ్గడం లేదు. దీంతో.. మద్యం ప్రియులు బీర్లను ఆశ్రయిస్తున్నారు. తాజాగా ఎక్సైజ్ అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం.. ఏప్రిల్ 1 నుంచి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మందుబాబులు రూ.670 కోట్ల విలువైన 23 లక్షల కేసుల బీర్లను తాగేశారట. ఇది ఆల్టైమ్ రికార్డు అని ఎక్సైజ్ అధికారులు చెపుతున్నారు. గతేడాది ఇదే నెల కంటే 28.7% అధికంగా బీర్ల అమ్మకాలు జరిగాయని చెప్పుకొచ్చారు. గత 15 రోజులుగా బీర్ల తయారీ తగ్గడంతో అమ్మకాలు ఇంకాస్త తగ్గాయని లేదంటే ఇంకా పెరిగి ఉండేదని అంటున్నారు. వర్ష ప్రభావం లేకపోవడంతో బీర్ల కొరత ఏర్పడిందని డిమాండ్ తగ్గ బీర్లను అందించలేకపోతున్నామని చెపుతున్నారు.

## ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలి

### సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 21(జనంసాక్షి)**
ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని ఖమ్మం పార్ల మెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. ఆదివారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సహాయ రిటర్నింగ్ అధికారులతో లోకసభ సాధారణ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల పనులు నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తదుపరి ఇవిఎం యంత్రాలు సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూం లకు తరలించినట్లు ఆయన అన్నారు. మే, 3, 4 తేదీల్లో ఇవిఎం ల రెండో ర్యాండమైజేషన్, కమీషనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందుకై కమీషనింగ్ కొరకు స్ట్రాంగ్ రూం కు దగ్గర్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కమీషనింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియపై అభ్యర్థులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో చేపట్టాలన్నారు. ఇవిఎం ల రవాణాలో హమాలీలకు అసెంబ్లీ సెగ్మెంట్ తెలిసే విధంగా టీ షర్టులపై స్టిక్కర్లు వేయించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీని ఈ నెల 25 నుండి చేపట్టాలన్నారు. ఇంటింటికి పంపిణీ చేయాలని, బల్క్ పంపిణీ చేయరాదని ఆయన తెలిపారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో సెక్టార్ అధికారులు పూర్తిగా భాగస్వామ్యం అయి, పంపిణీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఓటర్ స్లిప్పులతో పాటు ఓటర్ హెల్ప్ లైన్, సి-విజిల్, ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించాలని, సి-విజిల్ డౌన్లోడ్ చేయించాలని ఆయన అన్నారు. పోలింగ్ తేదీ, సమయం తెలియజేస్తూ, పోలింగ్ స్టేషన్ లకు వచ్చేలా ఓటర్లకు ఆహ్వానం పలకాల న్నారు. సెక్టార్ అధికారులకు వాహనాల ఏర్పాటు చేసినట్లు, అట్టి వాహనాలు సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రారంభించి, సెక్టార్ అధికారులకు అప్పగించాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. రెండు రోజుల్లో జిల్లాకు ఎపిక్ కార్డులు వస్తాయని, మరో రెండు రోజుల్లో ఎపిక్ కార్డుల బట్వాడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే, 3 నుండి హెూం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఇందుకై సరిపోను టీముల ఏర్పాటు చేయాలన్నారు. హెూం ఓటింగ్ టీములకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మే, 3న ప్రారంభం అవుతున్నందున, దీనికి ముందు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. రోజువారి హెూం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ భద్ర పర్చుటకు, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం ను తెరవడం, మూయడం చేసు సందర్భంలో అభ్యర్థులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో తెరవడం, మూయడం చేయాల న్నారు. వివిస్టి టీములని క్రియాశీలం చేయాలన్నారు. అనుభవజ్ఞులైన వీడియోగ్రాఫర్ లను వివిస్టి టీములలో వినియోగించాలన్నారు. మేజర్ సభలు, కార్యక్రమాల్లో సహాయ వ్యయ పరిశీలకులు హాజరయ్యేలా చూడాల న్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి, కనీస మౌళిక సదుపాయాలకల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో మంజూరు పనులు ఈ నెల 23 లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే నెల 1,2, 6,7 తేదీల్లో పోలింగ్ శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్రియాశీలకంగా వుంటూ, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, డిఆర్డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసేంత వరకూ వెంటాడి.. వేటాడుతాం

### నామ నాగేశ్వరరావు,తాతా మధు, పువ్వాడ అజయ్,వద్దిరాజు రవిచంద్ర




**ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**
ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడి, వేటాడతామని బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నామ మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని, పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉండి, మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని, ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని గ్రహించారని, ఈ ఎన్నికల్లో పొరపాటును సరిదిద్దుకుని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కేసీఆర్ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ఇంతవరకు పరిహారం చెల్లించలేదని, ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని కలెక్టర్ ను కలిసి కోరినా పట్టించుకోలేదని చెప్పారు. మరో పక్క తాగు, సాగు నీరు లేక ప్రజలు, రైతులు ఎంతో ఇబ్బందిపడుతున్నారని అన్నారు. 10 ఏళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ గా అభివృద్ధి చేసి, దేశానికే దిక్చూచి గా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం నాలుగు నెలల్లో రాష్ట్రాన్ని పూర్తిగా సంక్షోభం లోకి నెట్టారని అన్నారు. తెలంగాణా గొంతుకను పార్లమెంట్ లో బలంగా వినిపిం చేందుకు ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణా ప్రయో జనాలు కాపాడే సత్తా ఒక్క బీఆర్ ఎస్ ఎంపీలకే సాధ్యమని, ఈ పరిస్థితుల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ హత్య, దాడుల సంస్కృతిని పార్టీ జిల్లా అధ్యక్షుడు , ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖండించారు. నామ నాగేశ్వరరావు గెలవబోతున్నారన్న సంగతి తెలిసి డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరెన్ని చేసినా నామ గెలుపును అడ్డుకోలేరని చెప్పారు. ఇంకా విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,పార్టీ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, నాయకులు వీరన్న, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై హత్యకుట్రపై సమగ్ర విచారణ జరపాలి..

### జంజీరాల రాజేష్ డిమాండ్



**ఖమ్మం టౌన్, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**
నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను గత అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డు తొలగించేందుకు , హత్యకు కుట్ర పన్నిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రైతు ఆత్మహత్యల నివారణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంజీరాల రాజేష్ డిమాండ్ చేశారు. నగరంలోని తన కార్యాల యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంజీరాల మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే మతోన్మాద బీజేపీ పార్టీ అభ్యర్థులు ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పి , ఓట్లు అడగాలని అన్నారు . బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ , కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీల అమలును బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని జంజీరాల విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి, రైతులకు రుణమాఫీ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పెట్రోల్,డీజీల్, గ్యాస్ నిత్యావసర ధరలను నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని ఆరోపించారు. ఖమ్మం పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే నామ నాగేశ్వరరావు ఖమ్మం కు కేంద్రం నుంచి తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి చెప్పాలని ప్రశ్నించారు . కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు హామీలను నెరవేర్చి ప్రజల మెప్పు పొందుతుందని జంజీరాల రాజేష్ స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే అమలు చేసిన కొన్ని గ్యారంటీల అమలు ప్రజా ఆదరణ పొందాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి , కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ తో పెద్దపీత వేస్తోందని తెలిపారు . మోడీ ప్రభుత్వం రైతులకు ఎంఎస్పీ కల్పిస్తామని మోసపూరిత మాటలు చెప్పి , గుర్రాలతో తొక్కించిన విషయాన్ని జంజీరాల గుర్తు చేశారు . బీజేపీ పార్టీ అభ్యర్థులు ప్రజలను ఓట్లు అభ్యర్థించే క్రమంలో , లక్ష 60 వేల కోట్ల అప్పును ఏవిధంగా తీరుస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుత లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీ పథకాలను పేదలందరికీ అమలు చేయాలి




**ఖమ్మం టౌన్, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారందరికీ తక్షణమే అందించాలని, ఇందులో రేషన్ కార్డులు, గృహ నిర్మాణం వెంటనే మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం లో రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ సర్కిల్ కన్వీనర్ రాయల రవికుమార్ అధ్యక్షతన జరిగింది. కోలేటి నాగేశ్వరావు ప్రసంగిస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పరిపాలన సాగిస్తూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకొని వంద రోజులకు పైగా పూర్తవుతున్న ఎన్నికల కోడ్ తో పూర్తిగా నిలిచిపోయినాయని, పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు కూడా ప్రజలకు అందకపోవటం వలన, రేషన్ కార్డులలో పేరు తొలగిపోయినటువంటి ప్రజలు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పేద ప్రజలకు మంచినీటి ఎద్దడి ఏర్పడి మంచి త్రాగునీళ్ల ను కొనుక్కునేటువంటి దుస్థి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నికల వేడి ఊపొందుకున్నదని మతోన్మాద బిజెపి ఆర్ఎస్ఎస్ మరియు ఎన్డీఏ కూటమి అనేక వాగ్దానాలతోటి మోసగించటానికి వస్తున్నారని 10 సంవత్సరాల కాలంలో మోడీ పరిపాలనలో ప్రజలు అనేక హింసలను, ఇబ్బందులను ఎదుర్కొన్నారని, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారని,పేదలు విద్య, వైద్య, ఆరోగ్యలకు దూరమైనారని ఆయన విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, నాగపూర్ లో ఆర్ఎస్ఎస్ కార్యాలయం నుండి దేశంలో ప్రశ్నించే మేధావులను, రచయితలను,పౌరహక్కుల సంఘాల నాయకులను,ప్రజా ఉద్యమకారులను డైరెక్షన్ ఇస్తున్నారని ఆయన విమర్శించారు. నరేంద్ర మోడీ నియంత్రత విధానాలను ఓడించాలంటే ప్రజలందరూ కూడా ఐక్యమై పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, జిల్లా నాయకులు కే శ్రీనివాస్, పిడిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, పార్టీ డివిజన్ నాయకులకు కేలోతు లక్ష్మణ్, పిఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి పి శోభ, పి వై ఎల్ జిల్లా నాయకులు భరత్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు యోగానందం, పి డబ్ల్యూ నాయకులు కే లక్ష్మి, పి వై ఎల్ నగర కార్యదర్శి మక్కా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.






# కేజ్రీవాల్, సోరెన్ పేర్లతో ఖాళీ కుర్చీలు


**రాంచీ:** సార్వత్రిక ఎన్నికల మొదటి దశ ఎలక్షన్స్ పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా ఇంకా ఆరు దశల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ తరుణంలో ఇండియా బ్లాక్ రాంచీలో ఆదివారం మెగా ర్యాలీ నిర్వహించారు.అయితే జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కోసం రెండు ఖాళీ కుర్చీలు వేదికపై ఉంచారు. వేదికపైన ఝూర్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, ఆప్ అధినేతల కోసం కుర్చీలు ఖాళీగా ఉంచినప్పటికీ.. ఈ సమావేశానికి వారి భార్యలు కల్పనా సోరెన్, సునీతా కేజ్రీవాల్ వేదికపై కూర్చున్నారు. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయిన తరువాత వీరి భార్యలే రాజకీయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.జార్ఖండ్ రాజధానిలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు ఉన్నప్పటికీ దాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా.. కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి కల్పన, సునీతలతో పాటు జేఎంఎం అధినేత శిబు సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత ఒ బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభాత్ తారా గ్రౌండ్‌లో జరిగిన ఈ ర్యాలీలో మొత్తం 28 రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి.

## పని దృష్టి పెట్టండి

### ఉద్యోగులకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వార్నింగ్

**జనంసాక్షి:**గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సంస్థ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు నిరసనలు వ్యక్తం చేయడం మానుకుని పనిపై దృషి పెట్టాలని, సంస్థను వ్యక్తిగత వేదికగా చూడకూడదని హెచ్చరించారు. గూగుల్ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయిల్‌తో క్లౌడ్ కంప్యూటింగ్ కాంట్రాక్ట్ ప్రాజెక్ట్‌పై పనిచేస్తుంది. రూ.10వేల కోట్ల విలువైన ప్రాజెక్ట్ నింబస్‌ను తక్షణమే నిలిపివేయాలని, గూగుల్ తీరును విమర్శిస్తూ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అమెరికా దన్నుతో ఇతర దేశాలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా గూగుల్ ఉద్యోగులు ఆందోళనకు దిగుతున్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి.

# బీమా మరింత సులభతరం



హెల్త్ ఇన్సూరెన్స్‌కి సంబంధించి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది.ఏప్రిల్ 1, 2024 నుండి అమల్లోకి వచ్చే ఆరోగ్య బీమా పాలసీల కొనుగోలుపై వయోపరిమితిని తొలగించింది.ఇంతకు ముందు, 65 ఏళ్ల వయసు వరకు మాత్రమే కొత్త బీమా పాలసీలను కొనుగోలు చేయడానికి అవకాశం ఉండేది. అయితే, ఏప్రిల్ 01, 2024 నుండి అమలులోకి వచ్చిన ఇటీవలి మార్పుల తర్వాత, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా కొత్త ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అర్హులు."బీమా సంస్థలు అన్ని వయసుల వారికి ఆరోగ్య బీమా ఉత్పత్తులను అందించాలి. బీమా సంస్థలు సీనియర్ సిటిజన్‌లు, విద్యార్థులు, పిల్లలు, ప్రసూతి, కాంపిటెంట్ అథారిటీ ద్వారా నిర్దేశించిన ఏదైనా ఇతర గ్రూపుల కోసం ప్రత్యేకంగా బీమా ఉత్పత్తులను రూపొందించవచ్చు" అని ఐఆర్‌డీఏఐ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.కాగా క్యాన్సర్, గుండె లేదా మూత్రపిండ వైఫల్యం, ఎయిడ్స్ వంటి తీవ్రమైన వైద్య పరిస్థితులు ఉన్న వ్యక్తులకు పాలసీలు ఇవ్వకుండా బీమా సంస్థలు నిరాకరించడానికి వీల్లేదని ఐఆర్‌డీఏఐ ఇటీవలే ఆదేశాలు చేసింది. ఇక తాజా నోటిఫికేషన్‌లో ఐఆర్‌డీఏఐ హెల్త్ ఇన్సూరెన్స్ వెయిటింగ్ పీరియడ్‌ను కూడా 48 నెలల నుంచి 36 నెలలకు తగ్గించింది.

## లాస్‌లో కంపెనీ.. సీఈవో మాత్రం ఫుల్ హ్యాపీ!



కంపెనీ లాస్‌లో ఉంటే సీఈవో ఫుల్ హ్యాపీ ఏంటి అనుకుంటున్నారా? మీడియా సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సీఈవో డేవిడ్ జస్లావ్ వార్షిక వేతన పరిహారం 2023లో దాదాపు 27 శాతం పెరిగి 49.7 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.414 కోట్లు) చేరుకుంది.సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కి సమర్పించిన ఫైలింగ్‌లో కంపెనీ ఈమేరకు పేర్కొంది. 2023లో నష్టాలను ఎదుర్కొన్నప్పటికీ సీఈవో వేతన పరిహారాన్ని మాత్రం కంపెనీ పెంచింది. ఆ ఏడాది వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ 3 బిలియన్ డాలర్ల నష్టాలను చవిచూసింది. అయితే అంతకు ముందు ఏడాది కంటే నష్టాలు సగానికిపైగా తగ్గాయి. 2022లో కంపెనీ నష్టాలు 7 బిలియన్ డాలర్లుగా ఉండేవి. కాగా 2023లో కంపెనీ ఫ్రీ క్యాష్ ఫ్లో 86 శాతం పెరిగి 6.16 బిలియన్ డాలర్లకు చేరుకుందని నివేదించింది. కేబుల్ టీవీ క్షీణత, బలహీనమైన ప్రక టనల మార్కెట్, హాలీవుడ్ సమ్మెల పతనం కారణంగా ఒత్తిడితో ఫిబ్రవరిలో కంపెనీ ఊహించిన దానికంటే పెద్ద త్రైమాసిక నష్టాన్ని నివేదించింది.జాస్లావ్ 2022 లో అందుకున్న 12 మిలియన్ డాలర్లతో పోలిస్తే 2023లో 23.1 మిలియన్ డాలర్ల స్టాక్ అవార్డులను అందుకున్నారు. కంపెనీ షేర్లు గత సంవత్సరం 20 శాతం పెరిగాయి. జస్లావ్ వేతనం 2022 నుంచి పెరిగినప్పటికీ, ఆయన 2021లో అందుకున్న 246.5 మిలియన్ డాలర్ల కంటే చాలా తక్కువ.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 3.75 | ₹ 3.77 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹65,350 | ₹71,290 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

చెన్నై

| ₹66,150 | ₹72,160 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹87,000

# కళ్లు లేకపోయినా..కోట్ల సామ్రాజ్యానికి అధిపతి



అతనికి చూపులేకపోయినా వందల కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతిగా అయ్యి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. చుట్టూ ఉన్న సమాజం నుంచి ఎన్నో తిరస్కరణలు.అన్ని అర్హతలు ఉండి అనుకున్న చదువు చదువుకోవడానికి వీల్లులేకుండా చేసిన విద్యా చట్టంపై పోరాడి గెలిచి అనుకున్న చదువుని అందుకున్నారు. అంత చేసినా మళ్లీ ఐఐటీ చేరేదామనుకుంటే కోచింగ్ సెంటర్లు రకరకాలుగా భయపెట్టాయి. దీంతో ఆయన నన్నుఐఐటీ వద్దనుకుంటే..ఐఐటీ కూడా నాకొద్దు అని ధైర్యంగా చెప్పి.. ఏకంగా నాలుగు అమెరికా యూనివర్సిటీలో సీటు సంపాదించారు. దటీజ్ శ్రీకాంత్ బొల్లా అని ప్రూవ్ చేశారు. ఆయన కెరీర్ కష్టాల జర్నీ ఎలా సాగిందంటే..ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి చెందిన శ్రీకాంత్ బొల్లా చిన్నప్పటి నుంచి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని, దాదాపు రూ.500 కోట్ల విలువైన కంపెనీని సృష్టించారు. దివ్యాంగులకు తన కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వాలని శ్రీకాంత్ నిర్ణయించారు. ఆరేళ్ల వయసులో శ్రీకాంత్ రోజూ కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ స్కూలుకు వెళ్లేవారు. ఆయన సోదరులు, క్లాస్‌మేట్లు ఆయన్ను చేయిపట్టుకుని స్కూలుకు తీసుకెళ్లేవారు. స్కూలుకు వెళ్లే దారంతా చెత్తా చెదారం, చెట్లు చేమలతో నిండి ఉండేది. వర్షాకాలం వస్తే ఇబ్బందులు రెట్టింపయ్యేవి. నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్రీకాంత్ సమాజం నుంచి లెక్కపెట్టలేనన్ని సార్లు తిరస్కరణకు గురయ్యారు.కుక్క ఇంట్లోకి వచ్చిందన్నది కూడా తెలియని ఈ బిడ్డ మీకు ఎందుకు అని చుట్టుపక్కల వాళ్లు ముఖంపై అన్న..అవన్నీ పట్టించుకోకుండా తల్లిదండ్రులు అతని కావాల్సినంత అండదండ ఇచ్చారు. ఆ క్రమంలో ఎనిమిదేళ్ల వయసులో ఉండగా అంధ విద్యార్థులు చదువుకునే బోర్డింగ్ స్కూల్‌లో శ్రీకాంత్‌కు సీటు వచ్చింది. దీంతో తన సొంత ఊరికి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు చేరుకున్నారు.

తల్లిదండ్రులకు దూరమైనా, స్కూల్లో చాలా ఉత్సాహంగా గడిపేవారు శ్రీకాంత్. ఈత కొట్టడం, చెస్, క్రికెట్ లాంటి ఆటలన్నీ నేర్చుకున్నారు. శబ్ధం చేసే బంతితో ఆయన క్రికెట్ ఆడగలిగేవారు. బోర్డింగ్ స్కూల్లో శ్రీకాంత్ తన హాబీలను ఆస్వాదించారు. అదే సమయంలో భవిష్యత్తు గురించి కూడా ఆలోచించడం ప్రారంభించారు. ఇంజినీర్ కావాలన్నది ఆయన కల. అందుకోసం సైన్స్, మ్యాథ్స్ చదవాలని అనుకున్నారు శ్రీకాంత్.కోరుకున్న విధంగానే ఆయన మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులను ఎంచుకున్నారు. కానీ, 'ఆ సబ్జెక్టులు తీసుకోవడానికి నీకు అర్హత లేదు' అంటూ స్కూల్ యాజమాన్యం చెప్పింది. అయితే, ఇది చట్ట విరుద్ధమని శ్రీకాంత్ వాదించారు. శ్రీకాంత్ చదివే స్కూల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా మండలి పరిధిలో ఉంటుంది. ఈ మండలి నిబంధనల ప్రకారం, అంధులైన సీనియర్ విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్ ఎంచుకోవడం వీలుకాదు.

ఈ సబ్జెక్టులలో డయాగ్రామ్‌లు, గ్రాఫ్‌లు ఉంటాయి కాబట్టి, వీటిని అంధులైన విద్యార్థులు చదవలేరంటూ వీటికి వారిని అనర్హులుగా పేర్కొంది.దీనికి బదులుగా వారు, ఆర్ట్స్, లాంగ్వేజ్, లిటరేచర్, సోషల్ సైన్సెస్‌లను ఎంచుకోవచ్చని సూచించింది. దీంఓ ఆయనకు టీచర్‌గా వ్యవహరించిన తక్కెళ్లపాటి స్వర్ణలత సాయంతో తమ వాదనను వినిపించడానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు వెళ్లారు. కానీ, నిబంధనలు అలా ఉన్నాయని, తామేమీ చేయలేమని అక్కడి అధికారులు చెప్పారు. నిరాశ చెందకుండా శ్రీకాంత్, అతడి టీచర్ స్వర్ణలత ఒక లాయర్‌ను సంప్రదించారు. అంధ విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్ చదివేందుకు అనుమతిచ్చేలా విద్యా చట్టాన్ని మార్చాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు వేశారు.కేసు నడుస్తున్న కాలంలోనే, శ్రీకాంత్‌కు ఒక వార్త తెలిసింది. హైదరాబాద్‌లోని చిన్మయ విద్యాసంస్థ వేరే విద్యామండలి ఆధ్వర్యంలో నడుస్తోందని, అక్కడ అంధ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్సు బోధిస్తారని తెలిసింది. వెంటనే శ్రీకాంత్ అందులో చేరారు. క్లాస్ మొత్తంలో తానొక్కరే అంధ విద్యార్థి. కానీ వారంతా తనని ముక్తకంఠంతో స్వాగతించారని శ్రీకాంత్ వివరించారు. మా క్లాస్ టీచర్ చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు. ఆమె నాకు చేయగలిగిన సాయమంతా చేసేవారు. స్పర్శ సాయంతో డయాగ్రామ్‌లు ఎలా గీయాలో ఆమె నేర్పారు అని తెలిపారు శ్రీకాంత్. ఒక్క రబ్బర్ మ్యాట్‌పై పెన్ను లేదా పెన్సిల్‌తో గట్టిగా గీసినప్పుడు ఆ లైన్ పేపరు మీద ఉబ్బెత్తుగా మారుతుంది. చేతితో తాకి ఆ లైన్‌ను తెలుసుకోవచ్చు.ఆరు నెలల తర్వాత కోర్టు నుంచి తీర్పు వచ్చింది. శ్రీకాంత్ తాను వేసిన కేసులో గెలిచారు.అంధ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో సైన్స్, మ్యాథ్స్ చదవడానికి అర్హులని కోర్టు తీర్పు చెప్పింది. నాకు చాలా సంతోషం వేసింది.

## ఆయిల్ ధరలపై ఇరాన్-ఇజ్రయెల్

# యుద్ధ పిడుగు



**జనంసాక్షి:**పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ వాణిజ్యంపై మరింత ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం భారత్ సహా పలు దేశాల్లో చమురు ధరలపై పడనున్నట్లు అంచనా.సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ దేశాల నుంచి అత్యధిక మొత్తంలో క్రూడ్ ఆయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే.ఇజ్రాయెల్‌పై ఇరాన్ డ్రోన్, రాకెట్ దాడులు.. అనంతరం ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘర్షణ వాతావరణం క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ చర్యలను కట్టడి చేసేందుకు పలు దేశాలు కృషి చేస్తున్నాయి. ఈ తరుణంలో ఒకవేళ హర్మోజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా లేదా పాక్షికంగా అడ్డుకుంటే.. ముడి చమురు, ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ధరలు పెరుగుతాయని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి.ఒమన్-ఇరాన్ సముద్ర మార్గంలో హర్మోజ్ జలసంధి ఉంటుంది. దాదాపు 40 కి.మీ మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీలు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1కోట్ల (21మిలియన్) బారెళ్ల చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారి వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20శాతం ఇక్కడ నుంచే సరఫరా జరుగుతోంది.భారత్ అవసరాల్లో 85శాతం క్రూడ్ ఆయిల్ సౌదీ, ఇరాక్, యూఏఈ నుంచి వస్తుండగా.. ఖతార్ నుంచి వచ్చే ఎల్ఎన్‌జీ కూడా ఈ జలసంధి మార్గంలోనే వస్తుంది. ఈ నేపథ్యంలో ఒకవేళ 'హర్మోజ్' జలసంధిని ఇరాన్ అడ్డుకుంటే.. చమురు రవాణాకు ఎర్ర సముద్రం ప్రత్యామ్నాయంగా ఉంది. కానీ, ఎల్ఎన్‌జీ దిగుమతికి మాత్రం అటువంటి సౌలభ్యం లేదు. దీంతో భారత్‌లో ఇంధన ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

**ఇరాన్ పూర్తిగా లేదా పాక్షికంగా అడ్డుకుంటే..**

క్రూడ్ ఆయిల్, ఎల్ఎన్‌జీ ధరలు పెరుగుతాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. తాజా పరిస్థితులతో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో వీటి ధరలు పెరిగే ముప్పు ఉందని మూడీస్ కూడా అంచనా వేసింది. ఇప్పటికే ఈ ఏడాది తొలి నుంచి క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగే ధోరణి కనిపిస్తోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ డైరెక్టర్ హార్దిక్ షా పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మరింత దిగ జారితే.. ముడి చమురు ధరల పెరుగుదలకు దారి తీ యవచ్చన్నారు. రష్యా నుంచి భారత్‌కు ఇంధన దిగుమతులు ఇటీవల పెరగడం కాస్త ఊరట కలిగించే అంశం.

# నేడు మాల్దీవుల్లో పార్లమెంటు ఎన్నికలు

### ముయిజ్జు పాలనకు అగ్నిపరీక్ష



**మాలే:** ద్వీపదేశం మాల్దీవులో పార్లమెంట్ ఎన్నికలు నేడు జరుగుతున్నాయి. ఇవి అధ్యక్షుడు ముయిజ్జు పాలనపై ప్రజా తీర్పుగా భావిస్తున్నారు. సెప్టెంబర్‌లో ఆయన అధి కారం చేపట్టాక భారత వ్యతిరేక వైఖరిని అనుసరించారు. ఈ క్రమంలో అక్కడున్న మన బలగాలను వెనక్కి పంపించారు. చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలకు కీలక కాంట్రాక్టులను కట్టబెట్టారు. ప్రస్తుతం ఆ దేశ పార్లమెంటు సభ్యులు మాత్రం ముయిజ్జు తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. అతడి చర్యలను అడ్డుకోవడానికి మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ కలిసి పనిచేస్తున్నారు.ముయిజ్జు సీనియర్ సహాయకుడు ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ "ఈ ఎన్నికల్లో భౌగోళిక రాజకీయాలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత సైన్యాన్ని వెనక్కి పంపిస్తానని హామీ ఇచ్చి ముయిజ్జు అధికారంలోకి వచ్చారు. ఆ దిశగా ప్రయత్నించారు. కానీ, పార్లమెంటు ఆయనకు సహకరించడం లేదు. ఆయన ఎంపిక చేసిన మంత్రులకు వ్యతిరేకంగా ఓటేసి వారి పదవులు పోయేలా చేసింది" అని తెలిపారు. ఈ వ్యాఖ్యలను బట్టి ముయిజ్జు పార్టీ కూడా ఈ ఎన్నికలను తమ పాలనకు కఠిన పరీక్షగా భావిస్తోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దాదాపు 2,85,000 మంది ఆదివారం నాడు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. వీటి ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి.


# జపాన్‌లో ఘోరప్రమాదం

### రెండు హెలికాప్టర్లు క్రాష్.. ఒకరి మృతి, ఏడుగురి గల్లంతు

**టోక్యో(జనంసాక్షి):**జపాన్‌కు చెందిన రెండు సైనిక హెలికాప్టర్లు సముద్రంలో కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఏడుగురు గల్లంతయినట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిందని రాయిటర్స్ నివేదించింది.హె లికాప్టర్ల ప్రమాద ఘటనను జపాన్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ ప్రతినిధి ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు ధ్రువీకరించారు. గల్లంతయిన వారిలో ఒకరిని రక్షించగా పీటీఐ ప్రకారం.. ఈ వ్యక్తి ఇప్పుడు చనిపోయినట్లు ప్రకటించారు. జపాన్ రక్షణ మంత్రి మినోరు కిహారా విలేకరులతో మాట్లాడుతూ సముద్రంలో విమాన భాగాలుగా భావిస్తున్న వాటిని రక్షణ బృందాలు గుర్తించినట్లు చెప్పారు. రెండు హెలికాప్టర్లు సముద్రంలో కూలిపోయినట్లు తాము భావిస్తున్నామన్నారు. ప్రమాదానికి కారణం తెలియ దని, మొదట బాధితుల ప్రాణాలను కాపాడటానికి కృషి చేస్తు న్నట్లు అని కిహారా చెప్పారు.జపనీస్ నేషనల్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే నివేదించినదాని ప్రకారం.. పసిఫిక్ మహాసము ద్రంలోని ఇజు దీవులలో ఈ సంఘటన జరిగినప్పుడు జలాం తర్గాములను ఎదుర్కోవడానికి హెలికాప్టర్లు రాత్రిపూట డ్రిల్‌లలో నిమగ్నమై ఉన్నాయి.తోరిషిమా ద్వీపం నుంచి రాత్రి 10:38 గంటలకు ఒక హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ పోయింది.

# మాగ్నటిక్ ఫిషింగ్!

### గాలం వేస్తే..కుప్పకుప్పలుగా ఆయుధాలే..!



ఫిషింగ్ అంటే చేపలు పట్టడం. మరీ మాగ్నటిక్ ఫిషింగ్ ఏంటీ..? గాలం వేస్తే ఆయుధాలే బయటపడటం ఏమిటీ.. అంటే..అనుకుంటున్నారా..!. మనం చేపలు పట్టడానికి గాలానికి ఏదోఒక మాంస ముక్క లాంటిది ఎర వేసి చేపలు పట్టుకుంటాం.కాన్నీ ఇక్కడ మాత్రం పెద్దపెద్ద అయస్కాంతాలను కాలువలు, చెరువుల్లోకి ఎరగా వేసి కత్తులు, తుపాకీలు వెలకితీస్తారు. ఎక్కడ చేస్తారంటే ఇలా..42 ఏళ్ల మార్క్ మెక్ జియాచిన్, ఆయన తొమ్మిదేళ్ల కొడుకు జేమ్స్ ప్రతి వారం స్కాట్లాండ్‌లోని కాలువాలను జల్లెడ పడు తుంటారు. తాడుకు ఒక పెద్ద మ్యాగ్నట్(అ యస్కాంతం)ను కట్టి నీటిలోకి దింపి దానికి అతుక్కునే లోహాలతో తయారు చేసిన వస్తువుల కోసం గాలిస్తున్నారు మార్క్. 2019లో గ్లాస్గోకు చెందిన మార్క్.. గ్లాస్గో మ్యాగ్నెట్ ఫిషింగ్ గ్రూపును ఏర్పాటుచేశారు. ఈ గ్రూపులో వందలమంది చేరారు. ఇలా తమకు దొరికిన ప్రతి తుపాకీ, కత్తి లేదా బాంబు వంటి ఆయుధాలను స్కాట్లాండ్ పోలీసులకు రిపోర్టు చేస్తామని మార్క్ అన్నారు. ఆయన ఈ మాగ్రెట్ ఫిషింగ్ గ్రూప్‌ని యూట్యూబ్‌లో చూసిన అమెరికన్ అమెరికన్ మ్యాగ్నట్ ఫిషర్స్ ట్రాలింగ్ ఫర్ గన్స్‌ను చూసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆయన మొదట కొన్న అయస్కాంతం ధర 13.99 పౌండ్లు (రూ.1,442). ఆర్డరు చేసిన మరుసటిరోజే ఇది ఆయన ఇంటికి వచ్చింది. మొదటిరోజు మార్క్ ఆ మాగ్నట్‌ను తీసుకొని కిర్కింటిలోచ్‌కు వెళ్లినప్పుడూ.. అక్కడ ఏడు కత్తులు, ఒక గొడ్డలి దొరికాయని తెలిపారు. అయితే తాను ఏర్పాటు చేసిన ఈ ఫిషింగ్ గ్రూప్‌లో సభ్యులు లాక్‌డౌన్ సమయంలోనే విపరితంగా చేరారని చెప్పారు. ఆ తర్వాత గ్లాస్గోలోని మిగతావారు కూడా మార్క్‌లాగా మ్యాగ్నట్‌లు కొనుక్కొని రావడం మొదలుపెట్టారు. అలా మార్క్‌కి తోడుగా దాదాపు 50 నుంచి 60 మంది దాక వచ్చేవారు. వారంతా కలుసుకునేలా ప్రతి శనివారం మీటింగ్‌లు ఏర్పాటు చేసుకునేవారు.కానీ ఆయనకు ఈ ఫిషింగ్‌లో కత్తులు, తుపాకీలు, బాంబులు దొరకడంతో దీనిపై ఆసక్తి మరింత పెరిగిపోయింది. అలా అని మార్క్ ఏమి నేరస్తుడు కాదు. అయితే మార్క్ తీసిన ఆయుధాల్లో చాలా వరకు పేలని బాంబులు కూడా బయటపడ్డాయి. వాటిని బాంబ్ స్క్వాడ్‌లను పిలిపించి నిర్వీర్యం చేస్తుంటారు మార్క్. అంతేగాదు తమ గ్రూపు కార్లు, మోటారు బైక్‌లాంటివి కూడా వెలికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఇలాంటివి స్కాట్లాండ్‌లో నేరమేమికాదు గానీ, ఇలా ఆయుధాలను వెలికి తీసినప్పుడు తప్పనిసరిగా పోలీసులకు కాల్ చేసి రప్పించాల్సి ఉంటుంది.దీనికి తోడు పోలీసుల ఆ వెలికితీసిన ఆయుధాల వల్ల ప్రజలకు ముప్పు కలగుండా భద్రత పర్యవేక్షించడం సమస్యత్మకంగా ఉంటుంది. అందువల్ల అధికారులు దయచేసి కాలువలకు దూరంగా ఉండమని తమకు విజ?క్షప్తి చేస్తుంటారని మార్క్ అన్నారు. అయితే ఆయతన తనకు ఈ పని విసుగు వచ్చేంత వరకు చేస్తుంటానని చెబుతుండటం విశేషం. ఇంతవరకు వేలకొద్ది కత్తులు, బాంబులు, తుపాకీ వెలికి తీశాడు. అంతేగాదు మార్క్కి వైకింగ్ కాలంనాటి కత్తిని అన్వేషించి మరీ వెలికి తీయాలనది కోరిక అట.

## జాతీయం అంతర్జాతీయం

జనంసాక్షి

### పంటనష్టానికి పరిహారం అందిస్తాం

ఎన్నికల సంఘాన్ని మరొసారి సంప్రదించి నిధుల విడుదలకు అనుమతులు పొందేలా విజ్ఞప్తి చేయమని సూచించింది.వాటితోపాటే ఇప్పుడు జరిగిన నష్టాన్ని కూడా తొందరగా మదింపు చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టానికి సంబంధించిన నివేదికలు అందిన వెంటనే రైతులకు పరిహార నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. అంతేకాకుండా వరి పంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాల పాటు అన్నదాతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఇలాంటి అకాల వర్షాలు సంభవించే సందర్భంలో పంట నష్టం తగ్గించే విధంగా ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కర్షకులకు సూచించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వానాకాలం ముందు సరఫరా చేసే పచ్చి రొట్ట విత్తనాల సేకరణ కోసం టెండర్ల ప్రక్రియను నిర్వహించుటకు అనుమతి ఇచ్చినందుకు గానూ, రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఇండియా కూటమిలో లుకలుకలు

ఇండియా కూటమి పేరుతో అవకాశవాద కూటమి ఒకటి ఏర్పాటు చేశారు. కూటమిలోని పార్టీలే 25 శాతం సీట్లలో ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. కాగా, జలోర్‌లో లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భాగంగా పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుంది.

### ఇజ్రాయెల్‌పై ఆంక్షలకు అమెరికా సిద్ధం

వచ్చాయి. 2022లో 78 ఏళ్ల పాలస్తినా-అమెరికన్ ఒమర్ అసద్ మృతికి వీరే కారణమన్న ఆరోపణలున్నాయి. 2022 డిసెంబరులో వెస్ట్‌బ్యాంక్ నుంచి ఈ దళాన్ని ఇజ్రాయెల్ తరలించింది. కానీ, ప్రభుత్వం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. నాటి నుంచి ఈ దళం ఇజ్రాయెల్ ఉత్తర భాగంలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బెటాలియన్‌పై పలు వివాదాలున్నాయి.అమెరికా ఆంక్షల వార్తలపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఉగ్రవాదులపై పోరాడుతున్న తరుణంలో వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరారు. "ఐడీఎఫ్‌పై ఆంక్షలు విధించొద్దు. ఇజ్రాయెల్ పౌరులపై చర్యలను నేను వ్యతిరేకిస్తున్నాను. ఆ దిశగా బైడెన్ కార్యవర్గంతోనూ మాట్లాడుతున్నాను. మా సైనికులు ఉగ్రవాదులతో పోరాడుతున్నారు. ఈ తరుణంలో ఆంక్షలు విధించడం సరికాదు. అలా చేసినట్లయితే అది అనైతికతం. దీన్ని అడ్డుకోవడానికి యత్నిస్తాం" అంటూ నెతన్యాహు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్ జాతీయ భద్రత శాఖ మంత్రి ఇతమార్ బెన్ గవిర్ సైతం ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ దళాలపై ఆంక్షలను రెడ్ లైన్‌గా భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లో అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గద్దని రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌కు సూచించారు.



## కాంగ్రెస్ లో భారీ చేరికలు..

**తుంగతుర్తి ఏప్రిల్ 21 (జనంసాక్షి):** మండల పరిధిలోని మానాపురం గ్రామ సర్పంచ్ తో పాటు మద్దిరాల మండలం ఎంపీపీ భర్త గుడ్ల వెంకన్న తో పాటు పలువురు భారీ సంఖ్యలో టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారిని డిసిసి అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గుడ్ల వెంకన్న. తీగల వెంకన్న. మొడెం వెంకన్న. మానాపురం సర్పంచ్ బానోత్ సోమేశ్ తో పాటు వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

**బూర్గంపహాడ్ ఏప్రిల్ 21 (జనంసాక్షి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మోతె గ్రామం లో వేటకాని వారి వివాహ వేడుకకు పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వెటకాని ఊర్మిళ వెంకటేశ్వర్లు (లేటు) దంపతుల కుమారుడు రంజిత్ కుమార్ - సాగరికల వివాహ వేడుకలో ఆయన పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించి నూతన వస్త్రములు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలో వాస్తవం లేదు

### రీజనల్ మేనేజర్ శ్రీదేవి

**దేవరకొండ ఏప్రిల్ 21 జనంసాక్షి:** నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోనకు చెందిన డ్రైవర్ శంకర్ కు సెలవు మంజూరు చేయకుండా ఆర్టీసీ అధికారుల వేధించడం వల్లే ఆయన ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని వస్తోన్న ఆరోపణలో నిజం లేదని నల్గొండ రిజనల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు.ఈ సందర్భంగా వారు ఓ ప్రకటన విడుదల చేశారు.ఆ డ్రైవర్ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నెల 18, 19 తేదీల్లో విధులకు గైర్హాజరు అయ్యారని, అయినా ఈ నెల 20న డ్యూటీని అధికారులు కేటాయించడం జరిగిందని,మళ్ళీ ఆదివారం సెలవు కావాలని డిపో అధికారులను సంప్రదించడం జరిగింది అని అన్నారు.వాళ్ళు లీవ్ పొజిషన్ చూసి సెలవు మంజూరు చేస్తామని చెప్పారని,సెలవు ఇవ్వబోమని చెప్పలేదు అని అన్నారు.తనకు సెలవు మంజూరు చేయకుండా అధికారులు వేధిస్తున్నారని, పురుగుల మందు తాగుతున్ననంటూ ఒక సెల్ఫీ వీడియో వాట్సాప్ గ్రూప్ ల్లో శనివారం శంకర్ షేర్ చేయడం జరిగిందని,డ్రైవర్ ఎలాంటి పురుగుల మందు తాగలేదని వైద్యులు ధ్రువీకరించి డిశ్చార్జ్ చేశారని అన్నారు.గతంలోనూ సెలవుల విషయంలో అధికారులపై బెదిరింపులకు దిగారని,ఆయన లీవ్ రికార్డు సరిగా లేదని,గత మూడు నెలల్లో 10 సాధారణ లీవ్ లు, 20 సిక్ లీవ్ లను డ్రైవర్ శంకర్ తీసుకున్నారని తెలిపారు.సిబ్బందికి సెలవుల మంజూరు విషయంలో నిబంధనల ప్రకారమే సంస్థ నడుచుకుంటోందని,లీవ్ పొజిషన్, కారణం తీవ్రతను బట్టి సెలవులను మంజూరు చేస్తోందని అన్నారు.ఉద్దేశ్యపూర్వకంగా, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలను టీఎస్ఆర్టీసీ ఏమాత్రం ఉపేక్షించదని,ఇలాంటి ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## కాచాపూర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినుడి నర్సింహ యాదవ్

**పెద్దపల్లి, ఏపిర్ల్ 21 (జనంసాక్షి) :**



జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామములోని రామాలయం లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గందు సంజీవ్ తో కలిసి ప్రత్యేక పూజలు చేసి,బిక్ష నిర్వహించి, హనుమాన్ దీక్ష పరులతో కలిసి బీక్ష చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, జూలపల్లి మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు దారబోయిన నరసింహ యాదవ్.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంటు ఎల్లయ్య బైరెడ్డి మధుకర్,బలరాజుపల్లి మాజీ ఉప సర్పంచ్ అడువాల తిరుపతి,హనుమాన్ దీక్ష పరులు పాల్గొన్నారు.



## బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కు అందజేత

**యైటింక్లయిన్ కాలనీ ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన షేక్ సాహెరా-హాజీ పాషాలకు సీఎం రిలీఫ్ ఫండ్ 47వేల రూపాయల చెక్ పంపిణీ చేశారు. ఆదివారం గ్రామంలోని వారి ఇంటి వద్ద గ్రామ కాంగ్రెస్ పార్టీనాయకులు చాట్ల సదానందం, బెల్లంకొండ విజేందర్ రెడ్డి శనిగరం తిరుపతిలు సీఎం రిలీఫ్ ఫండు చెక్కు అందజేశారు. ఇటివల హాజీపాషా అనారోగ్య భారీన పడడంతో చికిత్స నిమిత్తము ఇట్టి విషయాన్ని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలియజేయడంతో సీఎం రిలీఫ్ చెక్కు మంజూరు చేయించి పంపించినట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబు సాహెరా కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి ఏప్రిల్ 21 జనంసాక్షి :**



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్ లో గల విష్ణు షాపింగ్ మాల్ మూడో అంతస్తులో ఆదివారం నాడు మాంగళ్య బాంక్వెట్స్ ఫంక్షన్ హాల్స్ నూతన ప్రారంభోత్సవం సందర్భంగా మాంగళ్య బాంక్వెట్స్ ఫంక్షన్ హాల్స్ లో వాస్తు, గణపతి, నవగ్రహ పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద బ్రాహ్మణోత్తముల కమనీయంగా నిర్వహించి నూతన ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అనంతరం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ కొండమల్లేపల్లి పట్టణంలో షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడంతో పాటు కొండమల్లేపల్లి పట్టణం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం ఎంతో శుభసూచకమన్నారు వివాహాది శుభకార్యాలతో పాటు అన్ని రకాల శుభ కార్యాలకు మాంగళ్య బాంక్వెట్ ఫంక్షన్ హాల్ సెంట్రలైజ్డ్ ఏసీ సౌకర్యంతో ఉద్యోగులకు, వ్యాపారులకు అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని వినియోగదారులు మాంగళ్య బాంక్వెట్ ఫంక్షన్ హాల్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మాంగళ్య బాంక్వెట్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ముఖ్య అతిథులుగా పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ లను విష్ణు షాపింగ్ మాల్ మేనేజింగ్ పార్టనర్స్ శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్టనర్స్ చీదెళ్ల వెంకటేశ్వర్లు, పానుగంటి మల్లయ్య, ఇస్లావత్ దేశిరాం, సముద్రాల జ్ఞానేశ్వర్, వనపర్తి మురళి, దొడ్డి వెంకటేశ్వర్లు, దొడ్డి అశోక్, దొడ్డి సుధాకర్,శీలా మధు, శీలా వెంకటేష్, చీదెళ్ళ మనోజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, కేసాని లింగారెడ్డి టీవీఎన్ రెడ్డి,శిరాందాసు కృష్ణయ్య, మంచికంటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్,రామావత్ దస్రు నాయక్,ముడిగ శేఖర్ యాదవ్,నీల పాండరయ్య ఇమ్మడి భద్రయ్య, శీలా జగతయ్య, శీల వెంకయ్య ముత్యాల సర్వయ్య, గుద్దేటి జంగయ్య, ఆలంపల్లి దనయ్య, కర్నాటి శ్రీనివాస్, శ్రీనివాస్ చారి,రావుల వెంకటయ్య, రామావత్ తులసి రామ్, తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే ఎంపీ ఎన్నికల్లో చైతన్యవంతంగా ఓటు వేయాలి


### జూలకంటి రంగారెడ్డి

**హుజూర్ నగర్, ఏప్రిల్ 21 (జనంసాక్షి):** వచ్చే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతంగా ఆలోచించి ఓటు వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లా డుతూ అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని, సంతలో సరుకులాగా ఓట్లు సీట్లు కొనుగోలు చేస్తున్నారని వీటన్నిటిని ప్రజలు గమనించి ఎవరు మంచి నాయకులూ, ప్రజల కోసం పనిచేసే వారు సమాజ అభివృద్ధి కొరకు పాటుపడే లౌకిక వాదులను ఎన్నుకోవాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే వారు అత్యధికులు కోటాని కోటీశ్వరులని ఎన్నికల్లో గెలిచి అధికారం వచ్చిన తర్వాత కోట్లు దండుకోవటానికి కార్పోరేటర్లు పయనమయ్యారన్నారు. వీటన్నిటిని చట్టాలు ఆపలేకపోతున్నాయని ప్రజలే వీరికి ఓటు రూపంలో గుణపాఠం చెప్పాలన్నారు. మతం పేరుతో ప్రజలను మభ్యపెట్టి దేవుళ్ళ సెంటిమెంటును ఉపయోగించుకొని ప్రజలను నమ్మగొలుపుతూ మోసం చేస్తున్నారని అధికారంలోకి వచ్చి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. ఈ అవకాశవాద మత తత్వ రాజకీయ నాయకులను వెనక్కి కొట్టాలని అన్నారు. వాముపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులని ఎంపీ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, హుజూర్నగర్, మేళ్లచెరువు మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, వట్టెపు సైదులు, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం వెంకట నారాయణ, పురుషోత్తం, మహిళా సంఘం నాయకురాలు దుగ్గి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ఎంఎస్-ఎన్ ఈ మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలి..

### జి.యం జాన్ ఆనంద్ వెల్లడి..

**ఇల్లందు, టేకులపల్లి ఏప్రిల్ 21 (జనంసాక్షి) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏరియా సింగరేణిలో సిపిఆర్ఎంఎస్ -ఎన్ఈ మెడికల్ కార్డు కలిగి ఉన్న మాజీ ఉద్యోగులు మెడికల్ కార్డు ఉన్న మజీ ఉద్యోగుల భార్యలు మెడికల్ కార్డు రెన్యువల్ కొరకు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో లైవ్ సర్టిఫికేట్ సమర్పించడం జరుగు తుంది. కానీ దాదాపు 282 మంది మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు గత నవంబర్ నెల నుండి ఇప్పటివరకు వారి మెడికల్ కార్డు రెన్యువల్ కొరకు లైవ్ సర్టిఫికెట్ సమర్పించలేదు. దీనివలన వారి మెడికల్ కార్డు సేవలు నిలిపివేయబడ్డాయి. మెడికల్ కార్డు రెన్యువల్ కొరకు లైవ్ సర్టిఫికెట్ సమర్పించని మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు ఆన్లైన్ ద్వారా లైవ్ సర్టిఫికెట్ సమర్పించి వారి మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకుని అత్యవసర వైద్య సేవలు పొందవలసిందిగా ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పినపాక మండలంలో గాలివాన బీభత్సం

**పినపాక, ఏప్రిల్ 21 (జనంసాక్షి):** పినపాక మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలితో వాన ఒక్కసారిగా తోడవడంతో ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా పలుచోట్ల చెట్లు పడిపోయాయి.



విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరిగాయి. పినపాక మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్లు విరిగిపడడంతో నాలుగు స్తంభాలు విరిగిపోయాయి. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో ప్రధాన రహదారిపై డ్రైనేజీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహించింది. మండలంలో పలుచోట్ల ఇల్లులు నేలకొరిగాయి పొట్లపల్లి పంచాయతీ ఉలవచిలక గ్రామంలో పూనెం బాలకృష్ణ కు చెందిన గేదె మృతి చెందినది. ఇంకా ఎంత నష్టం జరిగింది అన్నది పూర్తిస్తాయిలో తెలియవలసి ఉన్నది.

## సంత్ నిరంకారీ సేవలు అభినందనీయం

### సంత్ నిరంకారీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం - ప్రారంభించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి





**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** సమాజంలో సంత్ నిరంకారీ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమనీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.సంత్ నిరంకారీ ఆధ్వర్యంలో మానవ ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంత్ నిరంకారీ ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలను ముమ్ముందు కూడా కొనసాగించాలని, అందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.సంత్ నిరంకారీ ముఖి కడారు సరళ దేవి మాట్లాడుతూ బాబా బలిదానం సందర్భంగా మానవ ఐక్యత దినోత్సవంలో భాగంగా సంత్ నిరంకారీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మానవులు ప్రతి ఒక్కరూ ప్రేమ ప్రీతితో సన్మార్గంలో నడిచి సద్భావంతో మెలగాలన్నదే సంత్ నిరంకారీ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో సంత్ నిరంకారీ సభ్యులు కడారు సరళా నరసింహారెడ్డి, విద్యాసాగర్, రమాదేవి, శోభ, నిర్మల, అంజలి, రాజేష్,హరీష్ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీచైతన్య సీబీఎస్ పాఠశాలలో కరాటే బెల్టుల ప్రదానోత్సవం..

**గోదావరిఖని, ఏప్రిల్ 21, (జనంసాక్షి) :** రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య సీబీఎస్ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ రవికాంత్ పాల్గొని విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు.అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు కరాటేతో ఆత్మరక్షణ కొరకు ఎంతగానో ఉపకరిస్తుందని, శారీరక వ్యాయామం ద్వారా దేహదారుఢ్యం పెంపొందించుకోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ సంపత్, వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, డీన్ రమేష్, పిఈటి సత్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బరితెగిస్తున్న లోన్‌యాప్‌లు..

- ప్రాణాలు తీస్తున్న ఆన్‌లైన్ లోన్ యాప్‌లు..
- ఆర్‌బీఐకి విరుద్ధంగా నడుస్తున్న లోన్ అప్స్ నిషేధించాలి..
- ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్..

**గోదావరిఖని, ఏప్రిల్ 21, (జనంసాక్షి) :** క్షణాల్లో రుణాలిస్తామంటూ అప్పుల ఊబిలోకి దింపి..రుణగ్రహీతల మానవప్రాణాలతో చెలగాటమాడుతూ..అమాయకులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న ఆన్‌లైన్ రుణ యాప్‌లపై తక్షణమే నిషేధం విధించి, వాటి నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.మద్దెల దినేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో యువత జల్సాలకు అలవాటు పడి కొందరు, మరి కొందరు కుటుంబ అవసరాల నిమిత్తం మరి కొందరు ఇలా వివిధ రకాలుగా వివిధ ఆన్లైన్ యాప్ లలో రుణాలు తీసుకొని తిరిగి చెల్లించలేక కొంతమంది, చెల్లించి కొంతమంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అవసరాల నిమిత్తం కొందరు అనేక రకాల ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వారికి వచ్చే ఆదాయం కంటే ఎక్కువగా రుణాలు తీసుకోవడం జరుగుతుంది..తీసుకున్న అప్పును తీర్చలేక వారు పెట్టే టార్చర్ భరించలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు చూస్తున్నామన్నారు.అన్‌లైన్‌లో నుంచి రుణాలు అందించే వారికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఖచ్చితంగా వర్తిస్తాయని, ఇటీవల కాలంలోని దేశంలో వివిధ రాష్ట్రాలలో యాప్ల ద్వారా అనేక మందికి నగదు రుణాలు తీసుకొని వాటిని తిరిగి చెల్లించే క్రమంలో సంబంధిత యాప్ల యాజమాన్యాలు వారు చేసే వేధింపులు భరించలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు చాలా జరుగుతున్నాయన్నారు. ఇందులో అత్యాఅధిక శాతం యువతే, ఇంకా మధ్య తరగతి ప్రజలు ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.అయితే ఆర్బిఐ చట్టం ప్రకారం 1934 లోని సెక్షన్ 45-1 ప్రకారం ఎన్బీఎఫ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, తగిన రిజిస్ట్రేషన్ అనంతరమే నిబంధన మేరకు పనిచేయడానికి అనుమతి ఉంటుందని, రిజిస్టర్ కానీ ఏ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు చట్టబద్ధత ఉండదని అలాంటి వాటి మీద పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టవచ్చన్నారు. ప్రస్తుతం చాలామంది ఈ ఆన్‌లైన్ యాప్‌లు అధిక శాతం ఆర్బిఐలో నమోదు కానివి ఉన్నాయని, వారికి రుణాలు అందించే అధికారం లేనప్పటికీని విషయం తెలవక చాలామంది బాధితులు అలాంటి యాప్స్‌లో లోన్లు తీసుకొని మోసపోతున్నారన్నారు.ఈ యాప్‌లో అధికంగా చైనీస్ యాప్లే ఉన్నాయి. వాటిని రిజిస్టర్ అయిన చిరునామా గాని సరైన మొబైల్ నెంబరు గాని ఇవ్వరు, వివరాలు ఉండవు, ఫోన్ ద్వారానే సమాచారాన్ని డేటాను మ్యాప్ నిర్వాహకులు తెలుసుకుంటారు.ఈ యాప్ల యూజర్లు ఇచ్చిన పూర్వకంగా లేని రూపంలో తమ కాంటాక్ట్ నంబర్లు, ఫోటోలు, వీడియోలు, సోషల్ మీడియాలో, సమాచారం ఇతర వ్యక్తిగత సున్నిత అంశాలను తమకు తెలియకుండానే అందిస్తారు.యాప్‌ల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించని బాధితులను వేధించేందుకు ఈ సమాచారాన్ని రుణాలు అందించే యాప్ల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తారు అన్నారు.యాప్ రుణాల మోసపూరితంగా ఈ నేపథ్యంలో రుణాలు స్వీకరించే సమయంలో ఏ విధమైన షరతులు అంగీకరించకుండా ఉండడం మంచిది.ముఖ్యంగా మీ వ్యక్తిగత వివరాలు..బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో అందజేయకూడదు, ఇంటర్నెట్లో లభించే పలు రుణాలు అందించే యాప్ల మోసపూరితమైనవి, ఆర్బిఐ గుర్తింపు లేని యాప్ల ద్వారా రుణ ఆధారిత దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోకూడదు.ఈ యాప్ ద్వారా అందించే రుణాలు వడ్డీ రేట్లు రోజుకు ఒక శాతం వరకు ఉంటాయి.ఇది సాధారణంగా బ్యాంకులకు లేదా ఎన్ఎఫ్‌బిసి రిజిస్టర్ అయిన సంస్థలను ఇచ్చే రుణం వడ్డీల కన్నా అదికంగా ఉంటాయి.రుణ బాధితులు సకాలంలో చెల్లించని పరిస్థితిలో ఈ వడ్డీ మొత్తం రెట్టింపు లేదా మూడు అంతలై రుణ వలయంలో చెప్పుకుంటారు.



దీంతో రుణాలు చెల్లించని రుణ గ్రహతలు తిరిగి చెల్లించమని బెదిరించడం, మీ వ్యక్తిగత ఫోటోలు మీ కాంటాక్ట్‌లో ఉన్నవాళ్ళకి పంపిస్తామని బ్లాక్మెయిల్ చేయడంలో పాటు ఆన్‌లైన్ వేధింపులు ఈ యాప్ ద్వారా నిర్వాహకుడు పాల్పడుతూ ఉంటారు. రుణాలను చెల్లించనట్లయితే క్రిమినల్ కేసులు బుక్ చేయడం జరుగుతుందని, రుణమాన్నించే యాప్ల బెదిరించే అవకాశం ఉంటుంది, ఇలాంటి పరిస్థితులు ఎదురైతే సంబంధిత బాధితులు వెంటనే సైబర్ క్రైమ్, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవలసిన అవసరం ఉంటుంది. ఇంకా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఇలాంటి లోన్ యాప్ పట్ల అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపైన, సైబర్ క్రైమ్ పోలీసుల పైన ఉందని అన్నారు.

లోన్ రికవరీ ఏజెంట్ మిమ్మల్ని వేధిస్తున్నట్లయితే, పరిస్థితిని నిర్వహించడానికి అనేక నిబంధనలు ఉన్నాయి.ఇండియన్ పీనల్ కోడ్, 1860, సెక్షన్ 506 (నేరమైన బెదిరింపులకు సంబంధించి), డిఫాల్టర్ రికవరీ ఏజెంట్,రికవరీ ఆఫీస్‌కి వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి అనుమతిస్తుందన్నారు.ఆన్‌లైన్ లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకుని ఇబ్బంది పడి ఇప్పటికే తెలంగాణలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడం బాధాకరం, ఇప్పటికే గోదావరిఖనిలోనే ముగ్గురు నలుగురు వీటి బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని, ఇలాంటి వాటి జోలికి పోకుండా ఉండాలని దినేష్ ప్రజలకు, యువతకు సూచించారు.

## ఢిల్లీకి వరంలా రక్షకుడు ఫ్రేజర్



ఒకరి దురదృష్టం మరొకరికి అదృష్టంలా అంటుకుపోతుంది అనే సామెత వినే ఉంటాం. ఈ మాట ఐపీఎల్ నయా స్టార్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు అతికినట్టు సరిపోతుంది. టీ20ల్లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న ఫ్రేజర్ పదిహేడో సీజన్‌లో వేగవంతమైన అర్ధ శతకంతో చరిత్ర సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ భవిష్యత్ స్టార్‌గా ప్రశంసలు అందుకుంటున్న ఈ చిచ్చర పిడుగు అనుకోకుండా ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. పదిహేడో సీజన్ ఆరంభానికి ముందు స్టార్ పేసర్ లుంగి ఎంగిడి గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, అతడి స్థానంలో ఢిల్లీ 22 ఏండ్ల ఫ్రేజర్‌ను రూ. 50 లక్షలకు తీసుకుంది. అంతే.. ఢిల్లీకి ఓ రక్షకుడు వరంలా దొరికినట్టైంది. ఆడిన మూడు మ్యాచుల్లోనే ఫ్రేజర్ 222.2 స్ట్రయిక్ రేటుతో140 రన్స్ కొట్టి పాంటింగ్, గంగూలీ నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా జెర్సీ వేసుకున్న ఫ్రేజర్.. తొలి మ్యాచ్‌లోనే తన ప్రతాపం చూపించాడు. వెస్టిండీస్‌పై దుమ్మురేపి ఔరా అనిపించాడు. పొట్టి ఫార్మాట్‌కు పక్కాగా సరిపోయే ఫ్రేజర్ ఢిల్లీ మేనేజ్‌మెంట్ దృష్టిలో పడ్డాడు. ఇంకేముంది గాయపడిని ఎంగిడి స్థానంలో ఈ ఆసీస్ స్టార్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకుంది. తొలి మ్యాచ్‌లో నిరాశపరిచన ఫ్రేజర్.. రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై శివాలెత్తి పోయాడు. ఆర్ధ శతకంతో అజేయంగా నిలిచి ఢిల్లీని గెలిపించాడు.

### 15 బంతుల్లోనే ఫిఫ్టీ

ఒక్క మ్యాచ్‌తోనే తన పరుగుల దాహం తీరలేదని నిరూపిస్తూ గుజరాత్‌పై, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఉప్పెనలా విరుచుకుపడ్డాడు. హైదరాబాద్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ ఓవర్లో వరుసగా 4,4,6,4,6,6 బాది 15 బంతుల్లోనే ఫిఫ్టీతో రికార్డు సృష్టించాడు. దాంతో, 16 బంతుల్లో యాభై కొట్టిన హైదరాబాద్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు రెండో స్థానానికి పడిపోయారు. అంతేనా.. అభిషేక్ పొరెల్‌తో కలిసి 84 రన్స్ జోడించి ఢిల్లీని పోటీలోకి తెచ్చాడు. భారీ ఛేదనలో పంత్ సేన ఓడిపోయినా.. ఢిల్లీకి ఫ్రేజర్ రూపంలో ఓ రక్షకుడు దొరికాడు. ఈ యువకెరటం తర్వాతి ఢిల్లీని ఒంటిచేత్తో గెలిపించినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. తదుపరి మ్యాచ్‌లో భాగంగా ఏప్రిల్ 24న గుజరాత్ టైటాన్స్‌తో ఢిల్లీ తలపడనుంది.

## ఆర్సీబీకి అచ్చిరాని కొత్త జెర్సీ





### ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో ఓటమి

- నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగులు చేసిన కోల్ కతా
- రాణించిన ఫిల్ సాల్ట్, శ్రేయాస్ అయ్యర్
- ఆఖర్లో మెరుపుదాడి చేసిన రమణ్ దీప్ సింగ్

*రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు గ్రీన్ జెర్సీ మరోసారి అచ్చిరాలేదు. ఈడెన్ గార్డెన్ వేదికగా కోల్‌కతాతో జరిగిన ఉత్కంఠ పోరులో ఆర్సీబీ ఒక్క పరుగు తేడాతో ఓటమిని చవిచూసింది. చివరి రెండు బంతులకు మూడు పరుగులు చేస్తే విజయం సొంతమయ్యేది. కానీ 19.5 బంతికి కరన్ సింగ్ ఔటవ్వగా.. చివరి బంతికి రెండు పరుగులు తీసేందుకు ప్రయత్నించి ఫెర్గూసన్ కూడా ఔటయ్యాడు. ఫలితంగా ఒక్క పరుగు తేడాతో బెంగళూరుపై కోల్‌కతా విజయం సాధించింది. దీంతో జాక్స్, రజత్ పాటిదార్ చెరో హాఫ్ సెంచరీతో చెలరేగినప్పటికీ లాభం లేకుండా పోయింది.*

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన కోల్‌కతా బ్యాటర్లు అదిరే ఆరంభం ఇచ్చారు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ చెలరేగి ఆడాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లతో బీభత్సం సృష్టించాడు. కేవలం 14 బంతుల్లోనే 48 పరుగులు చేశాడు. ఈ క్రమంలో 4.2 ఓవర్ వద్ద సిరాజ్ వేసిన బంతికి భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. దీంతో వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించే అవకాశాన్ని తృటిలో మిస్ చేసుకున్నాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్ 10 పరుగులకే ఔటయ్యాడు.

సాల్ట్, నరైన్ తర్వాత క్రీజులోకి వచ్చిన రఘువంశీ(3), వెంకటేశ్ అయ్యర్ (16) ప్రభావం చూపించలేకపోయారు. కానీ శ్రేయాస్ అయ్యర్, రింకూ సింగ్ దూకుడుగా ఆడుతూ జట్టుకు కీలక స్కోర్ అందించారు. కానీ 13.1 ఓవర్‌లో రింకూ సింగ్ (24) కూడా ఔటయ్యాడు అయినప్పటికీ శ్రేయాస్ అయ్యర్ నిలకడగా హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే పెవిలియన్‌కు చేరాడు. చివరలో ఆండ్రీ రస్సెల్ (27), రమణ్‌దీప్ సింగ్ (24) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి కోల్‌కతా నైట్‌రైడర్స్ 222 పరుగులను సాధించింది. బెంగళూరుకు 223 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది.

భారీ టార్గెట్‌తో చేధనకు దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే తడబాటుకు గురైంది. పవర్ ప్లే పూర్తయ్యే లోపే విరాట్ కోహ్లీ (18), డుప్లెసిస్ (7) పెవలియన్‌కు చేరారు. మూడో ఓవర్‌లో మొదటి బంతికే విరాట్ కోహ్లీ (18) ఔటయ్యాడు. హర్షిత్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చాడు. దీనిపై కోహ్లీ రివ్యూ తీసుకున్నప్పటికీ ఔట్‌గానే తేలింది. దీంతో అసహనంగా కోహ్లీ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. నాలుగో ఓవర్‌లో తొలి బంతికే డుప్లెసిస్ కూడా ఔటయ్యాడు.

కోహ్లీ, డుప్లెసిస్ ఔటయిన తర్వాత క్రీజులోకి వచ్చిన జాక్స్ (55), రజత్ (52) దూకుడుగా ఆడారు. ఇద్దరూ చెరో హాఫ్ సెంచరీతో చెలరేగి జట్టుకు భారీ స్కోర్ అందించారు. అయితే 12వ ఓవర్ నుంచి ఆర్సీబీకి కష్టాలు మొదలయ్యాయి. కోల్‌కతా బ్యాటర్ల ధాటికి రెండు ఓవర్లలోనే ఆర్సీబీ 4 వికెట్లను సమర్పించుకుంది. 12వ ఓవర్‌లో తొలి బంతిలో జాక్స్ (55) ఔటవ్వగా.. నాలుగో బంతికి రజత్ (52) హర్షత్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. 13వ ఓవర్‌లో మూడో బంతికి గ్రీన్ (6).. చివరి బంతికి లామ్రార్ (4) ఔటయ్యారు. మ్యాచ్ చేజారిపోతుందేమోనని అనుకున్న తరుణంలో క్రీజులోకి వచ్చిన ప్రభుదేశాయ్ (24), దినేశ్ కార్తిక్ (25) ఉత్సాహం నింపారు. కానీ అది ఎక్కువసేపు కొనసాగలేదు. 18వ ఓవర్‌లో రెండో బంతికి ప్రభుదేశాయ్ ఔటవ్వడంతో బెంగళూరు మళ్లీ సందిగ్ధంలో పడింది. అయినప్పటికీ దినేశ్ కార్తిక్ ఒంటరి పోరుతో విజయతీరాలకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కానీ 19 ఓవర్‌లో దినేశ్ కార్తిక్ ఔటవ్వడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. చివరలో రెండు బంతుల్లో మూడు పరుగులు చేస్తే విజయం దక్కే పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటి సమయంలో కరన్ శర్మ (20) ఔటయ్యాడు. చివరి బంతికి ఫెర్గూసన్ రెండు పరుగులు తీసేందుకు ప్రయత్నించి ఔటయ్యాడు. ఫలితంగా ఒక్క పరుగు తేడాతో బెంగళూరు ఓటమి పాలయ్యింది.



## ప్రపంచకప్‌లో స్పాన్సర్‌గా నందిని మిల్క్!




క్రికెట్ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న టీ20 ప్రపంచకప్ 2024 జూన్ 1 నుంచి ప్రారంభం కానుంది.

ఈ సీజన్‌లో రెండు జట్లకు డెయిరీ ఉత్పత్తుల సంస్థ నందిని స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. కర్ణాటక పాల సమాఖ్య ఆధ్వర్యంలోని ఈ నందిని సంస్థ టీ20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్, ఐర్లాండ్ జట్లకు స్పాన్సర్‌షిప్ అందిచనుంది. శాసనసభ ఎన్నికల వేళ వార్తల్లో నిలిచిన ఈ బ్రాండ్ అంతర్జాతీయ క్రికెట్ జట్లకు స్పాన్సర్ చేయడం ఇదే తొలిసారి. "ప్రపంచకప్‌లో స్కాట్లాండ్, ఐర్లాండ్ జట్లకు స్పాన్సర్ చేయనున్నాం. 'నందిని స్ప్లాష్' పేరుతో అమెరికాలో ఎనర్జీ డ్రింక్‌లను తీసుకురావాలని చూస్తున్నాం. ఈ సమయంలో ప్రపంచకప్ స్పాన్సర్‌షిప్‌తో ప్రపంచవ్యాప్తంగా మా ఉత్పత్తులకు ఆదరణ లభిస్తుంది. గ్లోబల్ బ్రాండ్‌గా మారేందుకు మాకు ఇదో అవకాశం" అని కేఎంఎఫ్ ఎండీ ఎం.కే. జగదీష్ అన్నారు. టీ20 ప్రపంచకప్ 2024 సిరీస్ జూన్ 1 నుంచి జూన్ 29వరకు జరగనుంది. యూఎస్ఏ, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తోన్న ఈ పొట్టికప్పు సిరీస్‌లో అత్యధికంగా 20 జట్లు తలపడుతున్నాయి. మొత్తం 9 వేదికల్లో 55 మ్యాచ్‌లు జరగనున్నాయి.



## ఒలింపిక్స్‌లో తొండి..

### డ్రగ్స్‌తో పతకాలు గెలిచిన చైనా స్విమ్మర్లు

సరిహద్దు దేశాలతో కయ్యానికి కాలు దువ్వే చైనా మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఈసారి ఏకంగా డోప్ టెస్టులో పట్టుబడిన అథ్లెట్లతో ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొట్టింది. ఒకరిద్దరు కాదు ఏకంగా 23 మంది స్విమ్మర్లు చైనాకు మెడల్స్ అందించారు. ఇంత దారుణానికి పాల్పడిన చైనా దుర్బుద్ధి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

టోక్యో వేదికగా జరిగిన 2020 ఒలింపిక్స్‌లో చైనా స్విమ్వర్లు నిషేధిత డ్రగ్ తీసుకొని దొరికిపోయారు. అయితే.. కలుషిత పదార్ధం కారణంగా డోప్ టెస్టులో పాజిటివ్ వచ్చిందని చైనా అధికారులు నమ్మబలికారు. ఇదే విషయాన్ని వాళ్లు తమకు చెప్పినట్టు అంతర్జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థ వాడా తాజాగా వెల్లడించింది. జపాన్ 2020లో ఆతిథ్యమిచ్చిన విశ్వక్రీడల్లో చైనా అథ్లెట్లు డ్రగ్స్ తీసుకున్నారనే వార్తలు అప్పట్లో వైరల్ అయ్యాయి. చైనా స్విమ్మర్లు 23 మంది నిషేధిత ట్రైమెటజిడినె అనే డ్రగ్ ఉపయోగించారని మీడియా కోడై కూసింది. కరోనా మహమ్మారి విజృంభించిన ఆ సమయంలో గుండె ఆరోగ్యం కోసం టీఎంజడ్ డ్రగ్‌ను వాడేవాళ్లు. అయితే.. వాళ్లను చైనా బృందం వాడా కళ్లుగప్పి మరీ విశ్వక్రీడలకు పంపింది. ఆ ఏడాది 30 మంది స్విమ్మర్లతో కూడిన చైనా బృందం ఏకంగా ఆరు మెడల్స్ సాధించింది. అందులో మూడు బంగారు పతకాలు కూడా ఉన్నాయి.

## నేను ఇంతే... ఇచ్చింది తీసుకోవాలి

### ఎదిరిస్తే కూలీ డబ్బులు బంద్

- డిక్టేటర్ లా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నవకాంత్ రెడ్డి
- అడవి సత్యారంలో అంతులేని అవినీతి
- పని చేయకున్నా సొంత వారికి పూర్తి కూలీ డబ్బులు
- పనిచేసిన వారికి రోజుకు వంద ఫిక్స్
- మరుగు దొడ్ల నిర్మాణం అవినీతి మయం






**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అడవి సత్యారం ఫీల్డ్ అసిస్టెంట్ నవ కాంత్ రెడ్డి డిక్టేటర్‌లా వ్యవహరిస్తు ఉపాధి హామీ పథకం పనుల్లో అంతులేని అవినీతికి పాల్పడుతున్నాడు. గత 10 ఏళ్లుగా అప్పటి అధికార పార్టీ,నేటి అధికార పార్టీ అండతో కూలీల కష్టాన్ని కొల్లగొడుతన్నారు. కొన్ని సందర్భాల్లో అసలు పని కల్పించకుండానే పని చేసినట్లు మాస్టర్లు తయారు చేసి అమాంతంగా కూలీల డబ్బులు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనులు కొందరికి మాత్రమే కల్పిస్తూ అందరి హాజరు లు వేసుకుని డబ్బులు దండుకుంటున్నారు. పని చేసిన వారికి మాత్రం రోజు కూలీల ప్రభుత్వ ప్రకారం ఒక్కొక్కరికి 272 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా కూలీలకు మాత్రం రోజుకు వంద రూపాయలు ఫిక్స్ చేసి ఇస్తున్నాడనీ కూలీలు తెలిపారు. అంతే కాకుండా తమ కుటుంబ సభ్యులు,బంధువుల పేరున జాబ్ కార్డులు సృష్టించి వారు పని చేయకున్నా పూర్తి డబ్బులు ఇస్తున్నాడు. అందులోనూ గుంప గుత్తుగా కొంత చెల్లించి మిగతా డబ్బులు దొచేస్తున్నాడ న్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. కాగా తన తమ్ముడి భాస్కర్ రెడ్డి పేరున ఐసిఐసిఐ బ్యాంకు ఏర్పాటు చేసి కూలీల ఏటీఎమ్ కార్డులన్ని తన దగ్గరే ఉంచుకుని ఆయనే డబ్బులు డ్రా చేసి ఫిక్స్ చేసిన విధంగా కూలీలకు రోజుకు వంద చొప్పున చెల్లిస్తున్నాడని గ్రామస్తులు వాపోతున్నా రు. కూలీలకు కనీసం పే స్లిప్పులు ఇవ్వడం లేదని కొందరు వేరే బ్యాంక్ లో డబ్బులు డ్రా చేసుకుంటే అలాంటి వారికి అసలుకే డబ్బులు ఇవ్వకుండా ఎసరు పెడుతున్నారు. వారు చేసిన పనిదినాల బిల్లులు చేయడం లేదని వేధిస్తున్నాడని వాపోతున్నారు. కాగా ఈనెల 1 నుంచి పనులు ప్రారంభం అయినప్పటికీ కూలీలతో చేయించకుండా మస్టర్ లో పని అయినట్టు చూయిస్తూ ఈనెల 11వ తేదీ నుంచి మాత్రమే కొందరితో పనులు చేపడుతున్నారు. అంతే కాకుండా ఎపిఎం, టిఏ, ఈసి ల లాగిన్ సైతం తనవద్దే ఉంచుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.

#### మరుగు దొడ్లు నిర్మించ కుండానే బిల్లులు డ్రా

ఉమ్మడి అడవి సత్యారం(పెగడబండ, ఒబ్లా పూర్) గ్రామంలో 5 వందల మరుగు దొడ్లు మంజూరు అయితే కనీసం2 వందలు నిర్మించ కుండానే బిల్లు డ్రాచేసి లబ్ధిదారులకు ఇవ్వకుండా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. నవకాంత్ రెడ్డి అవినీతిపై గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అప్పటి అధికార పార్టీ అండతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులపై వత్తిడి తెచ్చారనీ అంటున్నారు తిరిగి అధికారం మారడంతో కాంగ్రెస్ లో చేరి మళ్ళీ అదే డిక్టేటర్ గా కొనసాగుతున్నారు. ఇప్పటి కై నా జిల్లా కలెక్టర్ స్పందించి అవినీతిని అరికట్టి కూలీలకు న్యాయం చేయాలని దండుకున్న అవినీతి డబ్బులను కక్కించాలని కోరుతున్నారు.

#### ఏడాదిగా కూలీ డబ్బులు ఇవ్వడం లేదు



**కూలీ నడిపి లింగప్ప**

తాను ఉపాధి పనుల్లో చేసిన పనికి ఫీల్డ్ అసిస్టెంట్ నవకాంత్ రెడ్డి ఏడాది నుంచి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నా డని ఉపాధి కూలీలు నడిపి లింగప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు చెల్లించ కుండా కూలిలో కోత పెట్టి కడుపు కొడుతున్నాడనీ తెలిపారు.

#### మొక్కలకు మెంటేనెన్స్ డబ్బులు ఇవ్వడం లేదు



**కూలీ సూర్యతేజ**

తన పొలంలో ఉపాధి హామీ పథకం కింద టేకు చెట్లు పెట్టానని అందుకు రావాల్సిన మెంటెనెన్స్ చార్జీలు ఇవ్వడం లేదని సూర్యతేజ తెలిపాడు.
అంతే కాకుండా పొలానికి పాటు కాలువ చెట్లు తొలగించి బాగుచేయాలని కోరిన పట్టించు కోక పోతే సొంతంగా తీంచుకున్నానని తెలిపాడు. పని దినాలు పూర్తిగా కల్పించ కుండ చేసిన పనికి ప్రభుత్వ లెక్క ప్రకారం ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్ నవకాంత్ రెడ్డి తన లెక్క ప్రకారం వంద ఫిక్స్ చేసి దండుకుంటున్నడని తెలిపాడు.

## కార్పొరేట్ శక్తుల కోసమే బిజెపి పని చేస్తోంది

### చేవెళ్ల కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ వైపు మత విద్వేషాలు రెచ్చగొడుతూ మరోవైపు కొన్ని కార్పొరేట్ శక్తులను మాత్రమే వెనకేసుకోవడానికి పనిచేస్తుందని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం శేరిలింగంపల్లి నియోజక వర్గం మాదాపూర్ డివిజన్ పార్టీ మై హెూమ్ భుజ లో కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వాలిదాస్ జగదీశ్వర్ గౌడ్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశ ప్రజల కంటే కొన్ని కార్పొరేట్ శక్తుల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. గత పదివేల బిజెపి పాలనలో సామాన్యుడు లబ్ధి పొందిందేమీ లేదని... అదాని లాంటి కార్పోరేట్ శక్తులు లక్షల కోట్ల రూపాయల రుణమాఫీలు, ఇతరత్రా ప్రయోజనాలను అందుకోగలిగాయన్నారు. దేశంలో ఏకైక సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ అని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తో పాటు కేంద్రాల్లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ ప్రయోజనాలు మరింతగా ఇనుమడిస్తాయని వారి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మై హెూమ్ భుజ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తప్పకుండా తమ ఓటు కాంగ్రెస్ పార్టీకి అందుతుందని, శేరిలింగంపల్లి నుండి కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ దక్కేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మై హెూమ్ భుజ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నుండి భారీగా కాంగ్రెస్‌లో చేరిక

### సీఎం సమక్షంలో చేరిక సీనియర్ నాయకులు గొట్టిముక్కల జస్వంత్ రావు (దేశాల్), ఎం. భీమ్ రావు



**కూకట్ పల్లి ఏప్రిల్ 21(జనంసాక్షి):** కూకట్ పల్లి చెందిన పలువురు నాయకులు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఈ నేతలు కొంతకాలంగా స్తబ్దతగా ఉన్నారు. అయితే ఎమ్మెల్సీ మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి భర్త పట్నం మహేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అంగీకరించారు. ఇందులో భాగంగా గొట్టిముక్కల జస్వంత్ రావు (దేశాల్), మొలుగు భీమ్ రావు, తులసి వర్ధన్ రావు, రామాంజన్ రెడ్డి, కొమ్ము బాబు, జాన్ తదితరులకు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని, కూకట్ పల్లి కి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వారిని అభినందించారు. దేశాలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కూకట్పల్లి ఇన్చార్జి అయిన బండి రమేష్, కూకట్పల్లి కోఆర్డినేటర్ వినయ్ రెడ్డి, కూకట్పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా పేరుపేరునా వీరికి ధన్యవాదాలు తెలియజేశారు.



## పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ సేవలో డీకే అరుణ

**కొడంగల్ (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం పోలేపల్లి గ్రామములో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డికె. అరుణమ్మ పర్యటించారు. కొస్గి, దుధ్యాల పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, యువకులతో కలిసి పోలేపల్లిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించేలా ఆశీస్సులు అందజేయాలనీ రేణుక ఎల్లమ్మను వేడుకున్నారు.

## కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



**మల్కాజిగిరి,ఏప్రిల్ 21(జనంసాక్షి) :** హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుల సహకా రంతో మల్కాజిగిరి మహంకాళి అమ్మవారు ఆలయంలో పూజ కార్యక్రమం నిర్వహించుకుని పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్,సివిల్ యాదగిరి, వెంకటేష్ యాదవ్,సనాది శంకర్,కొండ గౌడ్,జీవన్వీ సతీష్, లక్ష్మీపతి, నగేష్ గౌడ్, లక్ష్మీపతి, మొర శ్రీకాంత్, సురేష్ సింగ్, గోపాల్ సింగ్, శ్రీశైలం, సంజయ్, మబ్బు, అమర్, గణేష్, మల్లేష్, శ్రీశైలం, కిషోర్, బ్రహ్మం, అనిత, శారద, నజీయ, లక్ష్మి, మాల్యాద్రి, నాగరాజు, ఫేజల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం

### మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**బషీరాబాద్, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :** బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామానికి చెందిన పూర్మ నర్సప్ప ఆదివారం రోజున మరణించిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం 5000 రూపాయలు అందించారు. అదేవిధంగా పట్లోళ్ల మహేందర్ రెడ్డి,(శంకు పటేల్) 3000 రూపాయలు మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, భీమప్ప,అంజీలప్ప, నర్సిములు,ఈరప్ప,రాజు,మాదు,రామప్ప,శివ,గ్రామస్తులు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమరం

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
22 ఏప్రిల్ 2024


### పుడమి సంరక్షణ చర్యలను

# ఉద్యమంలా చేపట్టాలి

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 21 (జనం సాక్షి) :** మనుషులు ఇప్పటికైనా తేరుకొని ప్రపంచ ధరిత్రి దినోత్సవ స్ఫూర్తితో పుడమి సంరక్షణ చర్యలను ఒక ఉద్యమంగా చేపట్టగలిగితేనే భవిష్యత్ లో భూమి నివాసయోగ్య గ్రహంగా మనగలుగుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ సందేశమిచ్చారు. ఆ సందేశం సారాంశం ఆమె మాటల్లోనే..

'మనుషుల మితిమీరిన అవసరాలతో, అత్యాశతో, అనాలోచిత చర్యలతో నేలతల్లి జీవాన్ని కోల్పోతున్నది. నీటి వనరులు కలుషితమవుతున్నాయి. పీల్చే గాలి విషతుల్యమవుతున్నది. అరుదైన జీవజాతులు నశిస్తున్నాయి. పక్షులు కనుమరుగు అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అకాల వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. సముద్ర నీటిమట్టం ప్రమాదకరంగా పెరుగుతూ మనుషుల ఉనికికి ప్రమాదం వాటిల్లుతున్నది. తాగునీటి లభ్యత తగ్గి జనం అవస్తలు పడుతున్నారు. ప్రకృతి సమతుల్యత, జీవ సమతుల్యత లోపించి పడరాని పాట్లు పడుతున్నాం. ఇవన్నీ ఒక వైపైతే మరోవైపు ప్లాస్టిక్ ఈ నేలతల్లికి ఎంతటి హానిచేస్తున్నదనే విషయం ప్రజలందరికీ ఎరుకలో ఉన్నదే. ప్లాస్టిక్ కలిగించే అనర్థాలతో ఈ పుడమి ఉనికి ప్రమాదంలో పడింది. ప్లాస్టిక్ కలిగిస్తున్న దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్య సమితి ఈ యేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ (ప్లాస్టిక్ మీద భూగ్రహ సమరం)' పిలుపునిచ్చింది. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించడంతోపాటు, 2040 నాటికి ప్లాస్టిక్ ఉత్పత్తిని 60 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవాలి. ఐక్యరాజ్యసమితి సూచనలను ప్రతి ఒక్కరు తప్పక ఆచరించాలి. మనిషులు ఈ భూగ్రహం కేవలం తమ అవసరాలకు మాత్రమే అనే అత్యాశకరమైన స్థితి నుండి బయటకు రావాలి. సకల జీవరాసులకు ఈ భూమిపై సమాన హక్కులున్నాయి. ప్రకృతికి ఏ హానీ తలపెట్టకుండా ఉంటే చాలు, దానికి మనం ప్రత్యేకంగా మేలు చేయాల్సిన అవసరంలేదనే నిజాన్ని మనుషులు తెలుసుకోవాలి. ఈ సృష్టిలో భూమి మాత్రమే మనుషులకు నివాసయోగ్యమైనందున, భవిష్యత్ తరాల కోసం ఈ నేలతల్లిని సంరక్షించుకోవల్సిన బాధ్యత మనందరిది. ఈ దిశగా పుడమికి మేలు చేసే దిశగా మన జీవనశైలిని, అలవాట్లను మార్చుకోల్సిన అవసరం ఉన్నది. పుడమిని కాపాడుకుంటేనే, మనల్ని మనం కాపాడుకోగలమని, అప్పుడే మనకు మనుగడ ఉంటుందనే సత్యాన్ని గ్రహించాలి. ప్రకృతి ప్రళయ రూపం ధరించకముందే మనమంతా తేరుకోవాలి. ప్రజలంతా నేలతల్లి సంరక్షణకు ఉద్యుక్తులు కావాలి' అని పేర్కొన్నారు.

# ఆసక్తి రేపుతున్న కోడెర్మ సెగ్మెంట్

జెన్నీ

### బిజెపి మంత్రి వర్సెస్ సిపిఐ (ఎంఎల్) ఎమ్మెల్యే




**కోడెర్మా లోక్‌సభ స్థానం జార్ఖండ్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీలో ఒకటి, ఎందుకంటే ఇక్కడ ఎన్‌డీఏలోని బీజేపీ మంత్రి అన్నపూర్ణ దేవికి ఇండియా కూటమి అభ్యర్థి, సీపీఐ (యంయల్) లిబరేషన్ పోలిట్ బ్యూరో సభ్యుడు, అత్యుత్తమ ఎమ్మెల్యే అవార్డుతో గౌరవించబడిన శాసనసభ్యుడు వినోద్ సింగ్ కి మధ్య నెలకొంది. కోడెర్మా పార్లమెంటరీ నియోజకవర్గంలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. బాగోదర్, గాండే, జమువా, ధన్వర్ మరియు కోడెర్మా. కోడెర్మ మినహా మిగిలిన నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలు గిరిడి జిల్లా పరిధిలోకి వస్తాయి. 1977లో కోడెర్మా లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా, బీజేపీ అత్యధికంగా ఆరుసార్లు ఈ స్థానాన్ని గెలుచుకుంది. జనతా పార్టీ అభ్యర్థిగా రిట్లాల్ ప్రసాద్ వర్మ, స్వతంత్ర అభ్యర్థిగా బాబులాల్ మరాండీ, ఒకసారి జేవీఎం నుండి ఒకసారి విజయం సాధించారు. కోడెర్మలో బీజేపీ, దాని అనుబంధ వ్యక్తులు తొమ్మిది సార్లు గెలిచి ఆ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు.**

సీపీఐ (యంయల్) లిబరేషన్ నేత, ప్రజా నాయకుడు మహేంద్ర సింగ్ జనవరి 16, 2005 న హత్యకు గురయ్యాడు, మహేంద్ర సింగ్ బాగోదర్ నుండి మూడుసార్లు శాసనసభ్యుడిగా గెలుపొందారు. వారి కుమారుడైన వినోద్ సింగ్‌తో 2005, 2009, 2019 మూడు సార్లు ఎన్నికయ్యాడు. బాగోదర్‌లో ఇప్పటివరకు జరిగిన పనులపైనా చర్చ జరగనుండడంతో పాటు కోడెర్మ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ చేసిన అభివృద్ధిపై చర్చ జరగుతుంది. మంత్రి పదవి పొందిన అన్నపూర్ణాదేవి పని గురించి కూడా వినోద్ సింగ్ చేసిన పని గురించి చర్చ జరుగుతుంది. అన్నపూర్ణా దేవి ఇంతకుముందు రాష్ట్రీయ జనతాదళ్ లో ఉన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ నుండి ఎమ్మెల్యే అయ్యారు, కానీ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె ఆర్జేడీని వదిలి బీజేపీలో చేరారు.

48 ఏళ్ల వినోద్ సింగ్ బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ)లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి మహేంద్ర సింగ్ హత్య తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2022 లో ప్రతిష్టాత్మకమైన బిర్సా ముండా అత్యుత్తమ ఎమ్మెల్యే అవార్డుతో సత్కరించబడ్డాడు. ఈ సంవత్సరం ఈడీ అరెస్టు కారణంగా హేమంత్ సోరెన్ రాజీనామా చేయవలసి వచ్చినప్పుడు, ఆ తర్వాత, సీపీఐ (యంయల్) శాసనసభ్యుడు చంపై సోరెన్ ప్రభుత్వ ఏర్పాటులో ముఖ్యమైన పాత్ర పోషించారు. కూటమి నాయకులతో కలిసి అనేకసార్లు గవర్నర్‌ను కలిశారు.

'దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళల సమస్యలపై సీపీఐ(యంయల్) వీధుల నుంచి అసెంబ్లీ లోపలి వరకు తమ గళాన్ని వినిపించింది. కొడెర్మాలో విజయం పార్లమెంటులో ఈ స్వరాన్ని మరింత బలపరుస్తుంది' అని వినోద్ సింగ్ అన్నారు. 'ఈసారి కోడెర్మలో పోరాటం బీజేపీ అభ్యర్థి, ఇండియా కూటమితో కాదుబీ ఈసారి అది బీజేపీ వర్సెస్ కోడెర్మ ప్రజలతో. బీజేపీ తన 30 సంవత్సరాల కృషికి ప్రజలకు సమాధానం ఇవ్వాలి. కోడెర్మా ఇప్పటికీ దేశంలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా ఉంది. ఆరోగ్య రంగం, విద్యా రంగం అభివృద్ధి చెందలేదు, నేను ప్రజా సమస్యలపై రాజీపడను, కోడెర్మ ప్రజల కోసం పని చేస్తానని నేను చెప్పగలను. పార్లమెంటులో కోడెర్మా ప్రజల కోసం బలమైన గొంతుకనౌతా' అన్నారాయన.

# బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం బెంగళూరుకు..

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)




తలసేమియా పిల్ల లు ఆదివారం రోజున మంచిర్యాల రైల్వే స్టేషన్ నుండి గోరక్పూర్ ట్రైన్‌కు తలసేమియా పిల్లలు వారి తల్లిదండ్రులు బయలుదేరి వెళ్లారు. మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ బెంగళూరు వారి సహకారంతో భగవాన్ మహావీర్ జెన్ హాస్పిటల్‌కు బోన్ మారో మార్పిడి నిమిత్తము ముందస్తు వైద్య పరీక్షల కోసం రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా నుంచి ఆరుగురు పేషెంట్లను వారి తల్లిదండ్రులను పంపించడం జరిగినది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మరియు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల హెచ్.ఎల్.ఏ క్యాంపు నిర్వహించడం జరిగినది ఈ క్యాంపు రిపోర్ట్ లలో 9 మంది తలసేమియా వ్యాధిగాస్తులకు వారి కుటుంబ సభ్యులతో ఫుల్ మ్యాచ్ అయినవని రిపోర్టు రావడం ద్వారా. ఇందులో నుండి ఆరుగురు ఈరోజు బెంగళూరుకి పంపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ రోజుల్లో తలసేమియా సికిల్ సెల్ వ్యాధి వచ్చినదని ఎవరు భయపడ వద్దని ఎవరు ఆందోళన చెందొద్దని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా దాతల సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బోన్ మారో మార్పిడి చేయించడం జరుగుతుందని అన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు తల సేమియా వ్యాధిగ్రస్తులు వారి తల్లిదండ్రులు బోన్ మారో మార్పిడి చేయించుకోవడానికి ముందుకు రావాలని బోన్ మారో మార్పిడి వల్ల తలసేమియా సికిల్ సెల్ వ్యాధులు పూర్తిగా నయమవుతుందని అన్నారు. వ్యాధిగ్రస్తులకు వారి తల్లిదండ్రులకు మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు ధైర్యం చెప్పి వారిని రైల్వే మార్గం ద్వారా సాగరంపారు. వీరికి సహాయకునిగా కాసర్ల రంజిత్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు మరియు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీ పంపించడం జరిగిందని తెలిపారు. వారి బాగోగులు కాసర్ల రంజిత్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, మూలకాల సత్యనారాయణ రెడ్డి, వ్యాధిగ్రస్తులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### సెంట్రల్ యూనివర్సిటీలో

# ఏబీవీపీ మూకదాడులు ఆపాలి

- విచారణ జరిపి దోషులను శిక్షించాలి
- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (జనంసాక్షి) :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వారం రోజులుగా ఏబీవీపీ నాయకత్వంలో మూకదాడులు చేస్తున్నారని, ఏడుగురు విద్యార్థినులతో సహా 20మంది విద్యార్థులు వీరి దాడిలో గాయపడ్డారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇద్దరు విద్యార్థినులతో సహా ఆరుగురు హాస్పిటల్‌లో చేరాల్సి వచ్చిందని, ఎన్నికల వాతావరణంలో సున్నితమైన అంశాలు ముందుకుతెచ్చి, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నంలో ఒక పథకం ప్రకారమే దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు తక్షణం విచారణ జరిపి దోషులను శిక్షించాలని, విద్యార్థులకు భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఈనెల 13న జరిగిన ఫేర్‌వెల్ వేడుకలలో ఏబీవీపీ కార్యకర్తలు వికలాంగుడైన హర్షరాజ్‌పై దాడి చేయడంతో, ఎస్‌ఎఫ్‌ఐ ఇతర సంఘాల నాయకులు సర్దుబాటుకు ప్రయత్నించారని, అనంతరం 17వ తేది ఒక పథకం ప్రకారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్త ఫైజల్‌పై దాడి చేసి విద్యార్థులను గాయపరిచారని, ఈ సందర్భంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో హాస్పిటల్ తరలిస్తుండగా, అంబులెన్స్‌ను కూడా ఈ మూక అడ్డుకున్నదని, అమ్మాయిలను లైంగికంగా వేధించారని, వీడియోలలో ఈ విషయాలు స్పష్టంగా కనబడుతున్నాయని తెలిపారు. సమస్యను లోతుగా విచారణ జరపకుండా పోలీసు అధికారులు దీనిని రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణగా చూస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం యూనివర్సిటీలో ఘటనను వాడుకునేందుకు ఏబీవీపీ పథకం ప్రకారం చిచ్చుపెడుతున్నది. గాయపడినవారినీ, దాడి జరగకుండా నివారించే ప్రయత్నం చేసిన వారిని కూడా కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారు. దాడికి గురైన బాధితులను బైండోవర్ చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. పోలీసు అధికారులు వాస్తవాలు గమనించి, బాధితులను వేధించటం ఆపాలని, దోషులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులపై బైండోవర్ కేసులు ఎత్తివేయాలనీ, వేధింపులు ఆపాలని కోరారు.

# ఖమ్మంలో కబలిస్తున్న విషవాయువు



- వయస్సు తేడా లేకుండా గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పెరుగుతున్న రోగాలు
- భూగర్భ జలాలను కలుషితం చేస్తున్న కోనోకార్పస్..
- ఇప్పటికే మంచినీటి కష్టాల్లో జిల్లా ప్రజానీకం..

**పర్యావరణంలో విషవాయువులు తొలగిపోయి ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పార్కుల్లో, రోడ్లకు ఇరువైపుల ప్రభుత్వం నాటిన మొక్కలు ప్రాణాంతకంగా మారాయి. కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని మనిషికి జీవనాధారమైన ఆక్సీజన్‌ను వదిలే మొక్కలు ఇలా మారడమేమిటని అనుకుంటున్నారా..? అవును మీరు చదువుతున్నది అక్షరాల నిజమే... ప్రాణవాయువును ఇవ్వాల్సిన చెట్లు ప్రాణాంతక గాలులను విసర్జిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న హరిత హారంలో కంబ్రాటేసీ జాతికి చెందిన కోనో కార్పస్ అనే లక్షలాది మొక్కలను నాటింది. పార్క్‌లలో, రోడ్ల మధ్యలో, వాకర్స్ ట్రాక్‌కు ఇరువైపులా ఇలా ఎక్కడ పడితే అక్కడ నీడ కోసం నాటారు. ఇప్పుడు ఆ మొక్కలు యమపాశంగా మారాయి... విష వాయువులు వెదజల్లుతున్న కోనోకార్పస్ పై జనం సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...**

*– ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :*

వృక్షాలు అందరినీ అక్కున చేర్చుకుంటున్నాయి. ఆక్సిజన్ ను అందిస్తూ ఆయుష్షును పెంచుతాయి.. అలాంటిది పక్షులు వాలని, పశువులు తినని ఓ వృక్షం ఉందంటే నమ్ముతారా? అది నిజం. అధికారులే హరితహారం, సుందరీకరణ పేరుతో నగరంలో జన సంచారం మధ్య ఉన్న డివైడర్ల మధ్య వీటిని నాటి పెంచారు. ఈ వృక్షం పేరు కోనో కార్పస్. ' చిన్న పిల్లల నుంచి మహిళలు, పెద్దల వరకు ఉదయాన్నే 4 గంటలకు మంచి గాలిని పీల్చుకుంటు ఆరోగ్యం కోసం ఎటువంటి చెడు రోగాలు రాకుండా జాగింగ్ , వాకింగ్ చేస్తుంటారు. మరికొందరు పిల్లలు అనేక రకాల ఆటలు నేర్చుకోవడానికి ఉదయాన్నే పార్కులకు వస్తుంటారు. అయితే కోనోకార్పస్ మొక్క పుష్పాల నుంచి వెలువడే పుప్పొడి వల్ల అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా సమస్యలు వస్తాయి. పర్యావరణ వ్యవస్థలో ఈ మొక్క తో ఎలాంటి ఉపయోగం లేకపోగా.. అనేక దుష్ప్రభావాలను మాత్రం కలుగజేస్తుంది. కాబట్టి వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కోనో కార్పస్ మొక్కలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో పెరిగే కోనో కార్పస్ మొక్కలను గతంలో అందం కోసం విదేశాల్లో పెంచేవారు. వీటి వల్ల జరిగే నష్టం తెలుసుకుని నిషేధించారు. 80 మీటర్ల లోతు వరకు వీటి వేర్లు వ్యాపించి భూగర్భ జలాలను పీల్చిపడవేస్తాయని నిపుణులు తెలుపుతున్నారు. జీవకోటికి ప్రాణహాని తలపెట్టే కోనోకార్పస్ మొక్కలను వేర్ల నుంచి తొలగించి, పర్యావరణ హితం కోసం ప్రభుత్వం నిషేధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. కోనో కార్పస్ మొక్క ప్రాణాంతకం అని తెలిసినా తెలంగాణ ప్రభుత్వం వాటిని తొలగించలేదు. జిల్లా కలెక్టర్లు, డిపిఓ లు, జడ్పి సిఈఓ లు, డిఆర్డిఎ పిడీ లు కోనో కార్పస్ మొక్కలు తొలగించడంలో పూర్తిగా విఫలమయ్యారు.

### అందం మాటున మృత్యువు

శంఖు రూపంలో (కోన్ ఆకారం)లో పచ్చగా, అందంగా, ఆకర్షణీయంగా కనిపించే కోనోకార్పస్ మొక్కలు, చెట్లు రహదారుల వెంబడి డివైడర్లలో, ఎక్కువగా కనిపిస్తుంటాయి. నగరాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు వివిధ దేశాలు గుబురుగా పెరిగే ఈ చెట్లను ఆదరించాయి. భారత్, పాకిస్తాన్, అరబ్, మధ్యప్రాచ్య దేశాల్లో ఈ మొక్కలను రహదారులు, గార్డెనింగ్, కమ్యునిటీ, అవెన్యూ ప్లాంటేషన్లలో భాగంగా విస్తృతంగా పెంచారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వాలు తమ నిర్ణయంపై వెనక్కి తగ్గాయి. కోనోకార్పస్ పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు కారణం అవుతోందని వృక్ష , పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా కోనోకార్పస్ మొక్కల పట్ల వ్యతిరేకత ప్రారంభమైంది. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరిత వనం నర్సరీల్లో కోనోకార్పస్‌ను పెంచవద్దని తెలంగాణ ప్రభుత్వం లిఖిత పూర్వక ఆదేశాలు జారీచేసింది. ఎంత చెప్పినా జిల్లా అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో సుందరీకరణలో భాగంగా ఈ మొక్కలను పెద్ద సంఖ్యలో పెంచి ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చి పెడుతున్నారు.

కోనోకార్పస్ అమెరికా ఖండాల్లోని తీర ప్రాంతానికి చెందిన మొక్క. ఇది ప్రధానంగా ఉత్తర అమెరికాలోని ఫ్లోరిడా సముద్ర తీర ప్రాంతంలో పెరిగే మాంగ్రూవ్ జాతి మొక్క. వేగంగా, ఎత్తుగా, పచ్చగా పెరిగుతుంది. అరబ్, మధ్య ప్రాచ్య దేశాల్లో ఎడారి నుంచి వచ్చే దుమ్ము, ఇసుక తుఫాన్లకు, వేగంగా వీచే వేడి గాలులకు అడ్డుగోడగా పనిచేస్తుందని మొదట్లో ఈ మొక్కలను విస్తృతంగా నాటారు. ఏపుగా ఒక కోన్ షేప్‌లో పెరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతాలను సందర్శించిన నర్సరీల నిర్వాహకులు, ప్లాంటేషన్ ఎక్స్‌పర్ట్ దీన్ని భారతదేశానికి తీసుకువచ్చారు. ఇక్కడ ముఖ్యంగా మున్సిపాలిటీలు ,అర్బన్ ఏరియాల్లో నాటారు. మన ప్రాంతానికి చెందిన మొక్కకాదు కాబట్టి ఇది పర్యావరణ సంబంధ దుష్ప్రభావాలను కలిగిస్తుంది. అంతే కాకుండా, శ్వాస సంబంద వ్యాధులు, అనేకరకాల ఎలర్జీలకు కోనోకార్పస్ కారణం అవుతుంది. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే పబ్లిక్ పార్కులలో కోనోకార్పస్ మొక్కల పెంపకాన్ని చేపట్టొద్దని స్థానిక పర్యావరణవేత్తలు ప్రభుత్వాన్ని కోరినప్పటికి అవన్ని బుట్ట దాఖలయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటనల్లో, గ్రామపంచాయతీల నర్సరీల్లో పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హరితహారంలో భాగంగా ఎక్కువగా నాటారు, విదేశీ జాతికి చెందిన ఈ మొక్క వల్ల పర్యావరణ, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, అందుకే వీటి పెంపకాన్ని ప్రోత్సహించవద్దని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమీషనర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులకు లిఖిత పూర్వక ఆదేశాలు ఇచ్చినప్పటికి అధికారులు కోనో కార్పస్ మొక్కలను తొలగించేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. వర్షాకాలంలో భాగంగా 'తెలంగాణకు హరితహారం' కోసం ఇప్పటికే ఆయా గ్రామపంచాయతీల నర్సరీల్లో ఈ మొక్కలను భారీగా పెంచారు. గత హరితహారాల్లో భాగంగా వేగంగా, ఎక్కువ పచ్చదనంతో పెరిగే ఈ మొక్కలను భారీ సంఖ్యలోనే జిల్లా వ్యాప్తంగా నాటారు. కాలనీలు, రహదారుల వెంబడి, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల ముందు అందం కోసం విరివిగా వీటిని పెంచారు. భూగర్భంలో ఉండే డ్రైనేజీ పైపులు, తాగునీటి పైపులను కూడా కోనోకార్పస్ మొక్క తన వేళ్లతో ధ్వంసం చేస్తోందని తెలియడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇరాక్ దేశంలోని 'మిసాన్ ప్రావిన్స్‌లో కోనోకార్పస్‌తో అక్కడి మౌలిక వసతులకు ఎదురైన పరిస్థితులు, కలిగిన నష్టాలపై 'యూనివర్సిటీ ఆఫ్ మిసాన్' 2020లో జరిపిన అధ్యయన ఫలితాల ఆధారంగా ఒక పరిశోధన పత్రం ప్రచురించింది. ఈ మొక్క వల్ల స్థానిక నివాస ప్రాంతాల్లోని వాటర్ పైప్ లైన్, డ్రైనేజీలకు నష్టం వాటిల్లినట్టు అందులో పేర్కొన్నారు.అయితే, ఈ మొక్క పచ్చదనానికి తోడ్పడుతున్నందున వాటి వేర్లు భూగర్భంలో లోతుగా, దూరంగా చొచ్చుకు పోయి నిర్మాణాలకు నష్టం చేకూరుస్తుందని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిర్మాణాలకు దూరంగా పెంచాలని ఈ పరిశోధనలు చెబుతున్నాయి. కాని అధికారులు మాత్రం ఇండ్ల మధ్యలో రోడ్ల మధ్యలో వీధులకు ఇరువైపుల అర్బన్ పార్కుల్లో నాటి భూగర్భ జలాలు మరింతగా ఇంకిపోయేలా చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి పార్కులో , వీధుల వెంట కోనోకార్పస్ చెట్లతో నింపేసారు. వాటిని చూసుకుంటూ వెళుతున్న అధికారులు వాటిని తొలగించాలనే స్పృహను కోల్పోతున్నారు. ఈ చెట్లను తోలగించకపోతే నీటి కష్టాలతో పాటు చిన్నారులు, పెద్దవయస్కుల ప్రాణాలు గాల్లో కలిసిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైన ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNI No. APTEL/2002/12105